॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ షోడశోఽ ధ్యాయః - దైవాసురసంపద్విభాగయోగః

## (పదునాఱవ అధ్యాయము - దైవాసురసంపద్విభాగ యోగము)

మూడవషట్కములో కృష్ణపరమాత్మ ఇంతవరకూ బోధించింది ఒక ఎత్తు, ఇప్పుడు బోధించబోయేది ఇంకొక ఎత్తు. 13, 14, 15 అధ్యాయాల్లో జ్ఞానబోధ జరిగింది. ఇప్పుడు అంటే 16, 17 అధ్యాయాల్లో కొత్త పంథా ప్రారంభిస్తున్నాడు.

దీనికి కారణం ఒక ముఖ్యమైన సూత్రం. ఆ సూత్రం మనిషియొక్క జీవితలక్ష్యం. మనిషియొక్క జీవితలక్ష్యానికీ, అతని జీవనవిధానానికీ అవినాభావసంబంధం ఉంటుంది. జీవితలక్ష్యం అంటే చిన్నచిన్న లక్ష్యాలు కాదు, ప్రాథమిక లక్ష్యం. ఈ లక్ష్యమూ, జీవనవిధానమూ ఒకదానితో ఒకటి ఎంతగా పెనవేసుకుని ఉంటాయంటే, ఒకదాని ప్రభావం ఇంకొకదానిమీద ఉంటుంది. లక్ష్యాన్నిబట్టి జీవితం ఉంటుంది; జీవితాన్నిబట్టి లక్ష్యం ఉంటుంది. ఒక పద్ధతిలో జీవితాన్ని గడుపుతూ దానికి భిన్నమైన లక్ష్యాన్ని ఎన్నుకోలేడు. జీవనవిధానాన్ని లక్ష్యానికి అనుగుణంగా మలచుకోవాలి. అలా లక్ష్యానికి తగ్గట్టుగా జీవితాన్ని మలుచుకుంటే, లక్ష్యాన్ని పొందటం సుగమమవుతుంది.

ఈ రెండింటి సంబంధాన్ని వేదం చాలా ముఖ్యమైన విషయంగా భావిస్తుంది. ఎలాగో జీవితాన్ని గడిపేస్తాను, మరేదో లక్ష్యాన్ని పొందుతాను అంటే రెండింటికీ పొత్తు కుదరదు. ఒకచెట్టు బాగా పెరగాలంటే దానికి అనువైన వాతావరణం ఉండాలి. అదే సూత్రం లక్ష్యానికి కూడా వర్తిస్తుంది.

అందువల్ల వేదపూర్వభాగం జీవనవిధానాన్ని నిర్దేశిస్తే, వేదాంతఃభాగం జీవితలక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. వేదపూర్వభాగం తెలియకపోతే మన హిందూ సంప్రదాయం అర్థంకాదు; వేదాంతఃభాగం నేర్చుకోకపోతే మనిషిగా మన అంతిమలక్ష్యం చేరుకోలేము. అందువల్ల వేదపూర్వభాగంలో నేర్పించిన జీవనవిధానం కూడా తెలుసుకోవాలి.

13, 14, 15 అధ్యాయాల్లో కృష్ణపరమాత్మ వేద అంతభాగంయొక్క బోధను బోధించాడు. అంటే బ్రహ్మజ్ఞానం ఎలా మన అంతిమలక్ష్యంగా ఉండాలో నేర్పించాడు. కాని దానితో అవినాభావ సంబంధం ఉన్న జీవనవిధానాన్ని గురించి బోధించకపోతే తన బోధ పూర్తికాదు అనుకున్నాడు. అందువల్ల మొదటి మూడూ లక్ష్యం గురించి మాట్లాడితే, తర్వాత వచ్చే రెండూ జీవనవిధానం గురించి చెబుతాయి.

ఒక వ్యక్తియొక్క జీవనవిధానం అతని నడవడికమీద ఆధారపడివుంటుంది. అంటే అతని జీవనవిధానంమీద అతని నడవడికయొక్క ప్రభావం చాలా ఉంటుంది. అంటే నడవడిక జీవనవిధానాన్ని నిర్దేశిస్తుంది; జీవనవిధానం జీవితలక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఇంతకుముందు రెండింటి మధ్య అవినాభావ సంబంధం చూశాము. ఇప్పుడు దానికి ఇంకొకదాన్ని జతచేస్తున్నాము. **నడవడిక, జీవనం, లక్ష్యం.** ఏదో ఒకదాన్ని మార్చాలనుకుంటే అది

అసంపూర్ణం అవుతుంది. మూడింటినీ ఒక తాటిమీద నడపాలి. ఈ సూత్రాన్ని అనుసరించి, మన శాస్త్రం మానవజాతియొక్క నడవడికను లోతుగా పరిశోధించింది. దాని లోతుల్లోకి వెళితే, అది చాలా లోతైన అంశం. నడవడిక చాలా ముఖ్యం. ఎందుకంటే అది మన జీవనవిధానాన్ని, తద్వారా మన లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది.

ఈ ప్రవర్తనను అనేక రకాలుగా విభజిస్తారు. సందర్భాన్నిబట్టి నాలుగు రకాలు అంటారు, మూడు రకాలు అంటారు, రెండు రకాలు అంటారు. ఇక్కడ మానవ నడవడికమీద మూడురకాల స్వభావాల విశ్లేషణను చూద్దాము. అవి – ద్వేషప్రధానస్వభావం, రాగప్రధానస్వభావం, జ్ఞానప్రధానస్వభావం.

ఎ) **ద్వేషప్రధానస్వభావం** – ద్వేషం ప్రధానంగా ఉంటుంది ఇటువంటి వ్యక్తుల్లో. దానికి కారణాలు అనేకం చెప్పవచ్చు. పూర్వజన్మవాసనలు కావచ్చు; ఈ జన్మలో ఎదుర్కొన్న సంఘటనలు కావచ్చు; చిన్నతనంలో పడ్డ బాధలు, అవమానాలు కావచ్చు; తల్లిదండ్రుల పెంపకం కావచ్చు; స్నేహితుల ప్రభావం కావచ్చు. మనమిప్పుడు కారణం లోతుల్లోకి వెళ్ళటం లేదు. కారణం ఏదైనా వారి ప్రవర్తన ద్వేషప్రధానంగా ఉంటుంది. అంటే వారికి త్వరగా ఏదీ నచ్చదు. ప్రతిదానిలోనూ తప్పులు పడతారు. 'తప్పులెన్నువాడు స్వర్గంలో కూడా తప్పులెన్నుతాడు,' అని సామెత. అటువంటివారి మాటలు ఎప్పుడూ విమర్శనాత్మకంగా ఉంటాయి. ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తారు; కుటుంబసభ్యులను విమర్శిస్తారు; టీవీ కార్యక్రమాలను తప్పుపడతారు; ఆఖరికి భగవంతుణ్ణి కూడా వదలరు.

ఒక్కోసారి ఈ ద్వేషాన్ని బయటకు ప్రదర్శించే అవకాశం ఉండదు. పెద్దవారు అణగద్రొక్కవచ్చు, పరిస్థితులు నోరు మూయించవచ్చు, లోపల అగ్నిజ్వాలలు రేగుతున్నా బయటకు చెప్పుకోలేని పరిస్థితి రావచ్చు. అలా అణగద్రొక్కబడిన ద్వేషం ఎనలేని కోపానికి దారితీస్తుంది. ఏదిచూసినా కోపం ముంచుకువస్తుంది. ఆ విధంగా ద్వేషప్రధానంగా ఉన్న నడవడిక క్రోధప్రధానంగా మారుతుంది; క్రోధం ఎక్కువైనకొద్దీ అది ఎవరిమీదో చూపించాల్సి ఉంటుంది. అందువల్ల క్రోధప్రధాన వ్యక్తి హింసప్రధాన వ్యక్తిగా మారుతాడు. పెద్ద కారణం అవసరం లేదు. ప్రతి చిన్నదానికీ అగ్నిపర్వతంలా విరుచుకుపడతాడు. ఇటువంటి ప్రవృత్తిని శాస్త్రం **రాక్షసస్వభావం** అంటుంది.

ఎందుకు వీరిది రాక్షసస్వభావం అంటుంది? ఎవరైనా ఇలా మనుష్యులమీద అయినదానికీ, కానిదానికీ విరుచుకుపడుతుంటే, వారి దగ్గరకు కావాలని ఎవరైనా వెళతారా? అలా వెళితే కొరివితో తల గొక్కున్నట్టు అవుతుంది అనుకుంటారు. కొన్ని ఇళ్ళల్లో చూడండి, అంతవరకూ స్వేచ్ఛగా తిరుగుతూ, కబుర్లు చెప్పుకుంటూ, టీవీ చూస్తూ ఉన్న కుటుంబసభ్యులు తండ్రి ఇంట్లోకి అడుగుపెడుతున్నాడని తెలియగానే, ఇంకా చెప్పాలంటే, అంతదూరంనుంచి కారుహారన్ వినబడగానే ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్. చిన్న అలికిడి కూడా వినబడదు. వారంత బుద్ధిమంతులు ఉండరనుకుంటారు ఎవరైనా చూస్తే. ఎందుకలా నటిస్తారు? దుర్వాసుడు ఇంటికి వచ్చాడు, ఆయన కోపం భరించలేమనే భయంతో.

**రక్షంతి జనాః యేభ్యః ఇతి రాక్షసాః**

ఇటువంటి వారినుంచి జనాలు రక్షణ కావాలనుకుంటారు. రాక్షసుడు పదం రక్షధాతువునుంచి వచ్చింది. రక్ష అంటే రక్షణ. అంటే ఇటువంటి స్వభావం ఉన్నవారినుంచి పారిపోయి రక్షణ పొందాలనుకుంటారు ఎదుటివారు.

ఇటువంటి స్వభావాన్ని ద్వేషప్రధానస్వభావం అంటారు. వీరు ఎదుటివారి భావాలను పట్టించుకోరు. ఎదుటివారితో దురుసుగా, వారి మనస్సు బాధపడేలా, మాట్లాడతారు. అలా బాధపెడుతున్నామని కూడా

కొందరికి తెలియదు. ముళ్ళపంది వంటివారు అనవచ్చు. ముళ్ళపంది మనుష్యుల మధ్యలో దూరితే ఏమవుతుంది? అందరికీ ముళ్ళు గుచ్చుకుంటాయి. వారి మాటలు కూడా ఎదుటివారి గుండెల్లో ముళ్ళలా గుచ్చుకుంటాయి. మాటలే కాదు ఆలోచనలు, చర్యలు కూడా ఎదుటివారికి బాధ కలిగించేవిగానే ఉంటాయి. వారి జీవనవిధానం వారికీ, ఇతరులకూ కూడా అవస్థగానే ఉంటుంది. కాని బాధాకరమైన విషయం ఏమిటంటే, వారికి అది బాధాకరమైన విషయమని తెలియదు.

ద్వేషప్రధానంగా ఉండే ఇటువంటి స్వభావం ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడదు సరికదా, దారుణమైన విషయం ఏమిటంటే వారిని ఆధ్యాత్మికంగా ఇంకా కిందకు లాగుతుంది. ఇటువంటి వారిని రాక్షసస్వభావులు అంటారు. రాక్షసులు అంటే భీకరంగా కోరలతో ఉండాలనేం నియమం లేదు; రాక్షసప్రవృత్తి ఉంటుంది.

బి) **రాగప్రధానస్వభావం** – వీరిలో రాగం ఎక్కువగా ఉంటుంది. అంటే ప్రతిదానిమీదా బంధం ఎక్కువగా పెంచుకుంటారు. అనేక కోరికలు ఉంటాయి; ఆ కోరికలు తీరటానికి అనేక కర్మలు చేస్తారు. ఎటువంటి కోరికలు? పేరుప్రఖ్యాతులు రావాలి, బాగా డబ్బు సంపాదించాలి, మంచిహోదా ఉండాలి, సుఖాలలో తేలిపోవాలి అనుకుంటారు. జీవితం అంటే ఆనందమే ఆనందం అనుకుంటారు. అందువల్ల ఆధ్యాత్మిక చింతనమీద మనస్సు పోదు; అసలు దానిగురించి ఆలోచించే తీరికే ఉండదు. అన్నీ తేలిగ్గా తీసుకుంటారు. వీరివల్ల ఎదుటివారికి ఏమీ హాని కలుగదు కాని వారి జీవితమూ బాగుపడదు. వీరి స్వభావం రాగప్రధానంగా ఉంటుంది; అందువల్ల కామప్రధానంగా మారుతుంది. వీరి జీవితం ఎంతసేపూ బాహ్యముఖంగా సాగుతుంది; ఎంతసేపూ డబ్బు, హోదా, కీర్తి వంటి వాటి వెంట పరుగులు తీయటమే సరిపోతుంది. క్షణం ఆగి అంతర్ముఖులు అయ్యే తీరికే ఉండదు. ఇటువంటి స్వభావం కూడా ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడదు.

ఒక సుగుణం ఏమిటంటే, వీరు ఇతరులను హింసించరు కాబట్టి వీరు ఆధ్యాత్మికంగా కిందపడరు; కాని ఆధ్యాత్మికంగా ఎదగనూ లేరు. కిందా పడరు, పైకీ లేవరు. ఎక్కడున్నవారు అక్కడే నిలిచిపోతారు. ఎందుకంటే ఇటువంటి వారికి మతం, ఆధ్యాత్మికతవంటి పెద్దపెద్ద విషయాలమీద శ్రద్ధ ఉండదు. డబ్బు సంపాదించటానికి, జీవితం అనుభవించటానికి దేవుడెందుకు అంటారు. కష్టపడితే అదే డబ్బు వస్తుంది; డబ్బు ఖర్చుపెడితే అదే ఆనందం వస్తుంది. దేవుడేం చేస్తాడు మధ్యలో అనుకుంటారు వీరు.

ఒక స్త్రీ, జీవితమనే పరుగుపందెంలో పాల్గొంటున్న తన భర్తను గీతాబోధకు తీసుకువెళ్దామని ప్రయత్నించిందట. అతను వెళ్ళకపోగా, 'ఇలాంటి బోధలు బలహీనమైన మనస్సు ఉన్నవారికి లేదా అనారోగ్యంతో బాధపడతున్నవారికి కావాలి. నాకేం నేను నిక్షేపంగా ఉన్నాను. నాకు ఆరోగ్యం పుష్కలంగా ఉంది; మనోధైర్యం మెండుగా ఉంది. నాకే సమస్యా లేదు. తీరికూర్చుని నన్నెందుకు ఇబ్బంది పెడతావు,' అన్నాడుట.

చాలామంది ఈ రెండవరకం మనుష్యుల్లోకి వస్తారు. వారితో మనకేమీ ఇబ్బంది లేదు, చాలా మర్యాదగా మాట్లాడతారు, పెద్దమనిషి తరహాగా ఉంటారు, కాని నాస్తికులుగా ప్రవర్తిస్తారు. వారి భాషలో భగవంతుడు అవసరం లేదు, వేదాంతం అసలే అవసరం లేదు. జీవితాన్ని హాయిగా అనుభవించటానికి మతం ఎందుకు అంటారు. ఇంకా మాట్లాడితే, ఒక అడుగు ముందుకువెళ్ళి అసలు మతంవల్ల, ఆధ్యాత్మిక చింతనవల్లనే సమాజంలో

గొడవలు అవుతున్నాయి, వీటిని ఆపాలి అంటారు. ఎందుకు? ఎక్కడో చెదురుమదురుగా వార్తలు చదువుతారు– మతకలహాల గురించి, ఆధ్యాత్మికత పేరుతో చేసే మోసాల గురించీను. అంటే వారు భగవంతుణ్ణి పూర్తిగా ద్వేషించకపోయినా, లౌకిక వ్యవహారాలలో ఎంతగా మునిగితేలుతారంటే, దానికి ఆధ్యాత్మికత ఎందుకు అంటారు. ఆధ్యాత్మికతకు, శాస్త్రానికి చోటులేదు వారి జీవితంలో. నిజానికి ఇప్పటి యువతరం చాలామటుకు ఇలాంటి ధోరణిలో పడిపోతున్నది.

ఒకసారి ఒక వార్తాపత్రికలో ఒక చిన్నవ్యాసం వచ్చింది. అది నిజమో కాదో తెలియదు. ఒక అమ్మాయిని చూడటానికి పెళ్ళివారు వచ్చారు. అన్నీ మాట్లాడుకున్నాక, పెళ్ళివారు వెళ్ళిపోగానే, అమ్మాయి నాకీ సంబంధం వద్దని తెగేసి చెప్పింది. ఎందుకని తల్లిదండ్రులు రెట్టించి అడిగితే, వారు ఏదో తీవ్రవాదులులాగా ఉన్నారు అందిట. అదేమిటని అడిగితే ఆ వచ్చినవారి నుదుటిమీద విభూతి, కుంకం ఎక్కువగా ఉన్నాయిట. ఇలాంటివి ఎక్కువగా పెట్టుకోవటంవల్లనే సమాజంలో విభజనలు జరుగుతున్నాయి, మతకలహాలు జరుగుతున్నాయి అందిట. ఆ అమ్మాయి దృష్టిలో విభూతి, కుంకం తప్పయిపోయాయి. ఇది ఎంతవరకూ నిజమో తెలియదు కాని, ఇలాంటి పరిస్థితి వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఇది రాగప్రధానస్వభావంయొక్క పరిస్థితి. ఈ పిల్లలు చెడ్డవారు కాదు, అనైతికంగా ప్రవర్తించటం లేదు. అద్భుతంగా ఆలోచించగలరు, తార్కికంగా ఆలోచించగలరు. కాని మన సాంప్రదాయానికి దూరంగా వెళ్ళిపోతున్నారు. లౌకిక విషయాల్లో పడిపోతున్నారు. కృష్ణపరమాత్మ ఇటువంటి స్వభావం ఉన్నవారిని ఆసురీ స్వభావం అంటున్నాడు.

**అసుషు రమంతే ఇతి అసురాః**

అసురులు అంటే రాక్షసులు కాదు. అసుః అంటే ఇంద్రియాలు. రమంతే అంటే రమించటం. ఇంద్రియ విషయాలలో రమించేవారు అని అర్థం. వీరికి ఎంతసేపూ జీవితం ఆనందంగా, సందడిగా, హడావుడిగా ఉండాలి. ఇంతకుముందు చూసినట్టుగా వీరు ద్వేషప్రధానంగా ఉన్నవారిలాగా ఆధ్యాత్మికంగా కిందపడరు కాని, ఆధ్యాత్మికంగా ఎదుగుదల కూడా ఉండదు.

సి) **జ్ఞానప్రధాన స్వభావం** – వీరి లక్ష్యం జ్ఞానం పొందటం. మన సాంప్రదాయం ఒక బాలునికి చిన్నవయస్సులోనే ఉపనయనం చేయించి, అతనికి సంధ్యావందనం చెయ్యటం నేర్పిస్తుంది. అందులో జ్ఞానం కోరుతాడు బ్రహ్మచారి. దాని అర్థం ఏమిటో తెలియని వయస్సులోనే అటువంటి ప్రార్థనను చొప్పించింది మన శాస్త్రం.

మన సాంప్రదాయంలో జ్ఞానాన్ని, ముఖ్యంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని జ్యోతితో పోలుస్తారు. అందువల్లనే పొద్దున్న లేవగానే దీపాన్ని వెలిగించాలి. ఏ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నాకూడా జ్యోతిప్రజ్వలనంతో ప్రారంభిస్తారు. చివరికి సినిమా ప్రారంభోత్సవంలో కూడా జ్యోతిప్రజ్వలనం చేస్తారు. ఆ సినిమాలో హింస చూపించినా ప్రారంభోత్సవం మాత్రం చాలా ప్రశాంతంగా సాగుతుంది. అలా మన భారతదేశం ఆధ్యాత్మికతకు

పుట్టినిల్లు. మనుష్యులు ఎంతైనా లౌకికంగా ఎత్తులకు ఎదగనీయండి, వారి జీవితంలోంచి ఆధ్యాత్మికత పూర్తిగా మాయమవదు. ఏదోరూపంలో, ఎక్కడో అక్కడ ఉంటూనే ఉంటుంది.

ఈ జ్ఞానప్రధానస్వభావం ఉన్నవారు జ్ఞానానికే పెద్దపీట వేస్తారు. అందువల్ల జ్ఞానం పెంపొందించుకోవటానికి తోడ్పడే పరిస్థితులకే ప్రాముఖ్యతను ఇస్తారు. అంటే వారు పేరుప్రఖ్యాతులను, ఐశ్వర్యాన్ని అసలు పట్టించుకోరని కాదు అర్థం; కాని ఆ సాధన వారి ఆధ్యాత్మికసాధనకు అడ్డుపడేదిగా ఉండకూడదు. వారు పొందే సరదాలు కూడా భగవంతుని చుట్టూ అల్లుకుని ఉంటాయి. వారు సంగీత కచేరీకి వెళతారు; నాట్యం చూడటానికి వెళతారు. ఎందుకు? ఆ కార్యక్రమాల్లో భగవంతునిమీద పాటలు, నృత్యాలు ఉంటాయి కాబట్టి.

కొన్ని నృత్యాల్లో ముఖ్యంగా రాధాకళ్యాణంలో దీపప్రదక్షిణం ఉంటుంది. మన శాస్త్రానికి తెలుసు, మనిషి చాలా హుషారుగా, చురుగ్గా ఉంటాడని; అతనికి సందడి, అరుపులు కావాలనీను. అందువల్ల ఇటువంటి నృత్యాలను ఏర్పాటు చేసింది. అలాగే సామూహిక భజనలు ఏర్పాటు చేసింది. కాని ఏం చేసినా ఇవన్నీ జ్ఞానప్రధానంగా ఉంటాయి. జ్ఞానాన్ని దీపంతో పోలుస్తుంది. జ్ఞానప్రధానస్వభావం మూడవ స్వభావం. దీనిని కృష్ణపరమాత్మ దైవస్వభావః అంటున్నాడు. దేవః అంటే కాంతి, ప్రకాశం. దివ్ ధాతువునుంచి వచ్చింది ఇది.

**దివ్యతే ప్రకాశతే ఇతి దేవః**

ప్రకాశం జ్ఞానానికి ప్రతీక.

ఆ విధంగా మూడురకాల స్వభావాలు ఉన్నాయి. అది దైవస్వభావం, అసురస్వభావం, రాక్షసస్వభావం. ఈ మూడురకాల స్వభావాలను **సంపత్తి** అంటున్నారు. సంపత్తి అంటే సంపద. ఇవి ఆయా వ్యక్తులకు సంపదలు. ఎందుకంటే వారి స్వభావానికి అనుగుణంగా ఉన్న సంపదతో వారి జీవితలక్ష్యాలను పొందగలరు. ఎలా?

ఇంతకుముందు కూడా చూశాము. స్వభావం జీవనవిధానాన్ని నిర్దేశిస్తుంది; జీవనవిధానం లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. మొదటిదీ, చివరిదీ కలిపితే స్వభావం లక్ష్యాన్ని కొనిబెడుతుంది. లక్ష్యాన్ని కొనిబెడుతుంది కాబట్టి దాన్ని సంపద అన్నారు. అందువల్లనే ఈ అధ్యాయానికి పేరు దైవాసురసంపద్విభాగయోగము అని పేరు వచ్చింది.

కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో మనం పైన చూసిన మూడురకాల సంపదలను గురించి చెప్పబోతున్నాడు. దైవస్వభావం ఆంతరసంపద; అది మంచిలక్ష్యాలను సాధించటానికి తోడ్పడుతుంది. తర్వాతది ఆసురీసంపత్తి లేదా ఆసురీస్వభావం. అది దానికి తగ్గ లక్ష్యాలను సాధించిపెడుతుంది. మూడవది రాక్షసీసంపత్తి. అది దానికి తగ్గ ఫలాలను ఇస్తుంది. అందువల్ల రాక్షససంపత్తిని కూడా కలిపి ఈ అధ్యాయాన్ని **దైవాసురరాక్షససంపద్విభాగయోగః** అనవచ్చు.

ఈ మూడురకాల సంపదలను గురించి వివరించాక, కృష్ణపరమాత్మ అర్జునునికి చెప్పబోతున్నాడు, 'ఓ అర్జునా! నీకు జ్ఞానం కావాలన్నా లేదా మోక్షం పొందాలన్నా కూడా దైవీసంపత్తిని పాటించాలి.' నాకు ఆధ్యాత్మిక జ్ఞానం వద్దు అనేవారికి మనమేమీ చెప్పలేము. కాని ఆత్మజ్ఞానానికి, మోక్షానికి విలువనిచ్చేవారికి, వారి జీవనవిధానం దానికి తగ్గట్టుగా ఉండాలి; వారి స్వభావం దానికి తగ్గట్టుగా ఉండాలంటే, వారు దైవీసంపత్తిని పెంపొందించుకోవాలి.

అందువల్ల మీరు మీ జీవితంలో వేసే ప్రతి అడుగూ ఆచితూచి వెయ్యాలి. మీరు తినే ఆహారం, మీరు చూసే టీవీ కార్యక్రమం, మీరు చదివే వారపత్రిక, మీరు ఆనందం పొందే విషయాలు, మీకు ఉన్న స్నేహితుల మనస్తత్వం, మీరు మీ ఖాళీసమయాన్ని వినియోగించే విధానం – ప్రతి ఒక్కటీ, ప్రతి చిన్నపనినుంచి పెద్దపని దాకా ప్రతిదీ మీ జీవనవిధానానికి తోడ్పడుతుంది. ఆ జీవనవిధానం ముందుముందు మీరు ఆశించిన లక్ష్యాన్ని పొందుతారో లేదో నిర్ణయిస్తుంది.

ముందు అధ్యాయాల్లో కృష్ణపరమాత్మ జీవితలక్ష్యం ఏం ఉండాలో వివరించాడు. అంటే వేదాంతఃభాగాన్ని బోధించాడు. ఇప్పుడు వేదపూర్వభాగంనుంచి బోధ చెప్పబోతున్నాడు. అందువల్లనే భగవద్గీతను వేదాలసారం అంటారు. వేదాపూర్వభాగం, వేదాంతఃభాగం రెండూ ముఖ్యమే. ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. వేదపూర్వభాగం జ్ఞానయోగ్యత గురించి చెబితే, వేదాంతఃభాగం జ్ఞానాన్ని బోధిస్తుంది.

**కర్మయోగము + ఉపాసనయోగము + జ్ఞానయోగము = మోక్షము**

ఈ సూత్రాన్ని మనం చాలాసార్లు చూశాము. కర్మయోగం, ఉపాసనయోగాలు చిత్తశుద్ధిని, చిత్త ఏకాగ్రతను కలుగజేస్తాయి. ఈ రెండు కలిపి జ్ఞానయోగ్యతను ప్రసాదిస్తాయి. కర్మ, ఉపాసనల గురించి వేదపూర్వభాగం బోధిస్తుంది. ఇప్పుడు మనం చూడబోయే 16వ అధ్యాయం, తర్వాత వచ్చే 17వ అధ్యాయం కూడా వేదపూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని వచ్చినవే. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 1 **అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥**
అభయమ్, సత్త్వసంశుద్ధిః, జ్ఞానయోగవ్యవస్థితిః,
దానమ్, దమః చ, యజ్ఞః, చ, స్వాధ్యాయః, తపః, ఆర్జవమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అభయమ్ | = నిర్భయత్వము | దమః | = ఇంద్రియనిగ్రహము |
| సత్త్వసంశుద్ధిః | = అంతఃకరణశుద్ధి | యజ్ఞః | = అగ్నిహోత్రాది ఉత్తమ కర్మాచరణము |
| జ్ఞానయోగవ్యవస్థితిః | = జ్ఞానమందు, యోగమందు నిరంతర దృఢస్థితి | స్వాధ్యాయః | = వేదశాస్త్రముల పఠన, పాఠనములు, భగవన్నామ గుణకీర్తనలు |
| చ | = ఇంకా | తపః | = స్వధర్మాచరణమందలి కష్టములను ఓర్చుకొనుట |
| దానమ్ | = సాత్త్వికదానము | చ | = ఇంకా |
| | | ఆర్జవమ్ | = శరీరేంద్రియ అంతఃకరణముల సరళత్వము |

**అభయమ్, సత్త్వ-సంశుద్ధిః, జ్ఞాన-యోగ-వ్యవస్థితిః, దానమ్,**
**దమః చ యజ్ఞః చ, స్వాధ్యాయః, తపః ఆర్జవమ్ ॥**

తా: నిర్భయత్వము, అంతఃకరణశుద్ధి, జ్ఞానమందు, ధ్యానయోగమందు నిరంతర దృఢస్థితి ఇంకా సాత్త్వికదానము, ఇంద్రియనిగ్రహము, అగ్నిహోత్రాది ఉత్తమ కర్మాచరణము, వేదశాస్త్రముల పఠన, పాఠనములు, భగవన్నామ గుణకీర్తనలు, స్వధర్మాచరణమందలి కష్టములను ఓర్చుకొనుట ఇంకా శరీరేంద్రియ అంతఃకరణముల సరళత్వము.

## 1. దైవీసంపత్తి – శ్లోకాలు: 1–3

మొదటి మూడు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ దైవీసంపత్తి కింద వచ్చే కొన్ని సుగుణాలను పేర్కొంటున్నాడు. అవి ముందుగా వేదాంతాన్ని నేర్చుకోవటానికి, తర్వాత ఆ జ్ఞానినిష్ఠలో నిలబడటానికి అవసరమైన జ్ఞానయోగ్యతను ప్రసాదిస్తాయి. జ్ఞానం పొందటం, జ్ఞాననిష్ఠలో నిలబడటం రెండూ సమానంగా ముఖ్యమే. ఎందుకంటే జ్ఞానం పొంది, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడగలిగితేనే, జ్ఞానఫలాన్ని అనుభవించగలుగుతాడు.

ఈ అధ్యాయంలో కూడా అర్జునుడు ఏమీ ప్రశ్న వెయ్యకుండానే కృష్ణపరమాత్మే స్వయంగా బోధను మొదలుపెట్టాడు. ముందే చూసినట్టుగా జ్ఞానం పొందాలంటే, ఆ జ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హత ఏమిటో కూడా తెలుసుకోవాలి. ఒక లక్ష్యాన్ని సాధించాలంటే, దానికి తగ్గ జీవనవిధానాన్ని తెలుసుకోవాలి. ఉదాహరణకు ఒకచెట్టును ఎలా పెంచాలో నేర్పించాలంటే, ఆ చెట్టు ఏ వాతావరణంలో బాగా పెరుగుతుందో కూడా నేర్పించాలి. ఎందుకంటే నేల రకరకాలుగా ఉంటుంది. ఒక ప్రాంతంలో పెరిగే మొక్క ఇంకొక ప్రాంతంలో పెరగలేదు. నేల ఒక్కటే కాదు, ఆ ప్రాంతం వాతావరణం, నీటివనరులు, వర్షపాతం, ఆ ప్రాంతం తీరుతెన్నులు – అనేక అంశాలు తోడ్పడతాయి. ఏర్కాడులాంటి కొండప్రాంతంలో పెరిగే మొక్కలను మోజుపడి చెన్నైలాంటి నీరు ఎక్కువ దొరకని ప్రాంతంలో పెంచుదామని ప్రయత్నిస్తే, అవి ఎక్కువరోజులు బ్రతకవు.

ఇదే సూత్రం ఆత్మజ్ఞానానికి కూడా వర్తిస్తుంది. ఆత్మజ్ఞానం పొందాలంటే దానికి అనువైన జీవనవిధానం ఉండాలి. అందువల్లనే పూర్వం సాంప్రదాయానికి ఎక్కువ విలువను ఇచ్చేవారు. మన సాంప్రదాయాన్ని స్తుతిస్తూ, తక్కిన సాంప్రదాయాల వారితో కలువనిచ్చేవారు కాదు. ఎందుకు? వారి సాంప్రదాయాన్ని చిన్నబుచ్చటానికి కాదు, కాని మన సాంప్రదాయం పాటించే విలువలు వేరు; మన సాంప్రదాయం బోధించే అంతిమలక్ష్యం వేరు. వారి విలువలు వేరు, వారి లక్ష్యం వేరు. ఒక సాంప్రదాయం ఎక్కువా కాదు, ఇంకొకటి తక్కువా కాదు. కాని మార్గాలు వేరు. మనమార్గంలో దాన్ని కలుపలేము.

అందువల్ల కృష్ణపరమాత్మ జీవనవిధానాన్ని కూడా బోధిస్తేనే తన బోధ పూర్తి అవుతుందని భావిస్తున్నాడు. ఈ మూడు శ్లోకాల్లో దైవీసంపత్తి కిందికి వచ్చే కొన్ని గుణాలను పేర్కొంటున్నాడు. ఈ విలువలు పూర్తిగా కొత్తవి కావు. వీటి గురించి కృష్ణపరమాత్మ పదమూడవ అధ్యాయంలో 8–12 శ్లోకాల్లో చెప్పాడు.

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్ ।**

**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥** – 13.8

ఈ విలువలకు ఒక పేరు కూడా ఇచ్చాడు కృష్ణపరమాత్మ. నిజానికి భగవద్గీతను కాలక్షేపానికి చదివినట్టుగా చదవకూడదు. ఇది క్లాసురూమ్ టీచింగ్‌లా ఉంటుంది. అందువల్ల అక్కడ కృష్ణపరమాత్మ ఈ విలువలకు ఇచ్చిన పేరేమిటో మీరే వెనక్కి వెళ్ళి చూసుకోవాలి. కాని ఇలా మధ్యలో పరీక్షలు పెడితే ముందుకు సాగకపోవచ్చు కొందరికి. అందుకని మీకు శ్రమలేకుండా చెప్పేస్తున్నాము. దాన్ని జ్ఞానం అన్నాడు కృష్ణపరమాత్మ.

**ఏతత్ జ్ఞానమ్ ఇతి ప్రోక్తమ్ అజ్ఞానమ్ ఏతత్ అన్యథా**

ఇప్పుడు ఈ శ్లోకంలో పేర్కొన్న విలువలను వరుసగా ఒక్కొక్కటిగా చూద్దాము.

1. **అభయమ్** – అభయం అంటే ధైర్యం, ఆత్మస్థైర్యం. మీమీద మీకు నమ్మకం, భగవంతునిమీద నమ్మకం, గురువుమీద నమ్మకం, శాస్త్రంమీద నమ్మకం ఉండాలి. కాని అన్నిటికన్నా ముఖ్యమైనది మీమీద మీకు నమ్మకం ఉండాలి. మీమీద మీకు నమ్మకం ఉంటేనే మీరు ఏదైనా సాధించగలరు. ఆత్మజ్ఞానం పొందాలంటే అది ఒక గొప్ప సాహసయాత్ర. ఎవరెస్ట్ శిఖరం ఎక్కినదానికన్నా, మరే సాహసయాత్రకన్నా కూడా గొప్ప సాహసయాత్ర ఆధ్యాత్మికయాత్ర. అందువల్ల దీనికి చాలా ఆత్మస్థైర్యం కావాలి.

**నాయమాత్మా బలహీనేన లభ్యః** – ముండకం

బలహీనమైన మనస్సు ఉన్నవ్యక్తికి ఆత్మజ్ఞానం లభించదు. అందువల్ల ఈ ప్రయాణాన్ని సాహసయాత్ర అన్నారు.

ఎ) **లక్ష్యం విలువ గుర్తించటం** – ఈ ఆత్మజ్ఞాన సాధనలో పట్టువదలని విక్రమార్కునిలా కొనసాగాలంటే, ఈ విద్య విలువ తెలియాలి. కాని అదంత తేలికగా తెలియదు. డబ్బు విలువ అందరికీ తెలుసు. చిన్న పిల్లవానికి కూడా దానివిలువ తెలుసు. హోదా విలువ, ఆస్తిపాస్తుల విలువ, అధికారం విలువ అందరికీ తెలుసు. ఇటువంటి వాటి గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. కాని ఆత్మజ్ఞానం విలువ చాలామందికి తెలియదు. ఆత్మజ్ఞానం పొందాలంటే మానసిక పరిపక్వత ఉండాలి. అంత పరిపక్వత అందరికీ రాదు. అందువల్లనే ఆత్మజ్ఞానం గురించి చాలా తక్కువమందికి తెలుసు. అందువల్ల దీనికి ఎక్కువమంది రారు.

**మనుష్యాణం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే** – 7.3

అందువల్ల ఈ ఆధ్యాత్మిక సాధన చేసేవారు చాలా తక్కువమంది ఉంటారు. తరచు ఇది ఒంటరి పోరాటంగా సాగుతుంది. అందువల్ల ఈ మార్గంలోకి రావటానికి, వస్తే నిలబడటానికి చాలా ఆత్మస్థైర్యం ఉండాలి; గట్టి పట్టుదల ఉండాలి.

ఒంటరిగా స్వర్గసుఖాలు అనుభవించేకన్నా పదిమందితో కలసి నరకంలో బాధలు పడటం మేలు అంటారు కొందరు. అందువల్ల ఒంటరిగా ప్రయాణం చెయ్యటానికి చాలా సాహసం కావాలి. అదికాక, మంచిమార్గంలో వెళతామంటే తోడు వచ్చేది పోయి, ఏడిపించేవారు, వెనక్కి లాగేవారే ఎక్కువగా ఉంటారు.

'గీతాబోధకు వెళుతున్నావా? ఇప్పట్నుంచే వెళుతున్నావా? ఏమంత కష్టం వచ్చింది? ప్రేమలో వైఫల్యం చెందావా? వ్యాపారంలో నష్టపోయావా? ఇన్నాళ్ళూ బాగానే ఉన్నావనుకున్నానే!' ఇలా ప్రశ్నల వర్షం కురిపిస్తారు. గీత పెద్దవయస్సులో నేర్చుకోవాలి. అదీ ఏదైనా కష్టం వచ్చినప్పుడు నేర్చుకోవాలి అనే అపోహ చాలామందికి ఉంది. అలాంటి అపోహతో మిమ్మల్ని నాలుగుసార్లు దెప్పిపొడిచారంటే, మీ ఉత్సాహం కూడా నీరుగారిపోయి, మీరూ గీతాబోధకు వెళ్ళటం మానేసే ప్రమాదం ఉంది. ఇప్పట్నుంచీ ఎందుకు, తర్వాత చూసుకుందాం లే అనుకుంటారు.

అందువల్ల అభయం ఉండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి ఆటంకాలు ఎదురైనా, ఒంటరి పోరాటం చెయ్యాల్సివచ్చినా, మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలి. ఇటువంటి అభయాన్ని పెంపొందించుకోవటం ఎలా? పొందాల్సిన లక్ష్యంయొక్క విలువ తెలిస్తే, ఎన్ని ఆటంకాలు ఎదురైనా చప్పబడిపోరు. అందువల్ల ఆటంకం ఎంత పెద్దది అనేది, మీ లక్ష్యంమీద మీకున్న తీవ్రత ఎంత ఎక్కువ అనేదానిమీద ఆధారపడివుంటుంది. లక్ష్యంమీద తీవ్రత తక్కువగా ఉంటే, ఆటంకాలు పెద్దవిగా అయి భయపెడతాయి. లక్ష్యంమీద తీవ్రత పెద్దదిగా ఉంటే, ఆటంకాలు వీగిపోతాయి.

దీన్నిబట్టి ఆటంకాలు ఎంత పెద్దవి అనేది ఆటంకాలనుబట్టి నిర్ణయించలేమని తెలుస్తున్నది. కొంతమందికి ఇంటినుంచి బస్టాండ్ దాకా నడవటమే అసాధ్యం. మరికొంతమంది సునాయాసంగా ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కేస్తారు. చిన్న వాన వస్తేనే స్కూలుకు ఫోన్ చేసి స్కూలు ఉందా ఇవాళ అని అడుగుతారు.

అందువల్ల మీ లక్ష్యంమీద మీకు తీవ్రశ్రద్ధ లేకపోతే ఆటంకమనే చిరుగాలికే ఆ లక్ష్యం చెదిరిపోతుంది. లక్ష్యం ఆధ్యాత్మిక లక్ష్యమే అవాలనిలేదు. ఇది జీవితంలో మీకున్న ఏ లక్ష్యానికైనా వర్తిస్తుంది.

అందువల్ల ఆత్మస్థైర్యం పెంచుకునే ఒకమార్గం లక్ష్యం విలువ గుర్తించటం.

బి) **శరణాగతి** – భగవంతునికి మిమ్మల్ని మీరు అర్పించుకోవటం. ఆయనమీదే పూర్తిభారం వేయటం. నామీదే పూర్తిభారం వెయ్యమని కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు.

**అనన్యాశ్చింతయంతో మామ్ యే జనాః పర్యుపాసతే** –9.22

సన్యాసం స్వీకరించాలంటే ఆస్తిపాస్తులను, ఇల్లువాకిళ్ళను, భద్రతా అంశాలను వదులుకోవాలి. ముందెలా జీవితం గడుస్తుందో తెలియదు. ఇప్పుడంటే కొన్ని ఆశ్రమాలు ఉన్నాయి కాని పూర్వం సన్యాసులకు ఇలాంటి సదుపాయాలు లేవు. కాని ఎందరో సన్యాసం స్వీకరించేవారు. వారికా ధైర్యం ఎక్కడ్నుంచి వచ్చింది? భగవంతుని మీద ఉన్న అపారమైన భక్తి వారు శరణాగతి పొందేలా చేసింది.

ఈ విధంగా వివేకం, భక్తి, అభయాన్ని పెంపొందింపజేస్తాయి. అందువల్ల అభయాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

2. **సత్త్వసంశుద్ధిః** – అంతఃకరణశుద్ధి కలిగి ఉండటం. ఇక్కడ సత్త్వ అంటే అంతఃకరణం; సంశుద్ధి అంటే శుద్ధి. అందువల్ల అంతఃకరణశుద్ధి. అంతఃకరణశుద్ధి అంటే ఏమిటి? ఆరోగ్యకరమైన ఆలోచనలను కలిగివుండటం. మనస్సును పాడుచేసే ఆలోచనలు లేకపోవటం.

శారీరక ఆరోగ్యానికి కూడా కొన్ని ఆహారపదార్థాలు మేలుచేస్తే, కొన్ని విషంలా మారతాయి. అవి శారీరక ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. ఇదే సూత్రాన్ని మనస్సుకు కూడా అన్వయించాలి. కొన్ని ఆలోచనలు మనస్సుకు హాని చేస్తాయి. ఈర్ష్య, అసూయ, ద్వేషం, భయంవంటి ఆలోచనలు మనస్సులో చాలాకాలం ఉంటే అవి మనస్సుకు విషంగా మారి, మనస్సు బద్ధలయ్యేలా చేస్తాయి. లేదా మనస్సును నిర్వీర్యం చేస్తాయి. అందువల్ల సత్త్వసంశుద్ధి అంటే అంతఃకరణశుద్ధి పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

3. **జ్ఞానయోగవ్యవస్థితిః** – మీ జీవనయాత్రలో మీ అంతిమలక్ష్యం ఏదవ్వాలో దాని గురించి ఎన్నడూ మర్చిపోకూడదు. మనిషిగా పుట్టినందుకు ఆత్మజ్ఞానం పొందాలి. జ్ఞానం సహజంగా, దానంతట అదే ఏర్పడదు. కొన్ని విషయాలు మీ ప్రమేయం లేకుండా, వాటంతట అవే జరిగిపోతాయి. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా వయస్సుమీద పడుతుంది. దాని ప్రభావం కూడా మీ శరీరంమీద కనబడుతుంది. మొహంలో ముడతలు ఏర్పడుతాయి; జుట్టు రాలుతుంది; ఉన్నజుట్టు తెల్లగా అవుతుంది; దంతాలు ఒకటొకటిగా ఊడుతాయి. వీటన్నిటికీ మీరేం సాధన చేశారు? ఏమీ చెయ్యలేదు. అవి సహజంగా వస్తాయి. అవన్నీ కాలం తెచ్చే మార్పులు.

కాని జ్ఞానం విషయంలో ఈ సూత్రం వర్తించదు. ఆత్మజ్ఞానమే కాదు ఏ జ్ఞానం కూడా దానంతట అది వచ్చేయదు. మీరు నైతికవిలువలు పాటిస్తూ, మంచి జీవితం గడిపితే ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ డిగ్రీ వచ్చేస్తుందా? నైతికవిలువలను పాటించే జీవితం మంచిదే కాదనటం లేదు; కాని అది ఫిజిక్స్‌లో జ్ఞానాన్ని అలా అలవోకగా ఇచ్చేయదు. ఒక కాలేజీలో చేరాలి; ఫిజిక్స్ లెక్చరర్ చేసే బోధ వినాలి; ఫిజిక్స్ పుస్తకంలోంచి నేర్చుకోవాలి. అప్పుడు కూడా వెంటనే డిగ్రీ వచ్చేస్తుందని చెప్పలేము. ఒకటో రెండో పరీక్షల్లో ఫెయిల్ అయినా అవవచ్చు. తర్వాత దానిలో గొప్పగా ఉత్తీర్ణులవుతారు.

అందువల్ల జ్ఞానం దానంతట అది కలుగదు. చెట్టుమీంచి ఆకు రాలినట్టుగా, చెట్టుమీంచి పండు రాలినట్టుగా జ్ఞానం ఎక్కడినుంచో రాలిపడదు. దానికి చాలా శ్రమ పడాలి. అందువల్లనే కృష్ణపరమాత్మ జ్ఞానయోగవ్యవస్థితిః అన్నాడు. జ్ఞానయోగాన్ని ఒక తపనతో పాటించాలి. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. శ్రవణం నిర్వచనమే చాలాసార్లు చూశాము. శ్రవణం అంటే క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో, కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థవంతమైన గురువువద్ద వేదాంతశాస్త్రం అధ్యయనం చెయ్యటం. శ్రవణం జ్ఞానాన్ని కలుగజేస్తే, మననం నిశ్చయజ్ఞానాన్ని కలుగజేస్తే, నిదిధ్యాసనం జ్ఞాననిష్ఠలో నిలబడటానికి తోడ్పడుతుంది. జ్ఞాననిష్ఠలో నిలబడితే మీరు నేర్చుకున్న జ్ఞానం ప్రకారమే మీ జీవితం సాగుతుంది. అంటే మీ జీవితం మీరు పొందిన జ్ఞానమార్గంలో సాగుతుంది. వ్యవస్థితి అంటే జ్ఞాననిష్ఠలో ఉండటం; జ్ఞానయోగంలో జ్ఞానం అంటే శ్రవణ, మననాలు. యోగం అంటే నిదిధ్యాసనం. అందువల్ల జ్ఞానయోగం అంటే శ్రవణ మనన నిదిధ్యాసనలు చెయ్యటం.

**విలువలు పాటించకపోతే జ్ఞానయోగం అసంభవం**
**జ్ఞానయోగానికి రానిదే విలువలు అసంపూర్ణం**

కేవలం విలువలు ఉంటే చాలదు. అవి మోక్షాన్ని ఇవ్వలేవు. వ్యవస్థితిః అంటే ఆషామాషీగా ప్రయత్నించటం కాదు, ఆ నిష్ఠలో నిలబడటం. అందువల్ల జ్ఞానయోగవ్యవస్థితి పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

4. **దానమ్** – శాస్త్రం మెచ్చుకునే అనేక ముఖ్యమైన విలువల్లో దానం ఒక ముఖ్యమైన విలువ.

**తమేతం వేదాను వచనేన బ్రహ్మణా వివిదిషంతి**
**యజ్ఞేన దానేన తపసాఽనాశకేన ఏతమేవ విదిత్వా మునిర్భవతి** – బృహదారణ్యకం

ఈ ఉపనిషత్తు మూడు విలువలను స్తుతిస్తున్నది. అవి యజ్ఞం, దానం, తపస్సు. కృష్ణపరమాత్మ కూడా ఈ మూడు విలువలను బృహదారణ్యకోపనిషత్తునుంచి గ్రహించి వాటి గురించి వివరంగా 17, 18 అధ్యాయాల్లో చెబుతాడు.

ఇక్కడ దానాన్ని మాత్రం చూస్తాము. దానం గొప్ప విలువే కాదు, పాటించటం కష్టం కూడా. ఎందుకు గొప్ప విలువ? దానికి అనేక కారణాలు ఉన్నాయి.

ఎ) **లోభమ్** – మనిషికున్న లోభమనే మానసిక దౌర్బల్యాన్ని పారద్రోలటానికి తోడ్పడుతుంది. లోభం అనే దౌర్బల్యం అభద్రతాభావనవల్ల కలుగుతుంది. ఈ అభద్రతాభావన ప్రతి ఒక్కరినీ పట్టిపీడిస్తుంది. రేపేమవుతుంది? నాకు ఏదైనా అనారోగ్యం వస్తే ఏమవుతుంది? నన్ను వృద్ధాశ్రమంలో ఎవరైనా చూస్తారా?

ఇటువంటి అభద్రతాభావన తంబూరశ్రుతిలాగా మనస్సును దొలిచేస్తుంటుంది. ఈ అభద్రతాభావన ఎందుకు ఏర్పడిందో కూడా మనకు తెలియదు; కాని మనకు బాహ్యమైన వస్తువులు ఉంటే ఈ అభద్రతాభావన పోతుందనే పొరపాటు పడతాము. కాని ఇది పొరపాటు; సత్యం కాదు. ఎలా చెప్పగలము? ఆస్తి, ఐశ్వర్యం ఉంటే భద్రత ఉంటుందంటే కోట్లకు పడగలెత్తినవారు ఎంత ఆనందంలో మునిగితేలాలి? కాని వారిలో కొందరు ఈ అభద్రతా భావనకు లోనవుతుంటారు. దానికి పూర్తి విరుద్ధంగా చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా నిశ్చింతగా ఉన్నవారు మరికొందరు ఉంటారు.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా తెలుస్తోంది. బాహ్యమైన వస్తువుల్లో ఆనందం లేదు. ఆస్తికీ, ఆనందానికీ సంబంధం లేదని అర్థమవుతోంది. ఇది సత్యమే అయినా, మోహం మనను ఎంతగా కట్టిపడేస్తుందంటే, మనం ఇంకా ఇంకా సంపాదించాలి అనే భ్రమలో ఉన్నాము. ఇంకా ఇంకా సంపాదించాలనే భ్రమను **లోభం** అంటారు. మళ్ళీ లోభంలో రెండురకాలు ఉన్నాయి.

ఎంత ఉన్నా తనివితీరదు. ఇంకా ఇంకా కావాలనే వెంపర్లాట సాగుతుంది. ఇది ఒకరకం లోభం. రెండవ రకం ఉన్నదానిలోంచి ఏమీ దానం చెయ్యటానికి ఇష్టపడకపోవటం. రెండూ కలిపితే ఎక్కువ కావాలనుకోవటం, చిల్లిగవ్వ కూడా దానం చెయ్యకపోవటం. ఈ రెండింటినీ కలిపి లోభం=అత్యాశ+పీనాసితనం అనవచ్చు. మనిషిలో ఈ లోభం ఎందుకు ఉందంటే, ఎంత ఎక్కువ ఆస్తి ఉంటే, అంత భద్రతాభావన ఉంటుందనే అపోహ కలిగివుండటంవల్ల. అంతేకాదు, ఈ లోభం అనేక సమస్యలకు దారితీస్తుంది.

**అధార్మిక జీవితం** – ఎప్పుడైతే ఒక వ్యక్తిని అత్యాశ పట్టిపీడిస్తుందో, అప్పుడే అతనికి తెలియకుండానే ధర్మం హద్దులని దాటేస్తాడు. అతని అత్యాశ ధర్మం నోరు నొక్కేస్తుంది. ఆ విధంగా లోభం అధర్మానికీ, తద్వారా పాపానికీ, తద్వారా హింసకూ దారితీస్తుంది.

**అనుమానం** – లోభం ఉన్నవ్యక్తి ప్రతివారినీ అనుమానదృష్టితో చూడటం మొదలుపెడతాడు. తనమీద ఎవరైనా కాస్త అభిమానం చూపినా, అది నిష్కల్మషమైన ప్రేమ అనుకోడు. ఆఖరికి ఈ అనుమానమనే జబ్బు కుటుంబసభ్యులను కూడా వదలదు. కుటుంబసభ్యులు తనమీద ప్రేమ చూపించినా, తన డబ్బుకు ఎరవేస్తున్నారు అనుకుంటాడు. ఈ లోభంనుంచి బయటపడటానికి ఒకటే మార్గం. అది దానగుణం పెంపొందించుకోవటం.

బి) **అహింస** – సమాజంలో దానగుణం లేకపోతే, కొంతమంది మాత్రమే విపరీతంగా డబ్బు చేసుకుంటారు. ధనవంతులు, బీదవారు అని రెండు తెగలు ఏర్పడిపోతాయి. వారి మధ్య దూరం పెరుగుతుంది. వేళ్ళమీద లెక్కపెట్టేంత ధనవంతులు, వేలకొద్దీ బీదవారు ఉంటారు. ఆ పేదరికాన్ని భరించలేక అనేక అక్రమాలకు పాల్పడతారు కొందరు. దారిదోపిడీలు, దొంగతనాలు, ధనవంతులైన పిల్లలను అపహరణ, హత్యలు పెరిగిపోతాయి.

ఇలాంటి వార్తలు వార్తాపత్రికల్లో చదివేసరికి, అంతకంతకూ కోటీశ్వరుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతాయి. తమాషా ఏమిటంటే, ఏ ధనమైతే తనకు భద్రతను ఇస్తుందనుకుని అవసరమైతే విలువలను కూడా కాలరాచి ప్రోగేసాడో, ఇప్పుడా ధనమే అతనికి విషనాగు అయికూర్చుంది. ఎప్పుడే దొంగతనం అవుతుందో, ఎప్పుడెవరు తన బాబును ఎత్తుకుపోతారోవంటి భయాలు రాజ్యమేలుతాయి. కంటినిండా నిద్ర ఉండదు. ఈ విధంగా సమాజంలో సమతుల్యత దెబ్బతింటుంది. ఈ సమతుల్యతను మళ్ళీ నిలబెట్టాలంటే, ధనవంతులు అవసరమైన వారికి దానం చేసే మంచిగుణాన్ని పెంపొందించుకోవాలి. దానగుణం సమాజభద్రతను కాపాడుతుంది.

సి) **వైరాగ్యం** – దానగుణం ఉంటేనే మీకు వైరాగ్యం ఉందో లేదో తెలుస్తుంది. ఇవ్వకతప్పని పరిస్థితుల్లో దానం చేసినా, అది మనస్ఫూర్తిగా చేసివుండరు. అలాంటప్పుడు మనస్సు కుమిలిపోతూనే ఉంటుంది. అదే వైరాగ్యం గనుక పెంపొందించుకోగలిగితే, దానాన్ని సంతోషంగా చెయ్యగలుగుతారు. అందువల్ల దానం చాలా మంచిగుణం.

డి) **ప్రాయశ్చిత్తకర్మ** – దానం ప్రాయశ్చిత్తకర్మగా కూడా తోడ్పడుతుంది. ఈ జీవనయానంలో తెలిసో తెలియకో అనేక పాపాలు చేసివుంటాము. వాటిని దురితకర్మలు అంటారు. ఆ దురితకర్మల ఫలం తగ్గించుకోవటానికి శాస్త్రం అనేక ప్రాయశ్చిత్తకర్మలను సూచించింది. వాటిలో ఒకటి దానం. అందులో ఎవరైనా మరణించినప్పుడు, దశదినకర్మలలో అనేక దానాలు చేయిస్తారు పిల్లలచేత. నిజానికి ఆ దానాలు మనం బ్రతికివుండగా చెయ్యాలి. కాని అలా దానం చెయ్యాల్సివస్తే డబ్బు పోవటంకన్నా ప్రాణం పోయినంతపని అవుతుంది కొందరికి. అందువల్ల మరణించాక పిల్లలచేత 16 దానాలు, 18 దానాలు ఇప్పిస్తారు. ఇప్పుడు వాటికి కూడా తేలిక మార్గాలు కనిపెట్టారు. నిజంగా దానం ఇవ్వకుండా కాసిని డబ్బులు, అక్షతలతో సరిపెడుతున్నారు. కాని దానం గొప్ప ప్రాయశ్చిత్తకర్మ.

ఇ) **మరణభయం ఉండదు** – నిజానికి దానగుణం పెంపొందించుకుంటే, ఆ అద్భుతమైన సాధన మరణాన్ని శాంతియుతంగా భావించేలా చేస్తుంది. ఎందుకంటే ఇన్నాళ్ళూ నిద్రాహారాలు మాని, కష్టపడి ప్రోగేసిన డబ్బులను మన వెంట తీసుకెళ్ళలేము. ఇన్నాళ్ళూ ఎంతో అపురూపంగా చూసుకున్న ఇల్లు, ఐశ్వర్యం, బ్యాంకులో దాచుకున్న లక్షలు – వీటిలో చిల్లిగవ్వ కూడా మనతో తీసుకెళ్ళలేము. ఆఖరికి మనం ఎంతో అపురూపంగా చూసుకుంటున్న ఈ స్థూలశరీరాన్ని కూడా మనతో తీసుకెళ్ళలేము. అది ఇక్కడే కాలి బూడిద అవ్వాల్సిందే. ఈ జగత్తు లేదా భగవంతుడు మనకు ఇచ్చినవన్నీ అణాపైసలతో సహా తిరిగి ఇచ్చేయాలి.

బొత్తిగా దానగుణం లేకపోతే, చివరి ప్రయాణంలో ఈ నగ్నసత్యాన్ని జీర్ణించుకోలేక చాలా బాధపడతాము. ముందునుంచీ దానగుణం ఉండి, ధారాళంగా విరాళాలు ఇవ్వటం అలవాటు ఉందుంటే, చివర్లో మిగిలినవి వదులుకునే వైరాగ్యం తేలిగ్గా వంటబడుతుంది. అప్పుడు మరణాన్ని కూడా దానంగా భావించగలుగుతాము. ఈ జన్మ భగవంతుడు ఇచ్చినదే, ఇది అనువైన సమయం చూసి ఆయనకే సంతోషంగా తిరిగి ఇవ్వాలని అర్థం చేసుకుంటాము. మనం ఎన్ని దాచుకున్నా, మనకు అవి ఆనందాన్ని కలుగజేసినా, యమధర్మరాజు వాటిని మననుంచి తీసేస్తాడు. మనం బాధపడుతూ మరణించాలి.

అందువల్ల పైన చెప్పిన కారణాల దృష్ట్యా, దానగుణం పెంపొందించుకోవాలి. ఇలా దానగుణం గురించి ఎంతైనా చెబుతూ పోవచ్చు. మిగిలింది మీరు ఊహించుకోవాలి. దానం అత్యంత గొప్ప ఆధ్యాత్మికసాధన. మొదట్లో కనీసం మనకు పనికిరాని వస్తువులనైనా దానం చెయ్యటం నేర్చుకోవాలి. ఆరునెలలుగా ఒక వస్తువును వాడలేదంటే, అది మనకు పనికిరాని వస్తువు అనే అర్థం. దాన్ని సంతోషంగా దాని అవసరం ఉన్నవ్యక్తికి దానం చెయ్యాలి.

కొంతమంది పండుగల ముందు ఇల్లంతా సర్ది, కొన్నింటిని అనవసరమైన వస్తువులుగా భావించి, సర్దటం అయ్యాక వాటిని ఎవరికైనా ఇద్దామని తీసి పక్కన పెడతారు. తీరా వాటిని ఇవ్వాల్సిన సమయం వచ్చేసరికి మనసొప్పదు. ఇంకోసారి చూద్దాంలే అని మళ్ళీ భద్రంగా అటక ఎక్కించేస్తారు. కొంతమంది చూస్తూ చూస్తూ ఖాళీ అగ్గిపెట్టెలను కూడా పారేయలేరు. మనవడు ఆడుకుంటాడులే అనుకుంటారు. కొడుక్కే ఇంకా పెళ్ళికాలేదు; రాబోయే మనవడికోసం ఆరాటం.

**శతేషు జాయతే శూరః సహస్రేషు చ పండితః**
**వక్తా శతసహస్రేషు దాతా భవతి వా న వా**

వందమందిలో ఒక శూరుడు ఉంటాడుట. శూరుడు అంటే ధైర్యశాలి. వేలమందిలో ఒక పండితుడు ఉంటాడుట. శతసహస్రేషు అంటే లక్షమందిలో ఒక మంచి వక్త ఉంటాడుట. వక్త అంటే మంచి గురువు. లాఖోం మే ఏక్ అంటారు హిందీలో. లక్షమందిలో అన్నా ఒక మంచి గురువు ఉంటాడు కాని, **దాతా భవతి వా న వా**– అసలైన దాతను చూడటం చాలా అరుదైన విషయం అంటున్నాడు కవి. అది అరుదైన విషయం కాని, అసాధ్యం కాదు. అందువల్ల దానగుణం పెంపొందించుకోవాలి. ముందు అవసరంలేనివి ఇవ్వగలిగితే, తర్వాత మనకు అపురూపమైనవి కూడా ఇవ్వటం మొదలుపెడతాము. మనం దాచుకున్న వస్తువు ఇంకొకరికి చాలా అవసరం కావచ్చు. అందువల్ల దానగుణం పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

5. **దమః** – దమః అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియనిగ్రహం అంటే ఇంద్రియాలను అణగద్రొక్కటం కాదు. అలా అణగద్రొక్కితే అది బలవంతమవుతుంది; అలా ఏదైనా బలవంతంగా చేస్తే అది నిరాశానిస్పృహలకు దారితీస్తుంది. శాస్త్రం అటువంటి పద్ధతిని ఎన్నడూ సూచించదు. వివేకంతో ఆలోచిస్తే, ఇంద్రియాలు కోరుతున్నవి మన ఎదుగుదలకు మంచివి కావని తెలుస్తుంది. మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఏది మంచిమార్గమో మనమే విచక్షణాశక్తిని ఉపయోగించి, ఇంద్రియాలు ఆశించే విషయవస్తువులు మంచివికావని గట్టిగా అర్థం చేసుకుంటే, ఇంద్రియనిగ్రహం పాటించటం తేలిక అవుతుంది. దాన్ని ఇంద్రియాలమీద ఆధిపత్యం వహించటం అంటారు. దానికి భిన్నంగా, ఎవరో ఏదో చెప్పారని బలవంతంగా మన కోరికలను కాదంటే, దాన్ని ఇంద్రియాలను అణగద్రొక్కటం అంటారు.

ఇంద్రియనిగ్రహానికి, ఇంద్రియాలను అణగద్రొక్కటానికి మధ్య ఉన్న భేదం ఏమిటి? ఎవరో చెపితే చేస్తే అది అణగద్రొక్కటం. నేను చేస్తున్నపని తప్పు అని నాకు నమ్మకంగా అనిపించి నేను మనస్ఫూర్తిగా మానితే అది ఇంద్రియనిగ్రహం. దీన్ని ఇంద్రియజయం అంటారు. అణగద్రొక్కితే మనస్సు దెబ్బతింటుంది; నిగ్రహం పాటిస్తే మనస్సు ఆరోగ్యకరంగా ఉంటుంది. అందువల్ల దమః అంటే ఇంద్రియనిగ్రహం పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

6. **యజ్ఞః** – యజ్ఞః అంటే అసలు అర్థం తీసుకుంటే దైవపూజ. యజ్ ధాతువునుంచి వచ్చింది అది. అందువల్ల దైవపూజ. మన శాస్త్రం రెండురకాల దైవపూజలను నిర్దేశించింది. ఒకటి అక్షరాలా పూజ చెయ్యటం, ఇంకొకటి చేసే పనిని పూజగా మలుచుకోవటం.

ఎ) **అక్షరాలా పూజ** – ఇది నిత్యపూజ. ఇంట్లో చేసే పూజ లేదా ఆలయాల్లో చేసే పూజలు, హోమాలు, యజ్ఞాలు. అంటే పూజలో చేసే అనేక రకాలు.

బి) **ఈశ్వరార్పణ భావన** – మనం చేసే కర్మలను యోగంగా మలుచుకోవటం. వర్క్ ఈజ్ వర్షిప్ అంటారు ఇంగ్లీషులో. మనం చేస్తున్న పనినే పూజగా మలుచుకోవాలి. దీన్ని కర్మయోగం అంటారు. అంటే భావనలో పరివర్తన రావటం. భావనలో పరివర్తన అంటే ఏమిటి? ఏ పని చేసినా ఈశ్వరార్పణభావనతో చెయ్యటం. ఎప్పుడైతే మనం చేసే కర్మను ఈశ్వరునికి అర్పిస్తామో, అప్పుడే ఆ పనిని శ్రద్ధగా, మనస్ఫూర్తిగా, సంతోషంగా, ఉత్సాహంగా చేస్తాము. అది ఏ పనైనా సరే. ఒక మామూలు దైనందిన కార్యక్రమమైనా సరే, చాలా ముఖ్యమైన పని అయినా సరే, ఒకే శ్రద్ధ చూపిస్తాము. దీన్ని **ఈశ్వరార్పణభావన** అంటారు. ఇది కర్తపరంగా భావన.

చేసిన ప్రతిపనికీ ఏదో ఒక ఫలం వస్తుంది. అది మనం ఆశించిన ఫలం అవచ్చు, కాకపోవచ్చు; మనం కోరుకున్న మెప్పు పొందవచ్చు, పొందలేకపోవచ్చు; మనమీద ఇతరులు కృతజ్ఞత చూపించవచ్చు, చూపించక పోవచ్చు. కాని మనం చలించము. ఏదొచ్చినా ఈశ్వరప్రసాదభావనతో స్వీకరిస్తాము. భోక్తగా ఇది మన స్పందన. ఎప్పుడైతే ఈశ్వరార్పణభావనతో చేస్తామో అప్పుడే దానికి వచ్చిన ఫలితాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తాము. ఈ రెండింటినీ కలిపి కర్మయోగం అంటారు.

**కర్మయోగం = ఈశ్వరార్పణభావన + ఈశ్వరప్రసాదబుద్ధి**

**యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్** – శివమానసపూజ

ఓ దేవా! నేను ఏ కర్మ చేసినా కూడా, అది నీకు చేసే ఆరాధనే సుమా అంటున్నాడు భక్తుడు.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్** – 9.27

ఇది కూడా ఒక రకమైన పూజే. ఇప్పుడు ఈ రెండురకాల పూజల్లో ఏది ముఖ్యం? రెండూ ముఖ్యమే. రోజూ ఇంట్లో చేసే పూజను మానకూడదు. అలా నిత్యపూజ చేస్తేనే ఇంట్లో పవిత్రమైన వాతావరణం నెలకొని ఉంటుంది. వార్తల్లో దుష్టశక్తుల గురించి చదువుతుంటాము. ఇప్పుడు అందరిళ్ళల్లో కణ్‌దృష్టి వినాయకుని ఫోటో ఇంటి తలుపుకో, ఇంటిపైనో పెట్టటం ఆనవాయితీ అయిపోయింది. నాకు దిష్టి తగులుతోంది అంటుంటారు కొందరు.

శాస్త్రం దిష్టి, దుష్టశక్తులు అనే విషయాలకు విలువ నివ్వదు. అవి ఉన్నాయో లేదో పక్కనపెడితే, రోజూ పొద్దున్నే శ్రద్ధగా పూజచేసి, దేవుని ముందు దీపం వెలిగించి, స్తోత్రాలు చదివితే, అవే ఇంటిని ఒక ఆలయంగా, మంగళప్రదంగా చేస్తాయి. అంతేకాక, ఈ పూజ మీరు భావిస్తున్న ఏ దుష్టశక్తులు గాని, దిష్టి గాని మీకు సోకకుండా, రక్షణకవచంగా పనిచేస్తుంది.

అందువల్ల బాహ్యంగా చేసే పూజ చేసితీరాలి, అంతేకాకుండా మీరు చేసే ప్రతి పనిని కర్మయోగంగా మలుచుకోవాలి. కర్మయోగం అధ్యాయం చూసినప్పుడు పంచమహాయజ్ఞాలను చూశాము. అవి కూడా చెయ్యాలి. అందువల్ల యజ్ఞం చెయ్యటం అలవరుచుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

7. **స్వాధ్యాయః** – స్వాధ్యాయః అంటే ఆధ్యాత్మిక పారాయణం. దీన్ని బ్రహ్మయజ్ఞం అంటారు. పంచమహాయజ్ఞాల్లో ఇది ఒకటి. పూర్వం విధిగా స్వాధ్యాయం చేసేవారు కాని ఇప్పుడు అది తగ్గిపోతోంది. ఉదాహరణకు పూర్వం విధిగా మూడుసార్లు సంధ్యావందనం చేసేవారు; ఇప్పుడు ఒకసారి కూడా చెయ్యటం మానేశారు; గాయత్రీ మంత్రం పఠిస్తే గొప్ప.

ఈ స్వాధ్యాయం కూడా రెండురకాలు. మొదటిది శబ్దప్రధానం, రెండవది అర్థప్రధానంగా ఉంటుంది.

ఎ) **శబ్దప్రధానం** – దీన్ని పారాయణం అంటారు. పారాయణం అంటే స్తోత్రాలను పారాయణం చెయ్యటం. ఇది అన్ని దుష్టశక్తులనుంచీ కాపాడుతుంది; నిజంగా దుష్టశక్తులు ఉన్నా లేకపోయినా, అసలైన దుష్టశక్తి లౌకిక ప్రపంచంలో తలమునకలవటం. ధనమేరా అన్నిటికీ మూలం అనే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు మనుష్యులు. ఈ ధనాగమనతృష్ణకు గొప్ప విరుగుడు స్వాధ్యాయం. రోజుకు అధమపక్షం పదిహేను నిముషాలు ఏ విష్ణు సహస్రనామమో పారాయణం చెయ్యాలి. సంధ్యావందనం చేసినా, చెయ్యకపోయినా ఈ పారాయణం చేసితీరాలి. దీన్ని **శబ్ద ఆవృత్తిః** అంటారు.

బి) **అర్థప్రధానం** – రెండవరకం స్వాధ్యాయం అర్థం తెలుసుకోవటం. మొదటిది శబ్దప్రధానం. అర్థం తెలిసినా, తెలియకపోయినా పారాయణం చేస్తే అది ఇంటిని ఆలయంగా మారుస్తుంది. అర్థం తెలుసుకుని చేస్తే అది ఇంకా మంచిది. ఎలా చేసినా, స్వాధ్యాయం చెయ్యటం పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

8. **తపః** – స్వాధ్యాయస్తప పదాన్ని విడదీస్తే స్వాధ్యాయః+తపః అవుతుంది. తపః అంటే తపస్సు. తపస్సుకు అనేక అర్థాలున్నాయి. ఈ తపస్సు గురించి కృష్ణపరమాత్మ మళ్ళీ 17వ అధ్యాయంలో వివరంగా చెబుతాడు. అక్కడ తపస్సును మూడుగా విభజిస్తాడు. అవి సాత్త్విక తపస్సు, రాజసిక తపస్సు, తామసిక తపస్సు. ఇక్కడ తపస్సుయొక్క ఒక అర్థం చూద్దాము.

మనశ్శరీరాలను దిటవు పరచుకోవటానికి ప్రయత్నపూర్వకంగా కష్టపడటం. **కష్టసహిష్ణుత్వం తపః**. కష్టాన్ని సహించగలగటం. అంటే ప్రయత్నపూర్వకంగా మనమే కోరి, ఏదైనా కష్టమైన అనుభవాన్ని పొందటం. కాకపోతే అది మితిమీరకూడదు; హద్దుల్లోనే ఉండాలి. అలా చెయ్యటంవల్ల ఎటువంటి కష్టాన్నైనా తట్టుకుని నిలబడగలిగే శక్తి వస్తుంది. తపస్సుయొక్క ఉద్దేశ్యం అలా శరీరాన్ని గట్టిపరచుకోవటం. ఇవి అనేక రకాలుగా చెయ్యవచ్చు.

**శరీరపీడనం** – మనకు వ్రతాలరూపంలో, దీక్షారూపంలో అనేక తపస్సులు ఉన్నాయి. ఉదాహరణకు అయ్యప్పదీక్ష. కొంతమంది అయ్యప్పదీక్ష తీసుకుంటారు. ఆ దీక్షలో 40 రోజులు ఎన్నో నియమాలను పాటించాలి. నల్లదుస్తులు ధరించి, కాలికి చెప్పులు లేకుండా నడిచి, ఒంటిపూట భోజనం చేస్తారు. పొద్దున్నే చీకటితో లేచి దగ్గరున్న ఏదైనా ఆలయానికి వెళ్ళి పూజచేసి వస్తారు. సాయంకాలం భజనల్లో పాల్గొంటారు. నేలమీద పడుకుంటారు. ఇవికాక పెళ్ళిళ్ళకు, పేరంటాలకు వెళ్ళరు; విందువినోదాలలో పాల్గొనరు; అనవసరమైన కబుర్లు చెప్పరు. ఇలా ఎన్నో నియమాలను పాటిస్తారు. అలా మనశ్శరీరాలను చివర్లో వారు వెళ్ళే శబరిమలయాత్రకు సంసిద్ధం చేస్తారు. అక్కడ ఎన్ని మైళ్ళో కాలినడకన ముళ్ళబాటలో వెళ్ళాలి. ఇదంతా తపస్సు కిందికే వస్తుంది.

ఇలా దీక్ష తీసుకోకపోయినా చార్‌ధామ్‌యాత్రలకు వెళతారు కొందరు. బదరీ, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రిలను కలిపి చార్‌ధామ్ అంటారు. ఆ ప్రయాణం ఎంతో వ్యయప్రయాసలతో కూడినది. సన్నటి మార్గంలో, ఎత్తైన కొండమీద, జాగ్రత్తగా నడవాలి. గజగజలాడించే చలి ఉంటుంది. కాని ఇవేవీ ఆ యాత్రలు చేసేవారికి కష్టమనిపించదు. ఎందుకు? వారు మనస్ఫూర్తిగా ఇష్టపడి, ఆ యాత్రలు చేస్తున్నారు. ఎవరో బలవంతంగా చేయిస్తే కష్టం అనిపిస్తుంది కాని ఆ కష్టమే మనంతట మనం కోరి పడితే, అది తపస్సుగా మారుతుంది. అది మన మనశ్శరీరాలను గట్టిపరుస్తుంది.

ఉపవాసానికీ, తిండి లేకుండా మాడటానికీ మధ్య భేదాన్ని అంతకుముందు కూడా చూశాము. రెండింటి మధ్య భేదం పూర్తిగా మనం దాన్ని చూసే విధానంలో ఉంది. మనకు విపరీతమైన ఆకలివేసి, ఆహారం అందుబాటులో లేకపోతే అది మాడటం అవుతుంది; అదే ఆహారం అందుబాటులో ఉండికూడా, ఇవాళ ఏకాదశి అయి, మనం తినకుండా ఉండటానికి నిశ్చయించుకుంటే అది ఉపవాసం అవుతుంది. ఇలా కోరి కష్టాన్ని సహించటాన్ని తపస్సు అంటారు.

శంకరాచార్యులవారు దీన్ని శరీరపీడనం అంటున్నారు. పీడనమే కాని కోరి తెచ్చుకున్నది. ఎందుకు? శరీరాన్ని అనేక కష్టనష్టాలు ఓర్చుకునేలా చెయ్యటానికి. కొంతమంది కాస్త ఎండ వస్తే భరించలేరు; చినుకుపడితే తట్టుకోలేరు; చలికి గజగజలాడిపోతారు. కాని శరీరం ఎండకు ఎండి, వానకు తడవగలిగేలా ఉండాలి. ఇలా తట్టుకోగలిగే శక్తిని తితిక్ష అంటారు. ఇలాంటి తితిక్షను వేదాంతం చాలా ప్రయోజనకరమైన సాధన అంటుంది.

జ్ఞానం పొందటానికి జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందాలని చూశాము. జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందాలంటే సాధకునికి సాధనచతుష్టయ సంపత్తి ఉండాలి. అందులో ఒక సాధన శమాదిషట్కసంపత్తి. దానిలో ఒకటి తితిక్ష. దీనివల్ల అనేక లాభాలు ఉన్నాయి.

ఎ) **ప్రబల ప్రారబ్ధకర్మను తట్టుకునే స్థైర్యం** – ఇటువంటి తపస్సు గనుక మనం చెయ్యగలిగితే జీవితంలో ఎటువంటి కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగే గుండెధైర్యం వస్తుంది. జీవితంలో ఏదో ఒకస్థితిలో బాధలు అనుభవించక తప్పదు. కొన్ని బాధలను తప్పించుకోగలము కాని కొన్ని బాధలకు లేదా అనారోగ్యాలకు మందు ఉండదు. వాటిని భరించక తప్పదు. దాన్ని ప్రబలప్రారబ్ధకర్మ అంటారు.

దుర్బలప్రారబ్ధకర్మ కూడా బాధ కలుగజేస్తుంది కాని దానికి పరిష్కారం ఉంటుంది. ప్రబలప్రారబ్ధకర్మకు పరిష్కారం ఉండదు; దాన్ని తప్పించుకోలేము. అప్పుడేం చెయ్యాలి? దాన్ని తట్టుకుని నిలబడగలిగే శక్తిని పెంపొందించుకోవాలి. సైనికుల శిక్షణ చూడండి, చాలా తీవ్రంగా ఉంటుంది; వారి శిక్షణకాలంలో వారు ఎన్నో కష్టాలను భరించాలి; రోజుల తరబడి ఆహారం లేకుండా ఉండాలి; ఎన్నో మైళ్ళు పరుగెత్తాలి; కొండలు, గుట్టలు ఎక్కాలి; మరెన్నో పరీక్షలు ఉంటాయి. మనం అంత తీవ్రమైన పరీక్షలను ఎదుర్కోనవసరం లేకపోయినా, మనం కూడా కొన్ని క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనకతప్పదు. అందువల్ల మనచేతిలో లేని పరిస్థితులను ఎదుర్కోవటానికి తితిక్ష చాలా అవసరం.

బి) **అసంకల్పిత ప్రతీకారచర్యలను తప్పించుకోవచ్చు** – ఇటువంటి తితిక్షను పెంచుకుంటే, ఏదైనా అనుకోని పరిస్థితి ఎదురైతే వెంటనే, అసంకల్పితంగా స్పందించకుండా ఉండటం నేర్చుకోవచ్చు. ఎందుకు దేనికైనా వెంటనే స్పందిస్తాము? మనకు దేన్నీ భరించే ఓపిక ఉండదు కాబట్టి. అన్యాయాన్ని సహించలేము. మన మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. దేన్నీ భరించలేము. అందువల్ల ఏదైనా చూడగానే వెంటనే అరుస్తాము. ఆలోచించే సమయం ఉండదు; ఆలోచించకుండా చేసిన ఏ చర్య అయినా కూడా సరియైనది కాదు. ఎందుకంటే మనం చేస్తున్నది తప్పో, ఒప్పో బేరీజు వేసుకునే సమయం ఇవ్వటం లేదు మనం.

ఇలా వెంటనే కస్సుమని లేవకుండా ఉండాలంటే తితిక్షను పెంపొందించుకోవాలి. ఎవరైనా తప్పు చేస్తున్నట్టు అనిపించినా వెంటనే అరవకూడదు. ఆగి, ఆ పరిస్థితిని విశ్లేషించి, బాగా ఆలోచించి, సరియైన సమయంలో స్పందించాలి. అలా సరియైన సమయం వరకూ ఆగి, ప్రయత్నపూర్వకంగా ఆలోచించి ఏదైనా చేస్తే అది స్పందన అవదు, అది చర్య అవుతుంది. అలా వెంటనే స్పందించకుండా, మన ప్రతిస్పందనను వాయిదా వెయ్యాలంటే, దానికి తితిక్ష చాలా అవసరం; ఆ తితిక్ష తపస్సు అనే విలువను పాటిస్తే వస్తుంది. ఇది రెండవ లాభం.

సి) **కష్టాలనుంచి నేర్చుకోవటం** – భగవంతుడు మనకు జీవితంలో కష్టాలను కావాలని మనను బాధపెట్టటానికి ఇవ్వలేదు. ఆ కష్టాలనుంచి మనం ముఖ్యమైన పాఠాలను నేర్చుకోవాలని భగవంతుని ఉద్దేశ్యం. ప్రతి కష్టం వెనకా ఒక ముఖ్యమైన పాఠం ఉంటుంది. దాన్ని గ్రహించి, ఆ పాఠాన్ని నేర్చుకుని ఎదగాలి మనం.

ఆ విధంగా కష్టాలు మనకు పాఠాలు నేర్పిస్తాయి; ముఖ్యంగా ఆధ్యాత్మికంగా ఎదగటానికి తోడ్పడతాయి. కష్టంనుంచి పాఠం నేర్చుకోవాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. మనకు వచ్చిన కష్టం మన మనస్సును

బెంబేలెత్తించేస్తే, మనం నేర్చుకోవాల్సిన పాఠాన్ని నేర్చుకోలేము. ఎన్ని కష్టాలు పడ్డా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది అన్నట్టుగా మనం జీవితంలో ఎదగలేము.

అందువల్ల కష్టాలనుంచి పాఠాలు నేర్చుకోవాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి; మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే తితిక్ష అలవడాలి. అందువల్ల తితిక్షవల్ల మూడవలాభం పాఠాలు నేర్చుకోగలగటం.

నిజానికి భగవద్గీత మొదటి అధ్యాయం పేరు అర్జునవిషాదయోగము. అర్జునునికి కలిగిన విషాదాన్ని యోగంగా మలుచుకున్నాడు. అతనికి ముందు రాగం కలిగింది. రాగం శోకంగా, శోకం మోహంగా మారింది. కాని అప్పుడు తనకు బాహ్యంగా సహాయం కావాలని తెలుసుకున్నాడు. కృష్ణపరమాత్మను శరణు వేడాడు. అందువల్ల భగవద్గీత ఆవిర్భవించింది. శోకానికి కూడా ఆ విధంగా ప్రాముఖ్యత ఉంది. అది మనం ఆధ్యాత్మికంగా ఎదగటానికి తోడ్పడుతుంది. అలా తపస్సు తితిక్షను అలవరుస్తుంది. అందువల్ల తపస్సును పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

9. **ఆర్జవమ్** – ఆర్జవమ్ అంటే త్రికరణశుద్ధిగా ఉండటం. మనస్సు, వాక్కు, కర్మ – ఈ మూడూ ఒక్కత్రాటిమీద నడవాలి. అంటే మనస్సు ఆలోచించేదే వాక్కు రూపేణ బయటకు రావాలి; వాక్కు చెప్పినదే కర్మగా ఆచరించాలి. దీన్ని మనోవాక్కాయకర్మలు అంటారు. తత్త్వబోధలో పంచకోశాల గురించి నేర్చుకుంటాము. అవి అన్నమయకోశం–స్థూలశరీరం, ప్రాణమయకోశం–ప్రాణశక్తి, మనోమయకోశం–మనోశక్తి, విజ్ఞానమయకోశం–బుద్ధి, ఆనందమయకోశం–కోశానందం. ఈ ఐదింటినీ ఇంకోరూపంలో చెప్పాలంటే మనోవాక్కాయకర్మలు. ఈ మూడూ ఏకత్రాటిమీద నడిస్తే దాన్ని ఆర్జవం అంటారు. కొంతమంది ఆలోచించేది ఒకటి, చెప్పేది మరొకటి, చేసేది ఇంకొకటి ఉంటుంది. అలా ఉండకూడదు.

**మనస్యేకం వచస్యేకం కర్మణి ఏకం మహాత్మనమ్।**
**మనసి అన్యత్ వచసి అన్యత్ కర్మణి అన్యత్ దురాత్మనామ్॥**

మహాత్ముల మనస్సు, వాక్కు, కర్మలు ఏకత్రాటిమీద నడిస్తే, దురాత్ముల మనస్సు, వాక్కు, కర్మలు మూడు భిన్నమార్గాల్లో పోతాయి.

అలా మూడూ మూడు భిన్నమార్గాల్లో పరుగులు తీస్తుంటే, లోపల విపరీతమైన ఒత్తిడి ఏర్పడుతుంది. బాహ్యప్రపంచంతో సంబంధం లేదు ఈ ఒత్తిడికి. మనం చేతులారా చేసుకుంటున్నది. ప్రారంభదశలో ఈ ఒత్తిడి మనకు కూడా తెలియదు; కాని ఇలా రెండుగా చీలేసరికి మనకు తెలియకుండానే శారీరక అనారోగ్యం, మానసిక అనారోగ్యాలు కలుగుతాయి. అందువల్ల ఆర్జవం ఉండాలి. లేకపోతే మనస్సు చెదిరిపోతుంది. నిజానికి ఈ ఆర్జవాన్ని మనం పదమూడవ అధ్యాయంలోనే చూశాము. అమానిత్వం, అదంభిత్వం, అహింస, శాంతి, ఆర్జవం వచ్చాయి అక్కడ. అలా ఆర్జవం పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 2 **అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతిరపైశునమ్ ।**
**దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥**

అహింసా, సత్యమ్, అక్రోధః, త్యాగః, శాంతిః, అపైశునమ్,
దయా, భూతేషు, అలోలుప్త్వమ్, మార్దవమ్, హ్రీః, అచాపలమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహింసా | = | మనోవాక్కాయములద్వారా ఎవ్వరికిని ఏ విధమైన కష్టమును కల్గింపకుండుట | భూతేషు, దయా | = | సకల ప్రాణులందు నిర్హేతుకమైన కరుణ |
| సత్యమ్ | = | యథార్థంగా ప్రియంగా మాట్లాడటం | అలోలుప్త్వమ్ | = | ఇంద్రియ లౌల్యము లేకుండుట |
| అక్రోధః | = | తనకు అపకారము చేయువారిపై కూడ క్రోధము లేకుండుట | మార్దవమ్ | = | కోమలత్వము |
| త్యాగః | = | కర్మాచరణమునందు కర్తృత్వాభిమానమును త్యజించుట | హ్రీః | = | శాస్త్రవిరుద్ధమైన పనులు చేయుటకు వెనుకాడుట, |
| శాంతిః | = | చిత్తచాంచల్యము లేకుండుట | అచాపలమ్ | = | వ్యర్థచేష్టలు చేయకుండుట |
| అపైశునమ్ | = | ఎవరినీ నిందింపకుండుట | | | |

**అహింసా, సత్యమ్, అక్రోధః త్యాగః, శాన్తిః, అపైశునమ్,**

**భూతేషు దయా, అలోలుప్త్వమ్, మార్దవమ్, హ్రీః, అచాపలమ్ ॥**

తా: మనోవాక్కాయముల ద్వారా ఎవ్వరికిని ఏ విధముగను కష్టమును కల్గింపకుండుట, యథార్థంగా ప్రియంగా మాట్లాడటం, తనకు అపకారము చేయువారిపై కూడ క్రోధము లేకుండుట, కర్మాచరణమునందు కర్తృత్వాభిమానమును త్యజించుట, చిత్తచాంచల్యము లేకుండుట, ఎవరినీ నిందింపకుండుట, సకల ప్రాణులందు నిర్హేతుకమైన కరుణ, ఇంద్రియ లౌల్యము లేకుండుట, కోమలత్వము, శాస్త్రవిరుద్ధ మైన పనులు చేయుటకు వెనుకాడుట, వ్యర్థచేష్టలు చేయకుండుట.

10. **అహింసా** – అహింస గురించి కూడా చాలా వివరంగా పదమూడవ అధ్యాయంలో చూశాము. అహింస అంటే కాయిక, వాచిక, మానసిక స్థాయిల్లో హింస చూపకపోవటం. ప్రకృతిసూత్రం ఏమిటంటే ప్రపంచానికి మనం ఏది ఇస్తే, అది మనకు తిరిగివస్తుంది. గోడమీదకు మనం బంతి ఎంత వేగంగా విసిరితే, అంత వేగంగానూ అది తిరిగివస్తుంది. న్యూటన్స్ థర్డ్ లా ఆఫ్ మోషన్ అదే చెబుతుంది, 'ఎవ్విరి ఏక్షన్ హాజ్ ఆపోజిట్, అండ్ ఈక్వలెంట్ రియాక్షన్.' అంటే ప్రతి ఒక్కచర్యకు ఎదురు సమానమైన ప్రతిచర్య ఉంటుంది. మనం బ్యాంకులో వేసిన డబ్బునే తిరిగి తీసుకోగలము. అదే నియమం ప్రకారం ప్రపంచమనే బ్యాంకులో మనం ఏంవేస్తే అదే తిరిగి పొందుతాము; ఇప్పుడే కాకపోయినా, తర్వాతైనా. మనం హింసను వేస్తే, సహజంగా అదే తిరిగివస్తుంది. ఇది ప్రకృతిసూత్రం. అందువల్ల మన ప్రశాంతత కోసమైనా మనం హింస జోలికి పోకూడదు. అలాగని అసలు హింస చెయ్యకూడదు అనలేము.

ఒక్కోసారి హింస చేసితీరాల్సిన సందర్భం వస్తుంది. దానికి సరియైన ఉదాహరణ భగవద్గీతే. భగవద్గీతలోనే కృష్ణపరమాత్మ పదమూడవ అధ్యాయంలో, ఈ అధ్యాయంలో, రాబోయే అధ్యాయంలో అహింస గురించి

గొప్పగా చెప్పి, అందువల్ల అర్జునా, యుద్ధం చెయ్యి అన్నాడు. అదెలా సాధ్యం?

**తస్మాద్యుధ్యస్వ భారత** 2.17

అంతగా అహింస గురించి చెప్పి, మళ్ళీ అర్జునుణ్ణి యుద్ధానికి ఎందుకు సిద్ధం చేస్తున్నాడు? అంటే తను చెప్పింది తనే ఖండించుకుంటున్నాడా? లేదు. ప్రతి నియమానికి ఒక ఉల్లంఘన ఉంటుంది. ఈ సూత్రం అహింసకు కూడా వర్తిస్తుంది. కొన్నిచోట్ల అహింస దారుణంగా ఓడిపోతుంది. దుర్యోధనుని విషయంలో జరిగింది అదే. ముందు అతనితో సామరస్యంగా సమస్యను పరిష్కరించటానికి ప్రయత్నించారు పాండవులు. దానికోసం కృష్ణపరమాత్మే రాయబారానికి వెళ్ళాడు. కాని దానికి కూడా లొంగలేదు దుర్యోధనుడు. అలా అహింసాత్మక పద్ధతులు విఫలమవటంవల్ల, ధర్మాన్ని రక్షించటంకోసం, యుద్ధానికి దిగక తప్పలేదు పాండవులకు. అలా తప్పని పరిస్థితిలో యుద్ధం చెయ్యటంలో తప్పులేదు. నిజానికి కృష్ణపరమాత్మ ఇంకొక అడుగు ముందుకువెళ్ళి, 'ఓ అర్జునా, నువ్వు ఈ ధర్మయుద్ధం చెయ్యటంవల్ల నీకు పాపం రాదు సరికదా, ఎదురు నీకు పుణ్యం వస్తుంది,' అన్నాడు.

అందువల్ల అన్ని సందర్భాలలోనూ అహింస పాటించాలి అనకూడదు. అలా చేస్తే అది ప్రతికూల ఫలితాలను ఇచ్చే ప్రమాదముంది. ఒక డాక్టరు ఆపరేషను చేస్తే, అది హింస చేసినట్టు అవుతుందంటే ఎలా ఉంటుంది? డాక్టరు ఆపరేషను చేసితీరాలి. కాని మామూలు పరిస్థితుల్లో అహింస పాటించి తీరాలి. అందువల్ల అహింసను అలవరచుకొండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

11. **సత్యమ్** – నిజం చెప్పటం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే అసత్యం పలకకుండా ఉండటం. సత్యం పలకటంవల్ల ఎవరినైనా బాధించేలా ఉంటే, అది పలకకూడదు. ఎందుకంటే అహింస పాటించాలని ఇప్పుడే చూశాము. ఎదుటివారిని బాధించకూడదు అంటే సత్యము పలకకూడదు. అసత్యమూ పలకకూడదు, అహింసా పాటించాలి అంటే ఏం చెయ్యాలి? ఆ విషయం అసలు చెప్పనేకూడదు. అందువల్ల సత్యం అంటే అసత్యవర్జనం.

కాని ఒక్కోసారి ధర్మసంకటంలో పడే పరిస్థితి వస్తుంది. మీ పిల్లవాణ్ణి సరిదిద్దాల్సిన పరిస్థితి వస్తుంది. నువ్వు ఇలా తప్పు చేస్తున్నావని చెబితే, ఆ సత్యం ఖచ్చితంగా అతణ్ణి బాధిస్తుంది. చెప్పకపోతే, అతను తప్పుదారిలో పడతాడు. అలాంటప్పుడు ఏంచెయ్యాలి? అతణ్ణి సరిదిద్దాలి కాని తియ్యగా మాట్లాడాలి. ముందు మీ పిల్లవాణ్ణి పక్కన కూర్చోబెట్టుకుని, అతన్ని దువ్వాలి. అంటే అతను ఒక్క చెడుపని చేసివుండవచ్చు కాని, ఎన్నో మంచిపనులు కూడా చేసివుంటాడు కదా. అతను చేసిన మంచిపనులను ముందు మెచ్చుకోండి. అతను వాటికి మురిసిపోతుండగా, ఇనుము వేడిగా ఉండగానే వంచాలనే నియమం ప్రకారం మాటలో మాటగా అతను చేస్తున్న చెడుపని గురించి నెమ్మదిగా చెప్పండి. అది బాధించేలా, కఠినంగా ఉండకూడదు. దాని గురించి మరీ ఎక్కువగా సాగదీయకండి. అప్పుడు అతను పొగడ్తల మధ్య చిన్న విమర్శను సహృదయంతో తీసుకునే అవకాశం ఉంటుంది. సరిగ్గా తీసుకుంటే అతను మీరు కోరినట్టుగా మారే అవకాశం ఉంది. మనసెరిగి ప్రవర్తించటమంటే ఇదీ. ఈ విధంగా సత్యం పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

12. **అక్రోధః** – అక్రోధః అంటే కోపాన్ని అదుపులో పెట్టుకోగలగటం. మనిషికొచ్చే భావోద్రేకాలలో కోపం బాగా శక్తివంతమైన ఉద్రేకం. కోపం వస్తే కోపం వచ్చిన వ్యక్తినీ బాధిస్తుంది; ఎవరిమీద అతను చిందులు తొక్కుతాడో అతన్నీ బాధిస్తుంది. అందువల్ల కోపాన్ని అదుపులో పెట్టుకోగలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఎలా అదుపులో పెట్టాలి? దానికి చాలా పద్ధతులు ఉన్నాయి. వాటిలో ఒక పద్ధతి అది ఒక మానసికబాధ అని అర్థం చేసుకోవటం.

మనం కోపం అంటే అరవటం అనుకుంటాము. అదికాదు. కోపం అంటే మనస్సుకు చెందిన ఒక భావోద్రేకం. లేదా ఇంకో విధంగా చెప్పాలంటే మనస్సు పడే బాధ. అరవటం కోపం కాదు; అరవటం అనేది కోపంవల్ల వచ్చే పర్యవసానం. అరవటం, కొట్టటం కోపంయొక్క బాహ్యప్రదర్శన. కోపం అనేది పూర్తిగా మన మనస్సుకు చెందిన భావన. అందువల్ల మనకు మాత్రమే తెలుసు అది. దాన్ని మాటలతో, చేతలతో ప్రదర్శిస్తేనే ఎదుటివారికి తెలుస్తుంది.

ఎలాగైతే శారీరకబాధ శరీరాన్ని బాధిస్తుందో, అలా మానసికబాధ మనస్సును బాధిస్తుంది. శారీరకబాధను అర్థం చేసుకోగలిగితే, మానసికబాధను కూడా అర్థం చేసుకోగలుగుతారు. శారీరకబాధ నిజంగా శాపమే. ఎవరికీ అలా బాధపడాలని ఉండదు. కాని వైద్యశాస్త్రపరంగా చూస్తే, అది ఒక వరం. భగవంతుడు మిమ్మల్ని బాధపెట్టాలని పనిగట్టుకుని శారీరకబాధను ఇవ్వలేదు; భగవంతుడు ముందుచూపుతో ఏర్పాటుచేశాడు. ఏమిటది? ఏదైనా భాగంలో నొప్పి వస్తోందంటే, మీ శరీరం మీకు సూచనలను పంపిస్తోందన్నమాట. 'నాకు ఆరోగ్యం బాగాలేదు, డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళు,' అంటోంది. అందువల్ల బాహ్యంగా కనబడే ఈ నొప్పిని డేంజర్‌లైటుగా భావించుకోవచ్చు. ఏదో అనారోగ్యం చేసింది, జాగ్రత్తపడు అంటున్నది శరీరం.

ఎలా జాగ్రత్తపడాలి? ఏదైనా శారీరకసమస్య రాగానే ఒక మాత్ర వేసేసుకుంటారు కొందరు. కాని ఇలా మీకు ఏదైనా శారీరకబాధ కలిగితే, దాన్ని శరీరం పంపిస్తున్న సూచన అని అర్థం చేసుకోగలిగితే, ముందు ఆ బాధకు కారణం ఏమిటో నిర్ధారణ చెయ్యాలి. ఆ బాధ బాహ్యంగా జరిగిన వాటివల్ల కావచ్చు; అంతర్గతంగా ఆరోగ్యం దెబ్బతిని ఉండవచ్చు.

ఉదాహరణకు ఒక చిన్న తలనొప్పి 2000 కారణాలవల్ల రావచ్చు అంటారు. మీ కంటిచూపు తగ్గి ఉండవచ్చు; పంటినొప్పివల్ల రావచ్చు; కడుపునొప్పివల్ల కావచ్చు; ఎవరైనా మిమ్మల్ని బాధపెట్టి ఉండవచ్చు; మరేదైనా కారణం కూడా కావచ్చు. అందువల్ల వెంటనే మాత్ర వేసేసుకోకూడదు. ముందు కారణం తెలుసుకోవాలి. లేకపోతే మీరు తీసుకున్న మాత్రవల్ల ఇంకో కొత్త సమస్య రావచ్చు. అంటే తలనొప్పి పోయి, కడుపునొప్పి రావచ్చు. ఇది అర్థమయితే, ఇదే సూత్రం కోపానికి కూడా వర్తిస్తుంది.

కోపం కూడా మనస్సు ఇచ్చే ఒక సూచన. ఎక్కడో ఏదో తప్పు జరిగింది అంటున్నది మనస్సు. ఎవరో సరిగ్గా ప్రవర్తించలేదు; ఇప్పుడున్న వ్యవస్థ బాగాలేదు; దేనివల్ల మీకు కోపం వస్తోందో, దాని కారణం తెలుసుకుంటే, తదనుగుణంగా చర్య తీసుకోవచ్చు. అందువల్ల కోపాన్ని నియంత్రించటం అంటే కోపం మనస్సుయొక్క స్థితి అనీ, మనస్సు మీకు ఇచ్చే సూచన అనీ తెలుసుకోవటం. అందువల్ల మీ మేధస్సును ఉపయోగించి, ఎందువల్ల

కోపం వస్తోందో తెలుసుకుని, ఆ కారణాన్ని రూపుమాపటానికి ప్రయత్నించాలి. అదీ అక్రోధః అంటే. అక్రోధాన్ని అలవరుచుకొండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

13. **త్యాగః** – త్యాగః అంటే సన్న్యాసం. సన్న్యాసం అంటే అన్నిటినీ పరిత్యజించటం. పరిత్యజించాలి అంటే ఖంగారు పడకండి. ఈ పరిత్యజించటం కూడా రెండురకాలుగా ఉంటుంది. అవి ఆంతరసన్న్యాసం, బాహ్యసన్న్యాసం.

ఎ) **బాహ్యసన్న్యాసం** – శాస్త్రం నాలుగు ఆశ్రమధర్మాలను విధించింది మానవాళికి. అవి బ్రహ్మచర్యం, గృహస్థ, వానప్రస్థం, సన్న్యాసం. సన్న్యాసం నాలుగవ ఆశ్రమధర్మం. త్యాగః అంటే బాహ్యంగా సన్న్యాసం స్వీకరించటం అని ఒక అర్థం.

బి) **ఆంతరసన్న్యాసం** – దీన్ని వైరాగ్యం అంటారు. ఈ త్యాగః అంటే ఇంకొక అర్థం వైరాగ్యం. వైరాగ్యం అంటే ఏమిటి? మీ వస్తువులు, మీవారి గురించి మీకు ఉండే సరియైన అవగాహన, సరియైన దృక్పథం.

ఏమిటా సరియైన దృక్పథం? నాది, నాది అనుకుంటున్నదేదీ నాది కాదని తెలుసుకోవటం. 'నాకంటూ స్వంతంగా ఏమీలేదు. అన్నీ భగవంతునికే చెందుతాయి, భగవంతునికి మాత్రమే చెందుతాయి. ఆ భగవంతుడు అనంత కృపాసాగరుడు కాబట్టి, ఆయన దయకొద్దీ నేను తాత్కాలికంగా ఉపయోగించుకోవటానికి నాకు ఈ కానుకలను ప్రసాదించాడు. వాటితో మైమరచిపోవటానికి కాదు; వాటిని వాడుకుని, వాటిద్వారా నేను ఆధ్యాత్మికంగా ఎదగటానికి ఇచ్చాడు. వీటిలో దేన్నీ నేను శాశ్వతంగా ఉంచుకోలేను, ఆఖరికి నా శరీరంతో సహా అన్నీ భగవంతునికి చెందుతాయి. చివరికి భగవంతుని దగ్గరకే చేరుకుంటాయి. భగవంతుడే నాకు వాటిని ఇచ్చాడు కాబట్టి నేను వాటికి ధర్మకర్తను మాత్రమే. ఆయనకు వాటిని ఎప్పుడైనా వెనక్కి తీసేసుకునే హక్కు ఉంది. మూడునెలల నోటీసు ఇవ్వచ్చు; ఒక్కనెల నోటీసు ఇవ్వచ్చు; అసలేమీ నోటీసు ఇవ్వకుండా అర్థాంతరంగా తీసేసుకోవచ్చు. ఆయనే ఇచ్చాడు కాబట్టి, ఆయనకు తీసేసుకునే హక్కు ఉంది,' అని అర్థం చేసుకోవాలి. మనం చెయ్యాల్సిందల్లా ఒకటే. ఆయన ఏది కోరితే దాన్ని నవ్వుతూ ఆయనకి అప్పజెప్పటమే. అదికూడా ధన్యవాదాలు పదం జోడించి. రిటర్న్‌డ్ విత్ థాంక్స్ అంటారు విదేశీయులు. నేను కూడా 'రిటర్న్‌డ్ విత్ థాంక్స్,' అని భగవంతునికి చెప్పగలగాలి. దీన్ని త్యాగః అంటారు.

మీరు దేన్నైనా అనుభవించండి; ఇంద్రభవనంవంటి ఇల్లు కొనుక్కోండి, పడవంత కారులో తిరగండి; నలుగురితో బంధాలు పెంచుకోండి; పెద్ద ఉద్యోగాలు చెయ్యండి; మీకు ఏం కావాలనిపిస్తే దాన్ని పొందండి; కాని ఒక్క విషయాన్ని మాత్రం ఎన్నడూ మర్చిపోకండి. వీటిల్లో దేనినైనా భగవంతుడు తనకు తోచినప్పుడు వెనక్కి తీసేసుకోగలడు. ఇప్పటి ఉద్యోగాలు ఎలా ఉన్నాయంటే చాలా మంచి ఉద్యోగం; జీతం కూడా బాగానే వస్తుంది. కాని ఏక్షణంలో ఉద్యోగం ఊడుతుందో తెలియదు. ముఖ్యంగా విదేశాల్లో. ఇక్కడైతే మూడునెలల నోటీసు ఇవ్వాలి; అక్కడ అదేం లేదు; పొద్దున్న లేచి ఆఫీసుకు వెళితే, ఉద్యోగం ఉంటుందో లేదో తెలియదు. ఎంత త్వరగా ఉద్యోగం వస్తుందో, అంత త్వరగానూ ఉద్యోగం పోతుంది. ఉద్యోగమే కాదు, అన్నీ అంత అశాశ్వతమే అక్కడ. అలాంటి అశాశ్వతత్వానికి సిద్ధపడటమే వైరాగ్యం అంటే. నాది అనే ఈ మమకారాన్ని వదులుకోవటమే త్యాగం. ఇటువంటి త్యాగాన్నిపెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

14. **శాంతిః** – శాంతిః అంటే ప్రశాంతమైన మనస్సు; ఒత్తిడి, ఆందోళన లేని మనస్సు. శాస్త్రం వాడే ఇంకొక పదం **అనాయాసః**. ఈ ప్రశాంతతను రోజంతా పాటించగలగాలి. దీన్నే సమత్వం యోగముచ్యతే అన్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగం పాటిస్తే ఈ సమత్వం అలవడుతుంది. శాంతి ఎందుకు ముఖ్యమైన విలువ? ఎందుకంటే, మనస్సు ప్రశాంతంగా ఉంటేనే బుద్ధి చురుకుగా పనిచేస్తుంది. మనస్సు కలతచెందితే బుద్ధి పనిచెయ్యదు. వేదాంతం నేర్చుకోవాలంటే సాధకుడు శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. మూడింటికీ మనస్సు ప్రశాంతంగా ఉండాలి. దీన్ని సమత్వం అని కూడా అంటారు. ఇది కర్మయోగంవల్ల వస్తుంది. అంతేకాదు శమం అని కూడా అంటారు. ఇంతకుముందు దమం చూశాము; ఇప్పుడు శమం చూస్తున్నాము. ఆ విధంగా శాంతిని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

15. **అపైశునమ్** – అపైశునమ్ అంటే ఎదుటివారి లోపాలను చాటి చెప్పకుండా ఉండటం. పుకార్లు పుట్టించాలన్నా, ఎవరి గురించైనా చెడుగా మాట్లాడాలన్నా చాలా ఆనందంగా ఉంటుంది కొంతమందికి. ఎదుటివారిలో ఏ కాస్త తప్పు ఉన్నా, ఏ కాస్త చెడు ఉన్నా, వారికి ఏ బలహీనత ఉన్నా, గోరంతలు కొండంతలుగా చేసి చెప్పటం; వారికేమైనా మంచిలక్షణం ఉంటే, దాన్ని జాగ్రత్తగా దాచిపెట్టటం మానవనైజం. అటువంటి పని సుతరామూ మంచిది కాదంటుంది శాస్త్రం. మీకంతగా ఎదుటివారి గురించి మాట్లాడాలని ఉంటే, వారి మంచి విషయాలు ప్రపంచానికి చాటిచెప్పండి.

**పరగుణ ప్రకటీకరణం పరదోష తిరోధానమ్**

అంటే పరుల మంచిగుణాలు చెప్పాలి; పరుల చెడుగుణాలు దాచిపెట్టాలి.

మీ విషయంలో ఏంచెయ్యాలి? ముందు అసలు మీకు మంచిగుణాలు ఉన్నాయా అని బేరీజు వేసుకోవాలి. ఒకవేళ ఉన్నట్టు అనిపించినా, వాటిని దండోరా వేసుకోనవసరం లేదు. మీ మంచిగుణాలు దాచి, ఎదుటివారివి మెచ్చుకోవటం నేర్చుకోండి. ఒకటి దాచాలి, ఒకటి చాటి చెప్పాలి. నిజమే. మనుష్యులు చేసేది అదే. కాని ఏది దాచాలో అది చెబుతున్నారు; ఏది చెప్పాలో అది దాస్తున్నారు. మీ మంచి దాచుకుని, ఎదుటివారి మంచి చెప్పాలి; కాని మీరేం చేస్తున్నారు, ఎదుటివారి మంచి పట్టించుకోకుండా, మీ మంచినే పొగుడుకుంటున్నారు. అలాగే ఎదుటివారి చెడు దాచాలంటే, పనిగట్టుకుని దాన్ని నలుగురికీ చాటిచెబుతారు. కాని ఇతరుల గురించి చెడు మాట్లాడకూడదు. అందువల్ల అపైశునమ్ పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

16. **దయా భూతేషు** – దయా అంటే జాలి; భూతేషు అంటే తోటిమానవులే కాదు, సర్వప్రాణికోటి. అంటే జంతువులమీద కూడా జాలిచూపాలి. ఎదుటివారి పరిస్థితిలో నేను ఉండివుంటే నాకు ఎలా అనిపిస్తుంది అని ఒక్కసారి ఆలోచించుకోగలిగితే, దానంతట అదే దయాగుణం కలుగుతుంది. అప్పుడు చూస్తూచూస్తూ ఎవరికీ హాని చేయలేము. అందువల్ల భూతదయ పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

17. **అలోలుప్త్వమ్**– అలోలుప్త్వం అంటే ఇంద్రియ విషయవస్తువులు ఎదురుగా ఉన్నాకూడా వాటి ఆకర్షణకు లొంగకపోవటం. ఈ ప్రపంచం ఒక మాయాజాలం. అందులో మిమ్మల్ని ఆకర్షించి, వాటికి బానిసలుగా

చేసుకోగలిగే వస్తువులు అనేకం ఉన్నాయి. అటువంటి ప్రలోభాలు ఎదురుగా నిలిచినా కూడా, వాటికి లొంగక పోవటమే ఆత్మనిగ్రహం. ఈ ఆత్మనిగ్రహాన్నే **అలోలుప్త్వమ్** అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇంతకుముందు దమం పదం చూశాము. దమం అంటే ఇంద్రియనిగ్రహం అని కూడా చూశాము. ఇది అన్నిరకాల ప్రలోభానికి వర్తిస్తుంది. అలోలుప్త్వం అంటే ప్రత్యేకించి ఒకదానికి వర్తిస్తుంది. 'పొగత్రాగటం హానికరం' అని రాస్తారు. ఈ సిగరెట్టుకు ఎవరైనా మొదటిసారి మాత్రమే 'నో' చెప్పగలడు. మొదటిసారి మీ చేతుల్లో ఉంటుంది. అప్పుడు తాగితే కావాలని చేసిన పొరపాటు అవుతుంది. ఇంక రెండోసారినుంచీ అది మీ చేతుల్లో ఉండదు; మీరే దాని చేతుల్లోకి వెళ్ళిపోతారు. అది యజమాని, మీరు బానిస అయిపోతారు. అది లేకుండా ఉండలేని పరిస్థితికి చేరుకుంటారు. ఎవరైనా హితవు చెప్పబోతే, వారిని దూరం చేసుకోవటానికి కూడా వెనుకాడరు.

మందు త్రాగటం కూడా అంతే. దాన్నించి ఎవరూ తేలికగా బయటపడలేరు. అటువంటి మందుబాబులను ఆ భగవంతుడే కాపాడాలి. కాని భగవంతుడు కాపాడాలి అంటే వారు భగవంతుణ్ణి శరణు వేడాలి. అది అసాధ్యం వారికి. అందువల్ల ఏ వ్యసనానికైనా మొదటిసారే 'నో' చెప్పగలగాలి. ఒకసారి సరదాగా చూద్దాంలే అనుకుంటే మాత్రం ఇంతే సంగతులు. ఇటువంటి దురలవాట్లు వాలి వంటివి. వాలి ఎవరి ఎదురుగా నిల్చుని యుద్ధం చేస్తే, ఆ ఎదుటివ్యక్తిలోని శక్తిలో సగం వాలికి వెళ్ళిపోతుందిట. ఏ వ్యసనం అయినా అంతే. దాని ఎదురుగా నిలుచుంటే, మీ ఫ్రీవిల్‌లోని శక్తిని సగమో, ఇంకా మాట్లాడితే మూడువంతులో లాగేసుకుంటుంది. దుష్టులకు దూరంగా ఉండాలి అని సామెత. దుష్టులు అంటే మనుష్యులే కాదు. ఇటువంటి వ్యసనాలు కూడా. అందువల్ల అలోలుప్త్వమ్ అలవరుచుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

18. **మార్దవమ్** – మార్దవం అంటే ఎదుటివారితో మర్యాదగా మాట్లాడటం; మృదువుగా మాట్లాడటం. దురుసుగా మాట్లాడకపోవటం మార్దవమ్.

**వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి।**
**లోకోత్తరాణాం చేతాంసి కో హి విజ్ఞాతుమర్హసి॥**

జ్ఞానుల మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఆ మనస్సుకు రెండు భిన్న విలువలు ఉంటాయి. అంటే ఒక కోణంలోంచి చూస్తే మనస్సు బలంగా ఉంటుంది; వజ్రంకన్నా కఠినంగా ఉంటుంది. ఇంకో కోణంలోంచి చూస్తే మనస్సు సుకుమారంగా ఉంటుంది; పుష్పంకన్నా కుసుమకోమలంగా ఉంటుంది. ఒకే మనస్సు రెండు భిన్న ప్రవృత్తులను ఎలా చూపగలదు?

జ్ఞానులు ఏదైనా క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడో, ఎవరైనా వారిని నిందిస్తున్నప్పుడో, ఎవరైనా వారిని అవమానపరుస్తున్నప్పుడో, ఎవరైనా వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నప్పుడో వారి మనస్సు కఠినంగా మారిపోతుంది. రాక్ ఆఫ్ గిబ్రాల్టర్ సముద్రపుటలల తాకిడికి చెక్కుచెదరకుండా ఎలా నిలబడుతుందో, అలా వారి మనస్సు కూడా ఎటువంటి క్లిష్టపరిస్థితి ఎదురైనా అంత చెక్కుచెదరకుండా నిలబడుతుంది.

అలాగని అన్నివేళలా కఠినంగా ప్రవర్తించరు జ్ఞానులు. ఎవరితోనైనా మాట్లాడాలంటే, ఎవరితోనైనా వ్యవహారం నడపాలంటే, వారి భాష, వారి ప్రవర్తన పువ్వులాగా కుసుమకోమలంగా, మృదుమధురంగా ఉంటుంది. అంటే ఎప్పుడెలా ప్రవర్తించాలో వారికి బాగా తెలుసు. కర్తగా సున్నితమైన మనస్థత్వాన్ని ప్రదర్శిస్తే, భోక్తగా కఠినంగా ఉంటారు.

అజ్ఞానికి కూడా ఈ రెండు భిన్న ప్రవృత్తులూ ఉంటాయి. కాకపోతే వచ్చిన చిక్కేమిటంటే వాటిని పూర్తిగా భిన్నపరిస్థితుల్లో ప్రదర్శిస్తాడు. అంటే తను ఎదుటివారితో మాట్లాడాల్సి వచ్చినప్పుడు అతని మాటలు దురుసుగా, పరుషంగా, కఠినంగా ఉంటాయి. అదే ఎవరైనా తనను పల్లెత్తుమాట అన్నాకూడా చాలా సున్నితంగా ఉండి, చాలా బాధపడిపోతాడు. కాని తను మాత్రం వారిని ఏదైనా అనటానికి వెనుకాడడు. దానివల్ల అతనికీ సుఖంలేదు, ఎదుటివారికీ సుఖంలేదు. ఇంకో విధంగా చెప్పాలంటే కర్తగా కఠినంగా ప్రవర్తిస్తే, భోక్తగా సున్నితమైన మనస్తత్వాన్ని ప్రదర్శిస్తాడు. అందువల్ల మార్దవాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

19. **హ్రీః** – హ్రీః అంటే అణకువ, సిగ్గుపడటం కూడా. సిగ్గుపడటం కూడా ఆరోగ్యకరంగా సిగ్గుపడటం. సిగ్గుపడటంలో కూడా రెండురకాలు ఉన్నాయి. ఒకటి ఆరోగ్యకరంగా సిగ్గుపడటం. అంటే ఇటువంటి మనస్తత్వం ఉంటే చెడుపనులను చెయ్యటానికి వెనుకాడతారు. కొన్ని పనులను ఎవరిముందైనా చెయ్యటానికి సిగ్గుపడతారు. ఆ జంకు అధార్మిక కార్యక్రమాలు చేపట్టకుండా ఆపుతుంది. అందువల్ల ఇటువంటి సిగ్గు ఆరోగ్యకరమైనది. దీన్ని పెంపొందించుకోవాలి. సిగ్గులేకపోవటం చెడువిషయం అవుతుంది. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నావు అని నిందిస్తాము. అందువల్ల ఆరోగ్యకరంగా సిగ్గుపడటం ఒక మంచి విలువ. అందువల్ల హ్రీః లక్షణాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

20. **అచాపలమ్** – చపలం అంటే శరీరపరంగా కుదురుగా ఉండలేకపోవటం. నిజానికి చపలత్వం మనస్సుయొక్క లక్షణం; మనస్సు అసలు నిశ్చలంగా లేకపోతే, అది శరీరం స్థాయికి పాకి, శరీరపరంగా చేసే చేష్టలద్వారా ప్రకటిస్తుంది. కాళ్ళు, చేతులను తీవ్రంగా కదుపుతాడు; మొహాన్ని తెగ తిప్పుతాడు; చేతివేళ్ళను తీవ్రంగా కొరుకుతాడు. కొంతమంది అయితే చేతివేళ్ళనే కాదు, చేతిలో ఉండే పెన్నునో, పెన్సిల్నో కూడా కొరుకుతారు. ఇలా క్షణం కూడా కుదురుగా కూర్చోలేకపోవటాన్ని చపలం అంటారు. అర్థంలేని కదలికలు చేస్తారు. వీటిని వెర్రిచేష్టలు అంటారు. పిల్లలు చూడండి; కాళ్ళూ, చేతులను కదపకుండా ఒక్కక్షణం కూడా కుదురుగా కూర్చోలేరు. 'ఇదుగో ఆ వెర్రిచేష్టలు చెయ్యకుండా కాసేపు కుదురుగా కూర్చో,' అంటుంది తల్లి. అలా చేష్టలు చెయ్యటాన్ని చపలం అంటారు. ఆ చేష్టలు చెయ్యకుండా నిగ్రహించుకోగలగటాన్ని అచాపలమ్ అంటారు. అలా చేస్తే శరీరం కూడా విశ్రాంతిగా ఉంటుంది. అందువల్ల అచాపలాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 3 **తేజః క్షమా ధృతిః శౌచమ్ అద్రోహో నాతిమానితా ।**
**భవంతి సంపదం దైవీమ్ అభిజాతస్య భారత ॥**
తేజః, క్షమా, ధృతిః, శౌచమ్, అద్రోహః, న, అతిమానితా,
భవంతి, సంపదమ్, దైవీమ్, అభిజాతస్య, భారత ॥

| | | | |
|---|---|---|---|
| తేజః = తేజస్సు | | న, అతిమానితా | = తాను పూజ్యుడనను అభిమానము లేకుండుట |
| క్షమా = క్షమ | | భారత! | = ఓ అర్జునా! |
| ధృతిః = ధైర్యము | | దైవీమ్, సంపదమ్ | = దైవీసంపదతో |
| శౌచమ్ = బాహ్యశుద్ధి | | అభిజాతస్య | = పుట్టినవానియొక్క లక్షణములు |
| అద్రోహః = ఎవ్వరిపైనను శత్రుభావము లేకుండుట | | భవంతి | = అవుతాయి |

**హే భారత! తేజః, క్షమా, ధృతిః, శౌచమ్, అద్రోహః,**

**న అతి-మానితా (ఇతి ఏతాని లక్షణాని) దైవీమ్ సమ్పదమ్ అభిజాతస్య (పురుషస్య) భవన్తి ॥**

తా: తేజస్సు, క్షమ, ధైర్యము, బాహ్యశుద్ధి, ఎవ్వరిపైనను శత్రుభావము లేకుండుట, తాను పూజ్యుడనను అభిమానము లేకుండుట. ఓ అర్జునా! పైన తెల్పబడిన గుణములన్నియును దైవీసంపదతో పుట్టినవానియొక్క లక్షణములు అవుతాయి.

ఇంకా ఈ దైవీగుణాలవర్ణన కొనసాగుతున్నది.

21. **తేజః** – తేజః అంటే చురుకుతనంతో కూడిన మంచితనం. మంచితనం చూపించాలి కాని మళ్ళీ దాన్ని ఎదుటివారు మీ చవటతనంగా భావించకూడదు. మీరు మర్యాదగా, మంచిగా, వారిని భరించేలా ఉండాలి. ఇవి మంచి లక్షణాలు నిజమే కాని, అలాగని ఎదుటివారు మిమ్మల్ని ఆడించినట్టల్లా ఆడకూడదు. మంచితనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. మీ మంచితనం కారణంగా మీరు వారి కాలికింద చెప్పుగా మారనవసరం లేదు. మీరు గీత వింటున్నారు లేదా చదువుతున్నారు కాబట్టి అన్నీ నిశ్శబ్దంగా భరించనవసరం లేదు. మీరు ఏమారకూడదు; ఎవరినీ ఏమార్చకూడదు. ఇలా ఏమారకుండా ఉండగలగటాన్ని తేజః అంటారు.

ఎవరైనా మీ మంచితనాన్ని అలుసుగా తీసుకుని మోసం చేస్తుంటే, దాన్ని మీరు నిశ్శబ్దంగా భరించనవసరం లేదు. అలాగని వెంటనే సీమటపాకాయలాగా ఎదురుతిరిగి వారిమీద అరవనూ అరవనవసరం లేదు. వారు ఎందుకలా ప్రవర్తిస్తున్నారో ఆ పరిస్థితిని విశ్లేషించి, ముందు నెమ్మదిగా నచ్చచెప్పటానికి ప్రయత్నించాలి; అప్పుడూ మారకపోతే దండోపాయం తప్పని పరిస్థితి. దుర్యోధనుని విషయంలో జరిగింది అదే. అతను మొండికెత్తటంవల్లనే మహాభారతయుద్ధం తప్పనిసరి అయింది. అందువల్ల ముందు సామరస్యంగా పరిష్కరించుకోవాలి; అవేవీ కుదరకపోతే అప్పుడు దండోపాయం గురించి ఆలోచించాలి.

ఎదుటివారిని బాధపెట్టకూడదు నిజమే, అలాగని అతి మంచితనం చూపిస్తే మిమ్మల్ని మీరే హింసించుకున్నవారు అవుతారు. మీ మనస్సును, మీ శరీరాన్ని కాపాడుకునే బాధ్యత మీకు ఉంది. అందువల్ల అనవసరంగా మీరు అవస్థపడకూడదు. మీ మంచితనాన్ని వారు అలుసుగా తీసుకోకూడదు. అందువల్ల తేజస్సును పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

22. **క్షమా** – ఈ క్షమా పదాన్నే శాంతిః అని పదమూడవ అధ్యాయంలోనూ, తితిక్ష అని రెండవ అధ్యాయంలోనూ అన్నాడు కృష్ణపరమాత్మ.

**మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।**
**ఆగమాపాయినోఽ నిత్యాః తాంస్తితిక్షస్వ భారత ॥** – 2.14

ఈ క్షమా పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. ఒక అర్థం భరించటం. తపస్సు గురించి చూసినప్పుడు చూశాము. తపస్సు చెయ్యటంవల్ల కష్టాన్ని భరించేశక్తి వస్తుందని చూశాము. ఇది ఒక అర్థం.

కాని శంకరాచార్యులవారు ఇంకొక అర్థాన్నిస్తున్నారు ఇక్కడ. ఈ పదాన్ని రెండవ శ్లోకంలో వచ్చిన అక్రోధః పదానికి వ్యతిరేకపదంగా వర్ణిస్తున్నారు. ముందు అక్రోధః అంటే ఏమన్నాం? అక్రోధః అంటే కోపం వస్తే దాన్ని నిగ్రహించుకోగలగటం అన్నాము. మనిషికొచ్చే భావోద్రేకాలలో కోపం బాగా శక్తివంతమైన ఉద్రేకం. కోపం అంటే అరవటం కాదు. కోపం మనస్సుకు చెందిన భావన కాబట్టి, దానిని మనస్సు స్థాయిలోనే విశ్లేషణ చేసుకోవాలి. ఆ కోపాన్ని విశ్లేషించి, తెలివిగా ప్రవర్తించాలి. అంటే తెలివిగా కోపాన్ని ప్రదర్శించవచ్చు; తెలివిగా ప్రదర్శించకుండా ఉండవచ్చు; కోపాన్ని కొంతమేరకు మాత్రమే ప్రదర్శించవచ్చు. అదీ కోపాన్ని నియంత్రించటం అంటే. ఇదంతా అక్రోధః పదానికి వివరణ.

ఇప్పుడు క్షమా అంటే ఏమిటో చూద్దాము. క్షమా అంటే మనస్సులో అసలు కోపమే లేకుండా ఉండగలగటం. చాలా కష్టం ఈ విలువను పాటించటం. అక్రోధః విషయంలో కోపం రావచ్చు కాని, దాన్ని మీరు అదుపులో పెట్టుకోవాలి అన్నాము; ఇక్కడేమంటున్నాము? అసలు కోపమే రాని మనస్సును పెంపొందించుకోవాలి అంటున్నాము. కోపమే రాకుండా చేసుకోవటం క్షమ; వచ్చిన కోపాన్ని అదుపులో పెట్టుకోవటం అక్రోధం.

అసలు కోపమే రాకుండా చేసుకోగలగటం సాధ్యమేనా? చూస్తుంటే అసాధ్యమనిపిస్తోంది. నిజానికి మనస్తత్త్వ శాస్త్రవేత్తలు కూడా కోపం రావాలి, అది ఆరోగ్యకరం అంటున్నారు. ఆరోగ్యకరంగా ఉన్న మనస్సులో కోపం రావటం సహజలక్షణం అంటున్నారు; కోపమేలేని స్థితిని వారు అంగీకరించలేరు. కాని శంకరాచార్యులవారు అది సాధ్యమే అంటున్నారు. కాకపోతే ఎలా సాధ్యమో చెప్పటం లేదు. కోపం రాకూడదట కాని ఎలా రాకూడదో ఆయన చెప్పరుట అనేసరికి మీకు కస్సుమని కోపం వచ్చే అవకాశం ఉంది. ఆగండి, ఇక్కడ చెప్పలేదు. ఎందుకంటే ముందే మూడవ అధ్యాయంలో ఈ విషయాన్ని చర్చించేశారు శంకరాచార్యులవారు.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః**

అక్కడ కోపాన్ని నిర్వచించారు శంకరాచార్యులవారు. కోపం అంటే మీరు ఆశించిన ఫలితం దక్కకపోతే అది కోపంగా మారుతుంది; ఆశించినదానికి ఏదైనా ఆటంకం కలిగితే కోపం వస్తుంది. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే కోరిక కోపానికి దారితీస్తుంది.

ఎప్పుడైతే కోరిక కోపంగా మారుతుందో, కోపాన్ని నియంత్రించుకోవాలంటే ముందుగా మీరు కోరికను నియంత్రించుకోవాలి. కోరికలు ఎంత తక్కువ ఉంటే, కోపం రావటానికి అవకాశాలు కూడా అంత తక్కువగానూ ఉంటాయి. ఒకవేళ కోరికలు కోరకుండా ఉండలేను అంటే వాటిని కోరండి కాని వాటి ఫలితాలను ఆశించకండి. ఇవన్నీ మూడవ అధ్యాయంలో వివరంగా చూశాము. అంటే పిల్లలు చెప్పినమాట వినాలని ఆశించండి;

తప్పులేదు; కాని వినకపోతే కోపం తెచ్చుకోకండి. పిల్లలని దండించే రోజులు పోయాయి. వారికి రక్షణ ఎక్కువైంది. మానసిక శాస్త్రవేత్తలు కూడా పిల్లలను దండించకూడదు అంటున్నారు. వారు తల్లిదండ్రులను ఎదిరించినా, గురువులను ఎదిరించినా దండించకూడదు. పిల్లల కోరికలు పిల్లలకుంటాయి; మీ అభిప్రాయాలను వారిమీద రుద్దకూడదు. వారు మీ కోరికలకు తలొగ్గితే, మీరు పుణ్యజీవులు; తలొగ్గకపోతే మీరు దాన్ని స్వీకరించకతప్పదు. అందువల్ల ఎదుటివారినుంచి ఏమీ ఆశించవద్దు. ఏదైనా ఆశిస్తేనే కదా, అది తీరకపోవటం, దానివల్ల కోపం వచ్చేది. ఏమీ ఆశించకపోతే కోపం వచ్చే మార్గం లేదు. అందువల్ల క్షమను పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

23. **ధృతిః** – ధృతి అంటే గుండెధైర్యం. ఎటువంటి ఆటంకాలు ఎదురైనా కూడా మొక్కవోని పట్టుదలతో ముందుకు సాగిపోవటం. దానికి చాలా పట్టుదల ఉండాలి. సముద్రమథనమే దానికి గొప్ప ఉదాహరణ. దాని గురించి కూడా గీతలోనే చూశాము. దేవతలు, రాక్షసులు అమృతంకోసం సముద్రాన్ని చిలికారు. అమృతం వచ్చేముందు ఇరవైనాలుగు వస్తువులు వచ్చాయి. లక్ష్మీదేవి, ఐరావతంవంటి మంచి ప్రలోభాలు వచ్చాయి; విషంవంటి ఆటంకమూ వచ్చింది. అయినా వారు చెక్కుచెదరలేదు. వారి ప్రయత్నాన్నీ ఆపలేదు. పట్టువదలని వీరులుగా ముందుకు సాగారు. భగీరథుడు ఎన్నో ఆటంకాలకోర్చి గంగను కిందికి తెచ్చాడు. అందువల్ల ఎవరైనా, ఎన్ని ఆటంకాలు ఎదురైనా, అనుకున్నది సాధిస్తే, దాన్ని భగీరథ ప్రయత్నం అంటారు. ఈ ధృతి అనే లక్షణం గురించి కృష్ణపరమాత్మే మళ్ళీ పద్దెనిమిదవ అధ్యాయంలో వివరిస్తాడు. అక్కడ మూడురకాల పట్టుదలల గురించి చెబుతాడు. అవి సాత్త్విక, రాజసిక, తామసిక పట్టుదలలు. వాటి వివరాలలోకి మనం ఇప్పుడు వెళ్ళటం లేదు. సందర్భం వచ్చినప్పుడు చూద్దాము. ధృతి అంటే పట్టుదల. అందువల్ల ధృతిని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

24. **శౌచమ్** – శౌచమ్ అంటే శుభ్రత. ఇది కూడా పదమూడవ అధ్యాయంలో వచ్చింది. **ఆచార్యోపాసనం శౌచమ్...** శౌచం అంటే ఒక్క మీ శుభ్రతను మాత్రమే తీసుకోకూడదు. పరిసరాల శుభ్రతను కూడా తీసుకోవాలి. అన్నీ చక్కగా దేని స్థానంలో దాన్ని పెట్టాలి. మీరు, మీఇల్లు, మీ వీధి, మీ పరిసరాలు – అన్నీ శుభ్రంగా ఉండాలి. విషాదకరమైన విషయం ఏమిటంటే మనకు ఈ విషయాన్ని శాస్త్రం చిన్నప్పటినుంచీ బోధిస్తుంది, కాని మనం దాన్ని ఆచరణలో పెట్టము. విదేశాలలో వారికి శాస్త్రం చెప్పదు; కాని వారు పరిసరాలను, వీధులను కూడా శుభ్రంగా ఉంచుతారు. మనకు కూడా చెత్త వేయటానికి చెత్తకుండీలు ఉన్నాయి కాని మనకు ఈ విశాలప్రపంచమే పెద్ద చెత్తకుండీ. చెత్తను చెత్తకుండీలో తప్ప, దాని చుట్టూతా వేస్తాము. కాని పరిశుభ్రత చాలా మంచిగుణం. మీరు శుభ్రంగా ఉండాలి; మీ దుస్తులు శుభ్రంగా ఉండాలి; మీ శరీరం శుభ్రంగా ఉండాలి; అన్నింటినీ మించి మనస్సును ఇంకా శుభ్రంగా ఉంచుకోవాలి. అదే చాలా క్లిష్టమైన పరిస్థితి. అందువల్ల శౌచాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

25. **అద్రోహః** – అద్రోహం అంటే మానసికస్థాయిలో పాటించాల్సిన అహింస. **హింసా ఇచ్ఛా అభావః అహింసా.** హింస చేయాలనే ఆలోచన కూడా లేకపోవటం అహింస. అద్రోహః అంటే హింస ఇచ్ఛ లేకపోవటం. ఎవరినైనా చెయ్యెత్తి కొట్టటం హింస అని మీక్కూడా తెలుసు; కాని శంకరాచార్యులవారు కొడతానని చెయ్యెత్తి

బెదిరించటం కూడా హింసే అంటారు. అందువల్ల ఆలోచన స్థాయిలో కూడా హింస తలంపు రాకపోవటం అద్రోహః. అందువల్ల, అద్రోహాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

26. **నాతిమానితా** – నాతిమానితా అంటే పదమూడవ అధ్యాయంలో చూసిన అమానిత్వమే; అంటే గర్వం లేకపోవటం, ఆధిపత్యం లేకపోవటం; దీన్నే సానుకూలంగా చెప్పాలంటే అణకువ లేదా వినయం. ఈ వినయం అనే లక్షణం ఆధ్యాత్మిక సాధకునికి ఉండాల్సిన అతి ముఖ్యమైన విలువ. ఎందుకంటే సాధకుడు తన గురువుకు నమస్కారం చెయ్యాలి. అతనిలో గర్వం రాజ్యమేలుతూ ఉండి, నేనే గొప్పవాణ్ణి అనుకునేటట్టయితే, ఇంకొకరికి ఎలా తలవంచుతాడు? వినయ విధేయతలు లేకపోతే సాటి మానవునికి వంగి నమస్కారం పెట్టటం అసాధ్యం. అలా నమస్కారం పెట్టే ఉద్దేశ్యం లేకపోతే జ్ఞానం కిందికి ప్రవహించదు. ఏదైనా ప్రవహించాలంటే పైస్థాయినుంచి కిందిస్థాయికి ప్రవహించాలి. అలా జ్ఞానం ప్రవహించాలంటే వినయం ఉండాలి. అందువల్ల వినయాన్ని పెంపొందించుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ విధంగా కృష్ణపరమాత్మ 26 విలువలను పేర్కొన్నాడు.

**సంపదం దైవీమ్ అభిజాతస్య** – ఈ 26 విలువలు దైవీసంపత్తి ఉన్న వ్యక్తిలో ఉంటాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సత్త్వగుణంతో పుట్టినవ్యక్తి లేదా సత్త్వగుణాన్ని పెంపొందించుకున్న వ్యక్తికి ఈ మంచిగుణాలన్నీ ఉంటాయి. ఈ దైవీసంపత్తితో పుట్టకపోతే, వాటిని ప్రయత్నపూర్వకంగా పెంపొందించుకోవాలి. నిజానికి దైవీసంపత్తితో పుట్టకపోతే అని మనం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎందుకంటే అధికశాతం మనుష్యులకు ఈ లక్షణాలన్నీ ఉండవు.

నిజం చెప్పాలంటే వేదాంతబోధను అర్థం చేసుకోవటం తేలిక. ఈ 26 విలువలను పెంపొందించుకోవటం చాలా ప్రయాసతో కూడినపని. అంతేకాదు, వేదాంతం నేర్చుకోవటం త్వరగా నేర్చుకోవచ్చు, కాని విలువలను పెంపొందించుకోవటానికి చాలా సమయం పడుతుంది. ఇక్కడితో కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్న మొదటి అంశం ముగిసింది. అది **దైవీసంపత్తి**.

శ్లో. 4 **దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్ ॥**
దంభః, దర్పః, అభిమానః, చ, క్రోధః, పారుష్యమ్, ఏవ, చ,
అజ్ఞానమ్, చ, అభిజాతస్య, పార్థ, సంపదమ్, ఆసురీమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | పారుష్యమ్, చ | = మాటలందు, చేష్టలందు కాఠిన్యము |
| దంభః | = డాబు | అజ్ఞానమ్, ఏవ | = అజ్ఞానము మొదలగునవి అన్నియును |
| దర్పః, చ | = మొండితనము | ఆసురీమ్, సంపదమ్ | = ఆసురీ సంపదతో |
| అభిమానః | = దురభిమానము | అభిజాతస్య | = పుట్టినవాని లక్షణములు |
| చ | = ఇంకా | (భవంతి) | = (అవుతాయి ) |
| క్రోధః | = క్రోధము | | |

**హే పార్థ! దమ్భః, దర్పః, అభిమానః చ, క్రోధః, పారుష్యమ్,**

**ఏవ చ అజ్ఞానమ్ చ (ఏతాని లక్షణాని) ఆసురీమ్ సమ్పదమ్ అభిజాతస్య (పురుషస్య భవన్తి) ॥**

తా: ఓ పార్థా! డాబు, మొండితనము, దురభిమానము ఇంకా క్రోధము, మాటలందు, చేష్టలందు కాఠిన్యము, అజ్ఞానము మొదలగునవి అన్నియును ఆసురీ సంపదతో పుట్టినవాని లక్షణములు అవుతాయి .

**2. ఆసురీ సంపత్తి – శ్లోకాలు: 4–21**

ఆధ్యాత్మికతమీద శ్రద్ధ ఉన్న వ్యక్తికి ఉండాల్సిన దైవీసంపత్తి గురించి చెప్పాక, ఇప్పుడు కృష్ణపరమాత్మ లౌకిక విషయాలమీద శ్రద్ధ ఉన్న వ్యక్తికి ఉండే ఆసురీ సంపత్తి గురించి చెప్పబోతున్నాడు. ముందే చూసినట్టుగా అసురులు అంటే పెద్దకోరలు ఉండే రాక్షసులు అని కాదు అర్థం.

కృష్ణపరమాత్మ ఆసురీ సంపత్తిని నాలుగవ శ్లోకంలో టూకీగా పేర్కొంటున్నాడు. సంగ్రహ ఆసురీ సంపత్తి. విస్తార ఆసురీ సంపత్తిని 7–12 శ్లోకాల్లో చూస్తాము. అంటే కృష్ణపరమాత్మే వాటి గురించి వివరంగా చెబుతాడు. ఏమిటా ఆసురీసంపత్తి? అద్భుతంగా పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ.

1. **దంభః** – దంభః అంటే డాంబికం లేదా డాబు. తనకున్న ఐశ్వర్యం గురించీ, హోదా గురించీ, పరపతి గురించీ గొప్పలు ప్రదర్శించుకోవటం.

2. **దర్పః** – దర్పః అంటే పొగరు లేదా దురహంకారం. ఎప్పుడైతే ఐశ్వర్యం, హోదా వస్తాయో, వాటిని వెన్నంటే దురహంకారం దూసుకువస్తుంది. తమకంటే పెద్దవారిని, గొప్పవారిని కూడా గౌరవించరు. ఈ దర్పానికి దుర్యోధనుడు, రావణాసురులే గొప్ప ఉదాహరణలు.

3. **అభిమానః** – అభిమానం అంటే మానిత్వం, ఆధిపత్యభావన ఉండటం. తనే పూజ్యనీయుడు అనుకుని విర్రవీగటం. తనకే ఇతరులు నమస్కారం పెట్టాలి, గౌరవం చూపాలి, దండలు వెయ్యాలి, కుదిరితే పాదపూజలు కూడా చెయ్యాలి అనుకుంటాడు. దర్పానికీ, అభిమానానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. దర్పం అంటే బాహ్యంగా ప్రదర్శించటం; అభిమానం అంటే ఆలోచనలో గర్వం ఉండటం; అంటే మొదటిది కర్మపరంగా ఉంటే, రెండవది భావనాపరంగా ఉంటుంది.

4. **క్రోధః** – క్రోధః అంటే కోపం ప్రదర్శించటం. తనకు హోదా ఉంది, తనకు పరపతి ఉంది కాబట్టి తను ఏం చేసినా చెల్లుతుంది అనుకుని ఎదుటివారిని తన మాటలతో హింసించటానికి కూడా వెనుకాడకపోవటం.

5. **పారుష్యమ్** – పారుష్యమ్ అంటే పరుషంగా మాట్లాడటం; దూకుడుగా మాట్లాడటం; అమర్యాదగా మాట్లాడటం.

6. **అజ్ఞానమ్** – అజ్ఞానం అంటే తెలియకపోవటం. ఇక్కడ అజ్ఞానం అంటే ధర్మశాస్త్రం తెలియకపోవటం. మామూలుగా అజ్ఞానం అంటే ఆత్మ అజ్ఞానం గురించి చెబుతాము కాని గుర్తుంచుకోండి, ఈ రెండు అధ్యాయాలూ ఆత్మజ్ఞానం గురించి బోధించటం లేదు. అందువల్ల ఇక్కడ అజ్ఞానం అంటే ధర్మశాస్త్రంలో బోధించే నైతిక విలువలు తెలియకపోవటం. ధర్మాధర్మ వివేకం లేకపోవటం. అందువల్లనే ఈ ఆసురీసంపత్తి ఎక్కువగా ఉంటుంది.

**ఆసురీ సంపదమ్ అభిజాతస్య భవంతి** – ఈ లక్షణాలన్నిటినీ ఆసురీసంపత్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇవి రాజసిక, తామసిక గుణాలు ఎక్కువగా ఉన్నవ్యక్తిలో ఉంటాయి. ముఖ్యంగా తరతరాలుగా ఐశ్వర్యంలో ఓలలాడుతున్న కోటీశ్వరుల ఇళ్ళల్లో పుడితే వారికి అణకువ అంటే ఏమిటో తెలియదు; నమస్కారం పెట్టటం అంటే ఏమిటో తెలియదు.

ఈ విధంగా కృష్ణపరమాత్మ ఆసురీసంపత్తి ఏమిటో, ఆ లక్షణాలను నాలుగవ శ్లోకంలో టూకీగా పేర్కొన్నాడు. ఇంతకుముందు దైవీసంపత్తిని వివరించాడు. వీటిని మరోపేర్లతో వ్యవహరించాలంటే ఆధ్యాత్మికతను పెంపొందించే విలువలు; లౌకికంగా నిలిపేసే విలువలు అని చెప్పవచ్చును. అందువల్ల కృష్ణపరమాత్మ ఆసురీసంపత్తి గురించి వివరంగా చెప్పేముందు, మీరు మోక్షం పొందాలనుకుంటే, మీ జీవనవిధానం దైవీసంపత్తితో కూడినదై ఉండాలి అంటున్నాడు. ఆ భావనను ఐదవ శ్లోకంలో చెప్పబోతున్నాడు. దాన్ని ఇప్పుడు చూద్దాము.

శ్లో. 5 **దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా ।**
**మా శుచః సంపదం దైవీమ్ అభిజాతోఽసి పాండవ ॥**
దైవీ, సంపత్, విమోక్షాయ, నిబంధాయ, ఆసురీ, మతా,
మా, శుచః, సంపదమ్, దైవీమ్, అభిజాతః, అసి, పాండవ ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ అర్జునా! | (అతః) | = కనుక |
| దైవీ సంపత్ | = దైవీసంపద | మా శుచః | = శోకింపకుము |
| విమోక్షాయ | = ముక్తికోసం | (యతః) | = ఎందువలన అనగా (నీవు) |
| ఆసురీ | = ఆసురీసంపద | దైవీమ్, సంపదమ్ | = దైవీసంపదతో |
| నిబంధాయ | = బంధహేతువుగా | అభిజాతః, అసి | = పుట్టినవాడవు |
| మతా | = భావింపబడును | | |

**దైవీ సంపత్ విమోక్షాయ, ఆసురీ (సంపత్ చ) నిబంధాయ మతా**
**హే పాణ్డవ! (త్వం) దైవీమ్ సమ్పదమ్ అభిజాతః అసి, మా శుచః ॥**

తా: ఓ అర్జునా! దైవీసంపద ముక్తికోసం, ఆసురీసంపద బంధహేతువుగా భావింపబడును కనుక శోకింపకుము. ఎందువలన అనగా నీవు దైవీసంపదతో పుట్టినవాడవు.

**దైవీ సంపద్విమోక్షాయ (భవతి)** – మొదటి మూడుశ్లోకాల్లో చూసిన దైవీసంపత్తిని పెంపొందించుకుంటే అది మోక్షాన్ని ఇస్తుంది. అంటే ప్రత్యక్షంగా మోక్షాన్ని ఇవ్వదు కాని మోక్షం రావటానికి అవసరమైన ఆత్మజ్ఞానం పొందటానికి దోహదం చేస్తుంది. **మోక్ష హేతుః భవతి.**

**నిబంధాయాసురీ** – ఆసురీ సంపత్తి అంటే లౌకిక విలువలు సంసారంలో పట్టి ఉంచుతాయి. అంటే బంధంలో పడవేస్తాయి.

ఈ విషయం వినగానే సహజంగానే అర్జునునికి తను ఏ కోవలో చెందుతాడోనని సందేహం కలుగుతుంది. అది గ్రహించినట్టుగా కృష్ణపరమాత్మ అంటున్నాడు.

**మా శుచః** – ఖంగారు పడకు,

**దైవీం సంపదమ్ అభిజాతః అసి పాండవ** – నీకు దైవీసంపత్తి ఉందని అభయం ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ.

అర్జునుని భుజం తట్టి చెప్పినంత ధైర్యం ఇస్తున్నాడు తన మాటలతో. ఎందుకంటే ఆధ్యాత్మికత అంత తేలికగా అలవడదు. దానికి పూర్వజన్మ సుకృతం తోడవ్వాలి.

**అనేకజన్మసంసిద్ధః తతో యాతి పరాం గతిమ్** – 6.45

అంతకుముందు కృష్ణపరమాత్మ స్వయంగా చెప్పాడు, ఎన్నోజన్మల పుణ్యఫలం ఉంటేగాని ఈ జన్మలో ఆధ్యాత్మికత అలవడదు. అర్జునా, నీకా పూర్వజన్మ సుకృతం ఉంది. నువ్వు గుణబ్రాహ్మణుడివి. అందువల్ల నీకు సత్త్వగుణం ప్రధానంగా ఉంది. దానివల్ల నువ్వు ఆధ్యాత్మికంగా ఇంకా పైకి ఎదగగలవు అని అర్థం .

శ్లో. 6 **ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।**
**దైవో విస్తరశః ప్రోక్తః ఆసురం పార్థ మే శృణు ॥**

ద్వౌ, భూతసర్గౌ, లోకే, అస్మిన్, దైవః, ఆసురః, ఏవ, చ,
దైవః, విస్తరశః, ప్రోక్తః, ఆసురమ్, పార్థ, మే, శృణు ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | (స్తః) | = (కలవు) |
| అస్మిన్, లోకే | = ఈ లోకమునందు | దైవః | = దైవలక్షణములు గలవారిని గూర్చి |
| దైవః | = దైవలక్షణములుగల మానవ సముదాయము | విస్తరశః | = విస్తృతముగా |
| ఆసురః, చ | = ఆసురలక్షణములుగల మానవ సముదాయమని | ప్రోక్తః | = చెప్పబడినది |
| ద్వౌ, ఏవ | = రెండు విధములగు | ఆసురమ్ | = ఆసురసృష్టిని గూర్చి |
| భూతసర్గౌ | = ప్రాణి సముదాయములు | మే | = నాద్వారా |
| | | శృణు | = వినుము |

**హే పార్థ! అస్మిన్ లోకే దైవః ఆసురః చ ఏవ ద్వౌ**
**భూత–సర్గౌ (స్తః తత్ర) దైవః విస్తరశః ప్రోక్తః ఆసురమ్ మే శృణు ॥**

తా: ఓ అర్జునా! ఈ లోకమునందు దైవలక్షణములుగల మానవ సముదాయము, ఆసురలక్షణములుగల మానవ సముదాయమని రెండు విధములగు ప్రాణి సముదాయములు కలవు. దైవలక్షణములు గలవారిని గూర్చి విస్తృతముగా చెప్పబడినది. ఆసురసృష్టినిగూర్చి నాద్వారా వినుము.

మొత్తం మానవాళిని రెండు తెగలుగా విభజించవచ్చని ఈ శ్లోకంలో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఆ విభజన దేశాన్నిబట్టి కాదు, వైదిక సంప్రదాయాన్నిబట్టి కాదు, అది వారు పాటించే విలువలనుబట్టి.

**అస్మిన్ లోకే ద్వౌ భూతసర్గౌ** – ఈ లోకంలో మనుష్యసృష్టిలో రెండురకాల మనుష్యులు ఉన్నారు.

**దైవ ఆసుర ఏవ చ** – దైవీసంపత్తి ఉన్నవారు, ఆసురీసంపత్తి ఉన్నవారు. దైవీసంపత్తి ఉన్నవారికి సహజంగా ఆధ్యాత్మిక చింతన ఉంటుంది. వారు లౌకికదృష్టి ఎక్కువ ఉన్నవారి మధ్యలో పుట్టినా కూడా ఏదో శక్తి వారిని బలంగా ఆధ్యాత్మిక చింతన వైపు, ఆధ్యాత్మిక పుస్తకాల వైపు, ఆధ్యాత్మిక అంశాల వైపు, ఆధ్యాత్మికత ఎక్కువ ఉన్నవారివైపు ఆకర్షిస్తుంది. వారిని ఇటువైపు బలంగా ఏది లాగుతుందో కూడా వారికే స్పష్టంగా తెలియదు.

ఇంకొకవైపు ఇంకొకరకం మనుష్యులు ఉంటారు. వారు లౌకికప్రపంచంవైపు మొగ్గుచూపుతారు; ప్రాపంచిక విషయాలలోనే మునిగితేలుతుంటారు.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సంపరీత్య వివనక్తి ధీరః॥** – కఠ 1.2.2

వీటినే కఠోపనిషత్తులో యమధర్మరాజు శ్రేయస్సు, ప్రేయస్సు అన్నాడు. ఆసురీసంపత్తి ఉన్నవారు ఆధ్యాత్మిక చింతన మెండుగా ఉన్న కుటుంబంలో పుట్టినా, ఇంట్లో వేదఘోష వినిపిస్తున్నా, చుట్టూ వేదపండితులు ఉన్నా, ఆలయాల సన్నిధిలో ఉన్నా, కన్నతండ్రే స్వయంగా జ్ఞాని అయినా, ఆధ్యాత్మికతను వదిలి లౌకికప్రపంచం వైపు మొగ్గుచూపుతారు.

**దైవో విస్తరశః ప్రోక్తః పార్థ** – ఓ అర్జునా, ఈ రెండింటిలో నేను నీకు విస్తారంగా దైవీసంపత్తి గురించి ముందు శ్లోకాల్లో చెప్పాను.

**అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః** – 16.1

కాని ఆసురీసంపత్తి గురించి నీకు విస్తారంగా చెప్పలేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. వాటిని టూకీగా నాలుగవ శ్లోకంలో పేర్కొన్నాడు కాని అది తృప్తిగా లేదు.

**ఆసురం పార్థ మే శృణుః** – అందువల్ల, నేను ఆసురీసంపత్తి గురించి చెబుతాను విను. ఆసురీసంపత్తి గురించి తెలుసుకుంటే ఆ చెడులక్షణాలను అలవరచుకోకుండా, వాటినుంచి తప్పించుకోవచ్చు. ఆ విధంగా ఆసురీసంపత్తి గురించి ఉపోద్ఘాతాన్నిచ్చి, తర్వాత వాటి గురించి వివరంగా చెప్పబోతున్నాడు.

శ్లో. 7 **ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః ।**
**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥**
ప్రవృత్తిమ్, చ, నివృత్తిమ్, చ, జనాః, న, విదుః, ఆసురాః,
న, శౌచమ్, న, అపి, చ, ఆచారః, న, సత్యమ్, తేషు, విద్యతే ॥

| | | | |
|---|---|---|---|
| ఆసురాః | = ఆసురస్వభావము గల | న, విదుః | = తెలియనివారు |
| జనాః | = మనుష్యులు | తేషు | = వారిలో |
| ప్రవృత్తిమ్, చ | = ధర్మప్రవృత్తిని గాని | శౌచమ్ | = బాహ్యాభ్యంతరశుద్ధి |
| నివృత్తిమ్, చ | = అధర్మనివృత్తిని గాని | న, విద్యతే | = ఉండదు |

| | | | |
|---|---|---|---|
| ఆచారః, చ | = సత్కర్మాచరణమూ | సత్యమ్, అపి | = సత్యభాషణము కూడ |
| న | = ఉండదు | న | = ఉండదు |

**ఆసురాః జనాః ప్రవృత్తిమ్ చ నివృత్తిమ్ చ న విదుః తేషు చ**
**న శౌచమ్, న ఆచారః న అపి సత్యమ్ విద్యతే ॥**

తా: ఆసురస్వభావముగల మనుష్యులు ధర్మ ప్రవృత్తిని గాని, అధర్మ నివృత్తిని గాని తెలియనివారు. వారిలో బాహ్యాభ్యంతరశుద్ధి ఉండదు. సత్కర్మాచరణమూ ఉండదు, సత్యభాషణము కూడ ఉండదు.

మనుష్యులందరూ పుట్టుకతో లౌకికదృష్టితోనే పుడతారు. ఎవరికీ మోక్షం అనే ఒక లక్ష్యం ఉందని తెలియదు; ఎవరికీ ధర్మం అనేది ఒకటుందని తెలియదు. ఎందుకంటే మోక్షం కాని, ధర్మం కాని కంటికి కనబడే వస్తువులు కావు. ఈ రెండింటినీ అపౌరుషేయపురుషార్థాలు అంటారు. ధర్మార్థకామమోక్షాల్లో ధర్మం, మోక్షం కంటికి కనబడవు. సైన్సుకు కూడా ఇవి అందవు.

ఉన్న నాలుగు పురుషార్థాలలో రెండు కంటికి కనబడవు కాబట్టి, అందరూ అర్థ, కామాల వెంటే పరుగులు తీస్తారు. అర్థం అంటే డబ్బు. డబ్బు ఒకటే కాదు, పదవి, హోదా, ఆస్తిపాస్తులు. డబ్బు విలువ పసికందుకు కూడా తెలుసు. ఇంకొక పురుషార్థం కామం. కామం అంటే కోరిక. సుఖాలలో మునిగితేలాలనే కోరిక.

అందువల్ల ప్రతిఒక్కరికీ అర్థకామాల వెంట పరుగులు తీసే హక్కు ఉంది. ఈ అర్థకామాల వెంట పరుగులు తీయటంవల్ల మనలో తీవ్రంగా రాగద్వేషాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. రాగం అంటే ఒక దానిమీద ఇష్టం; ద్వేషం అంటే ఒక దానిమీద అయిష్టం. అర్థకామాలు కోరేటప్పుడు కొన్ని కావాలని బలంగా కోరుకుంటాము, కొన్నింటినుంచి దూరంగా తప్పించుకోవటానికి ప్రయత్నిస్తాము. ఇలా రాగద్వేషాలకు బానిస అవటం కొంతమేరకు ఫర్వాలేదు; అంటే జీవితపు తొలిరోజుల్లో ఫర్వాలేదు; కాని మనకు వయస్సు పెరిగి, బుద్ధి వికసించి, యుక్తాయుక్త విచక్షణ ఏర్పడ్డాక, నెమ్మదిగా ఈ రాగద్వేషాలనుంచి మారాలి. కొత్త విలువలవైపు మొగ్గు చూపాలి. ఆ విలువలను శాస్త్రం నేర్పిస్తుంది. వేదాన్ని వేదమాత అంటారు; వేదమాత మనను చెయ్యిపట్టి మంచిమార్గంలో నడిపిస్తుంది.

మనం పసిపిల్లలుగా ఉన్నప్పుడు మనకేం కావాలో, మనకు ఏది మంచో, ఏది చెడో మనకు తెలియదు. తల్లే చెయ్యి పట్టుకుని నడిపిస్తుంది. మరీ పాలుకారే పసిప్రాయంలో, ఉత్తపాలతో మనను పెంచుతుంది. క్రమేపీ పాలతోపాటు, కొన్ని ద్రవపదార్థాలను పెడుతుంది; నెమ్మదిగా కొంచెం కొంచెంగా ఘనపదార్థాలను పెడుతుంది. అంతేకాదు ఎప్పుడు ఏ ఇంజక్షను ఇప్పించాలో, ఎప్పుడు పోలియోడ్రాప్స్ వేయించాలో, అటువంటి ఆరోగ్యసూత్రాలను కూడా మనకోసం తను జాగ్రత్తలు తీసుకుంటుంది. అలా మనంతట మనం నిర్ణయం తీసుకోలేనంతవరకూ మన తల్లే మనను నడిపిస్తుంది. అలాగే వేదమాత కూడా మన అంతిమలక్ష్యమేదో మనకు తెలిసేంతవరకూ మనను దగ్గరుండి నడిపిస్తుంది.

వేదమాత మీకు మంచి ఏదో, మీకు తెలియదు, నేను చెబుతాను వినండి అంటుంది. మనకు మంచి ఏమిటి? ఆత్మజ్ఞానం మీరు పొందాల్సిన అంతిమలక్ష్యం అంటుంది. దాని విలువ మీకు వెంటనే తెలియకపోవచ్చు.

అందువల్ల ముందుగా నేను చెప్పే ఈ సాధన చెయ్యండి అంటుంది. లౌకిక జీవనవిధానానికి స్వస్తి చెప్పి ఆధ్యాత్మిక జీవనవిధానంవైపు మొగ్గుచూపండి అంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, మీ రాగద్వేషాలకు అనుగుణంగా నడుచుకోవటం మాని, నేను బోధించే విధినిషేధాలను పాటించండి అంటుంది.

విధి అంటే చేసితీరాల్సిన మంచిపనులు; నిషేధం అంటే చెయ్యకూడని తప్పుడు పనులు. విధిని కర్తవ్యం అనీ, నిషేధాన్ని అకర్తవ్యం లేదా వర్జనీయం అనీ అంటారు. ఆ విధంగా రాగద్వేషాలకు నిలయమైన జీవితంనుంచి విధి నిషేధాలను పాటించే జీవితానికి మారటాన్ని రెండవజన్మ అంటారు. ఇలా రెండవజన్మ ఎత్తటానికి ఉపనయనం చేస్తారు. ఈ ఉపనయనంద్వారా ప్రాకృతపురుషుడు సంస్కృతపురుషుడు అవుతాడు. ఇలా సంస్కరించబడటానికి ఉపనయనం తోడ్పడుతుంది. కాని కొందరు ఆసురీసంపత్తి ఉన్నవారు ఇలా మారటానికి ఉత్సాహం చూపరు. ఎందుకంటే వారికి శాస్త్రం చెప్పే ఆధ్యాత్మిక జీవనం పాటించటం ఇష్టం ఉండదు.

**అసురాః న విదుః** – లౌకిక జీవనంమీద మొగ్గు చూపేవారు, రాగద్వేషాలకు లోనయ్యేవారు; వారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ప్రవర్తించేవారు, శాస్త్రం జోలికి వెళ్ళరు. వారు లౌకికవిద్యలో ఎమ్మే, పిహెచ్‌డీలు చేసి ఉండవచ్చు గాక, కాని ఆధ్యాత్మికవిద్య పరంగా చూస్తే వారిని నిరక్షరాస్యులు అని చెప్పవచ్చు. అందువల్ల వారిని చదువుకున్న ప్రాకృతపురుషులు అనవచ్చు.

**ప్రవృత్తిం న విదుః** – వారికి ఏంచెయ్యాలో తెలియదు. అంటే శాస్త్రం విధించిన కర్తవ్యం తెలియదు. ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఏం చెయ్యాలో తెలియదు.

**నివృత్తిం చ న (విదుః)** – ఏం చెయ్యకూడదో కూడా తెలియదు. శాస్త్రం నిషేధించిన కర్మలు తెలియవు. ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఏం కర్మలు ఆటంకం కలిగిస్తాయో కూడా తెలియదు. అంటే కర్తృత్వమూ తెలియదు, అకర్తృత్వమూ తెలియదు. ఇంకో విధంగా చెప్పాలంటే ధర్మాధర్మ వివేకము లేదు. అందువల్ల వారికి ఏది చెయ్యాలనిపిస్తే అది చేస్తారు, ఏది వద్దనుకుంటే అది మానేస్తారు.

**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే** – శాస్త్రం మనకొక జీవనవిధానాన్ని నిర్దేశించింది. మనం ఆధ్యాత్మికంగా ఎదగటానికి, పొద్దున్న లేచినప్పటినుంచి ఏం చెయ్యాలో చెప్పింది. ఆ మాటకొస్తే ఎప్పుడు లేవాలో కూడా నిర్దేశించింది. శాస్త్రం నిర్దేశించిన మొట్టమొదటి విధి సూర్యోదయంకన్నా ముందే లేవాలి. ఈ రోజుల్లో అదే చాలాకష్టం. మన పూర్వీకులు చీకటి పడగానే పడుకుని, సూర్యోదయానికి ముందే లేచేవారు. ఇప్పుడు పరిస్థితి దానికి పూర్తిగా భిన్నంగా మారిపోయింది. పడుకోవటమే ఏ అర్థరాత్రికో పడుకుంటున్నారు; ఇంక పొద్దున్నే లేచే అవకాశం ఏది? ఆఫీసునుంచి రావటమే ఆలస్యమవుతుంది, వచ్చాక భోజనం చేసి, టీవీ చూసి లేదా క్లబ్బులకు వెళ్ళి, అన్నీ అయి పడుకోవటం ఆలశ్యం; దానివల్ల లేవటం ఆలశ్యం.

ఆచారః – ఆచారః అంటే సూర్యోదయంలోపు లేవాలి. సూర్యభగవానుడు మనకు ప్రత్యక్షదేవత. మనను దీవించటంకోసం ఆయన పొద్దున్నే లేచివస్తున్నాడు. ఆ సూర్యభగవానునికి మనం స్వాగతం పలకాలంటే ఆయన వచ్చేలోపే లేచి కాలకృత్యాలు తీర్చుకుని ఉండాలి. అందువల్ల మొదటి విలువ ఆచారం అంటే పొద్దున్నే లేవటం.

లేచాక ఏం చెయ్యాలి? ఆధ్యాత్మిక చింతనతో రోజును మొదలుపెట్టాలి. డబ్బు సంపాదించుకోవటం, పెళ్ళి చేసుకోవటం, పిల్లల్ని కనటం, వారి బాగోగులు చూడటం, ఇవన్నీ మంచి లక్ష్యాలే కాదనటం లేదు; కాని జీవితంయొక్క అంతిమలక్ష్యం ఇవికాదు, వేరే ఉంది. అందువల్ల పొద్దున్న లేవగానే మీకు మీరు చెప్పుకోవాలి – నేను మనిషిగా పుట్టినందుకు నా జీవితలక్ష్యం వేరే ఉంది. అందువల్లనే పొద్దున్న లేవగానే స్నానపానాదులు గావించి, దేవుని ముందు దీపం వెలిగించి, ఏదైనా ప్రార్థన చెయ్యాలి.

నుదుట కుంకుమ దిద్దుకోవాలి. లౌకిక జీవనవిధానం మనను ప్రాపంచిక ప్రలోభాలలోకి దింపేసే ప్రమాదం ఉంది. దానికి లొంగిపోకుండా, స్థిరంగా నిలబడగలగటానికి నుదుటిమీద కుంకుమో, చందనమో, విభూతో దిద్దుకోవాలంటుంది శాస్త్రం. విభూతిని తయారుచేసేటప్పుడు చాలా మంత్రాలు చదువుతారు. విభూతిని మామూలు బూడిదగా చూడకూడదు; ఒక పద్ధతిలో మంత్రాలు చదివి, దాన్ని తయారుచేస్తారు. అలా విభూతికే ప్రత్యేకమైన విలువ ఉంది. అదికాక, విభూతి పెట్టుకునేటప్పుడు కూడా దానికి ప్రత్యేకించి ఒక మంత్రం ఉంది. దాన్ని పఠించాలి. భగవంతుని నామాలు పఠిస్తూ పెట్టుకుంటారు కాబట్టి వైష్ణవ సంప్రదాయంలో దాన్ని **నామం** అంటారు. విభూతి అంటే భగవంతుని మహిమ. పదవ అధ్యాయాన్ని విభూతియోగము అంటారు. అందులో భగవంతుని మహిమలను ఎన్నింటినో చూస్తాము. విభూతిని పెట్టుకుంటూ మృత్యుంజయమంత్రాన్ని పఠిస్తారు.

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్**
**ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్**

ఈ మంత్రం భగవంతునియొక్క విభూతి గురించి చెబుతుంది. అంటే అది పెట్టుకుంటూ భగవంతుని విభూతులను గుర్తు తెచ్చుకుంటారు కాబట్టి, దాన్ని విభూతి అంటారు. ఈ విభూతి మనను లౌకికప్రపంచం యొక్క మాయలోపడి కొట్టుకుపోకుండా కాపాడుతుంది.

అందువల్ల పొద్దున్నే లేచి, స్నానం చేసి, దీపం వెలిగించి, ప్రార్థన చేసి, భగవంతునికి నమస్కారం పెట్టుకుని, జీవితలక్ష్యాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి. ఇవన్నీ చేసేదాకా చుక్కనీరు కూడా త్రాగకూడదు. పోనీ బెడ్‌కాఫీ తాగొచ్చా అంటే నీరే త్రాగకూడదంటే బెడ్‌కాఫీ ఎలా త్రాగుతారు? మీరు పాటించినా, పాటించకపోయినా, శాస్త్రం విధించిన విధి ఇది. ఇది పాటించకపోతే, అనాచారం అవుతుంది. మీ జీవితలక్ష్యాన్ని గుర్తు తెచ్చుకున్నాకే, ఏ పనైనా చెయ్యాలి.

దాని తర్వాత మీ ఇష్టం. హిందూపేపరు చదువుతారో, తెలుగు పేపరు చదువుతారో, అందులో హత్యలు, దోపిడీల గురించి చదువుతారో మీ ఇష్టం. కాని ముందు మాత్రం ఆచారంతో మొదలుపెట్టండి.

లౌకికజీవితం అంటే ఏమిటి? పైన చెప్పినవేవీ పాటించని జీవితం.

న చ శౌచమ్ – ఆధ్యాత్మిక శుచి అసలు ఉండదు ఈ లౌకిక జీవనవిధానం పాటించేవారికి. వారు రాత్రి వేసుకున్న బట్టలతో ఇల్లంతా తిరుగుతారు; టూత్‌బ్రష్ నోట్లో పెట్టుకుని, పేపరు చదువుతూ అటూఇటూ తిరుగుతారు. ఖచ్చితంగా ఇది వైదిక జీవనవిధానం కాదు. ఎందుకు? మన శాస్త్రం ప్రకారం దంతధావనం

కూడా ఒక ఆధ్యాత్మిక చర్య. పూర్వం పందుంపుల్లతో మొహం కడుక్కునేవారు. పందుంపుల్ల అంటే చెట్టునుంచి తీసిన చిన్నపుల్ల. దంతధావనం చేసేటప్పుడు వనస్పతి దేవతకు ఇలా ప్రార్థన చెయ్యాలి. 'ఓ వనస్పతి దేవతా! నా దంతాలకున్న మలాన్ని దంతధావన చెయ్యటంద్వారా పోగొట్టుకుంటున్నాను. దానితోపాటు నువ్వు నా మనస్సును కూడా శుద్ధి చెయ్యి.' ఎందుకు చెయ్యాలి? ఆత్మజ్ఞానం పొందటంకోసం. అలా వేదం ప్రతి చిన్న కార్యక్రమాన్నీ ఒక పూజగా మలిచింది. కాని ఆసురీసంపత్తి ఉన్నవారు ఆచారాన్నీ పాటించరు, శౌచాన్నీ పాటించరు. పోనీ విలువలను పాటిస్తారా?

న సత్యం తేషు విద్యతే – వారు విలువలకు కూడా విలువను ఇవ్వరు. వారికి ఏది వీలయితే అదే విలువ వారి దృష్టిలో. సత్యం పలకాలంటే, నాకు వీలయితేనే పలుకుతాను అంటారు వారు. సత్యం పలకకపోతే పాపం పొందుతావు అంటే పాపం ఉందని ఏమిటి నమ్మకం అంటారు. అలా మాట్లాడితే నరకానికి పోతావు అంటే, నరకం ఉందో లేదో, ఎవరికి తెలుసు అంటారు. ఇలాంటి జీవితంలో పడిపోతే మోక్షాన్ని పొందలేవు అంటే ఎవరికి కావాలి మోక్షం అని ఎదురుప్రశ్నిస్తారు. వారి ధ్యేయం ఎంతసేపూ లౌకికవిజయమే. అందువల్ల వారు సత్యం అనే విలువకు కూడా విలువనివ్వరు. ఇది లౌకిక జీవనవిధానంయొక్క ఆరంభం మాత్రమే. దాని పరిణామాలు ముందుముందు చూడబోతున్నాము.

శ్లో. 8 **అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।**
**అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్ ॥**
అసత్యమ్, అప్రతిష్ఠమ్, తే, జగత్, ఆహుః, అనీశ్వరమ్,
అపరస్పరసంభూతమ్, కిమ్, అన్యత్, కామహైతుకమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| తే | = | ఆసురీ ప్రకృతిగల మనుష్యులు | అపరస్పరసంభూతమ్ | = | కేవలము స్త్రీపురుషసంయోగము వలననే ఉత్పన్నమైనదని |
| జగత్ | = | జగత్తు | కామహైతుకమ్ | = | కామమే దీనికి కారణమని |
| అప్రతిష్ఠమ్ | = | ఆశ్రయరహితమని | అన్యత్, కిమ్ | = | ఇది తప్ప మరేమి లేదని |
| అసత్యమ్ | = | సర్వథా అసత్యమని | ఆహుః | = | చెబుతారు |
| అనీశ్వరమ్ | = | ఈశ్వరుడే లేడని | | | |

**(ఇదం) జగత్ అసత్యమ్, అప్రతిష్ఠమ్, అనీశ్వరమ్, అపరస్పర–సమ్భూతం**
**కామ–హైతుకమ్ (చ అస్తి) అన్యత్ కిమ్ (ఇతి) తే ఆహుః ॥**

తా: ఆసురీ ప్రకృతిగల మనుష్యులు జగత్తు ఆశ్రయరహితమని, సర్వథా అసత్యమని, ఈశ్వరుడే లేడని, కేవలము స్త్రీపురుషసంయోగమువలనే ఉత్పన్నమైనదని, కామమే దీనికి కారణమని, ఇది తప్ప మరేమి లేదని చెబుతారు.

వీరు పూర్తిగా లౌకిక జీవనవిధానంలో పడిపోతారు. మతం అన్నా, ఆధ్యాత్మికత అన్నా వీరికి కొంచెం కూడా విలువ లేదు; మతం, ఆధ్యాత్మికత వేదాలమీద ఆధారపడివుంటుంది, కాని వీరు అసలు వేదాన్నే నమ్మరు.

**అసత్యమ్** – వేదప్రమాణాన్ని నమ్మరు. ఇక్కడ సత్యం అంటే వేదప్రమాణం.

**మాతృపితృసహస్రేభ్యః అపి హితేషిణీ॥**

శంకరాచార్యులవారు ఇంకో సందర్భంలో వేదమాత వెయ్యిమంది తల్లిదండ్రులకన్నా ఎక్కువగా మానవాళి మేలు కోరుతుంది అని చెబుతారు. అటువంటి వేదమాత అంటే లక్ష్యంలేదు; పూర్తిగా నాస్తికులు.

**అప్రతిష్ఠమ్** – వారు ధర్మాన్ని కూడా నమ్మరు. ప్రతిష్ఠ అంటే ఇక్కడ ధర్మం; ధర్మం అంటే ప్రపంచంలో పాటించాల్సిన నైతికవిలువలు. ధర్మసూత్రాలే ఈ జగత్తుకు స్థితికారణం అంటుంది వేదం. కాని వీరు వేదాన్నే నమ్మనప్పుడు, వేదం బోధించే ధర్మాన్ని మాత్రం ఎలా నమ్ముతారు?

**ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా**
**లోకే ధర్మిష్ఠప్రజా ఉపసర్పంతి । ధర్మేణ పాపమపనుదతి**
**ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్ ॥ తస్మాద్ధర్మం పరమం వదంతి॥** – మహానారాయణోపనిషత్తు

ధర్మం అంటే జగత్తుకు స్థితికారణం. ధారణాత్ ఇతి ధర్మః. జగత్తును నిలబెట్టేది నైతికవిలువలే. ఎప్పుడైతే సమాజంలో నైతికవిలువలు మాయమవుతాయో, అప్పుడే సమాజం చెల్లాచెదురై, సర్వనాశనం అవుతుంది. అటువంటి సమాజం ఎన్నాళ్ళో మసలలేదు. అందువల్లనే శాస్త్రం ధర్మం గురించి బోధిస్తుంది కాని, ధర్మం కంటికి కనబడదు కాబట్టి, ఈ మనుష్యులు ధర్మాన్ని నమ్మరు. వారు పాంచభౌతిక ప్రపంచాన్నే నమ్ముతారు. అందులో శాస్త్రం నిరూపించిన భూమ్యాకర్షణశక్తివంటి సూత్రాలనే నమ్ముతారు కాని ధర్మసూత్రాలను నమ్మరు. ఎందుకంటే వాటిని సైన్సు నిరూపించలేదు. అందువల్ల ధర్మాధర్మాలు లేవు, పుణ్యపాపాలు లేవు, పునర్జన్మ లేదు అంటారు. **వేదో నాస్తి, ధర్మో నాస్తి.** అందుకని మీకిష్టం వచ్చినట్టుగా జీవితాన్ని అనుభవించండి అంటారు వీరు.

అయితే మరి సృష్టికర్త ఎవరు? దేవుడే లేడంటే, మరి జగత్తు ఎలా పుట్టింది?

**అనీశ్వరమ్ ఆహుః** – ఈశ్వరుడు కూడా లేడు. వారు భగవంతుణ్ణి కూడా నమ్మరు. సైన్సు బిగ్‌బ్యాంగ్ థియరీని నమ్ముతుంది. వీరు కూడా ఈ సృష్టిని చెయ్యటానికి భగవంతుడు అవసరంలేదు అంటారు.

**వేదః నాస్తి, ధర్మః నాస్తి, ఈశ్వరః అపి నాస్తి**

దేవుడు లేడంటే మతం లేదు, ఆధ్యాత్మికత లేదు. ఇలా అన్నీ తిరస్కరించుకుంటూ వస్తే, ఉన్నదేమిటి? రెండే ఉన్నాయంటారు వారు. అవి అర్థకామాలు; ఐశ్వర్యం, సుఖం. వారంలో ఐదురోజులు కష్టపడి డబ్బు సంపాదించు; మిగతా రెండురోజులు వారాంతంలో సరదాగా తిని, తాగటంతో గడుపు. 'ఖావో, పీవో, మజాకరో,' అంటారు హిందీలో. ఈ ఆనందించే మనస్తత్త్వం అన్ని భాషల్లోనూ ఉంది. 'ఈట్ డ్రింక్ అండ్ బీ మెర్రీ,' అంటారు ఇంగ్లీషువారు. ఇది ఎపిక్యూర్ అనే సిద్ధాంతి నియమం. ఈ రెండు వాక్యాల అర్థం తిను, తాగు, ఆనందించు. దీన్ని చార్వాక సిద్ధాంతం అంటారు. అందువల్ల జగత్తు అనీశ్వరం అంటారు వీరు.

వేదాన్ని నమ్మనివారిని నాస్తికులనీ, వేదాన్ని నమ్మేవారిని ఆస్తికులనీ అంటారు. మనం ఆస్తికులలోకి వస్తాము. మనం భగవంతుడు లేదా ఈశ్వరుడు ఈ జగత్తును సృష్టించాడనీ, ఆయనే వేదాలను కూడా సృష్టించాడనీ చెబుతాము. ఎలాగైతే ఏదైనా వస్తువు కొంటే, దాన్ని ఎలా వాడాలో నిర్దేశించే మాన్యువల్‌ని దానితోపాటు ఇస్తారో, అలాగే భగవంతుడు మనకోసం జగత్తును సృష్టించి, దాన్ని ఎలా వాడాలో అర్థం చేసుకునేందుకు వీలుగా వేదాలనే మాన్యువల్‌ను ఇచ్చాడు. అది వైదిక జీవనవిధానాన్ని సూచిస్తుంది.

వేదం మనకు ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలను నిర్దేశించింది. నాస్తికులు అర్థకామాల వెంటే పరుగులు తీస్తారు కాని, ధర్మాన్ని పట్టించుకోరు; మోక్షానికి అసలేరారు. వేదం మోక్షాన్ని నిర్దేశించింది, అదే మన అంతిమలక్ష్యం అని చెప్పింది. కాని ముందు చెప్పినటువంటివారితో ఆ విషయాలను చెప్పి, వారికి మీరు ఎంతగా నచ్చచెప్పాలని చూసినా, వారు మారరు కదా, ఎదురు మిమ్మల్నే వారి సిద్ధాంతంలోకి లాగటానికి ప్రయత్నిస్తారు. అందువల్ల మీరు వేదం నేర్చుకుంటున్న తొలిరోజుల్లో ఇటువంటి లౌకికవాదులతో ఈ విషయాలేవీ చర్చించకండి. ముందు వేదం అంటే ఏమిటో, వేదం మనకు నిర్దేశిస్తున్న లక్ష్యం ఏమిటో, వేదం ఎలా ప్రమాణమో, ధర్మం ఎంత ముఖ్యమో, ఈశ్వరుడు ఎలా సృష్టికర్తో, ఇటువంటి విషయాలమీద మీకు లోతైన జ్ఞానం అలవడేవరకూ వారితో వాదించకండి. వారు ఈశ్వరుడు లేడు, వేదాలు లేవు, ధర్మం లేదు, మతం లేదు అంటారు.

మరి అయితే ఈ సృష్టి ఎలా వచ్చింది? చాలా తేలిక!

**అపరస్పరసంభూతమ్** – భార్యాభర్తల సంయోగంవల్ల సృష్టి జరిగింది అంటారు వారు అని అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వారి కామమే సృష్టికి కారణం. వారెలా పుట్టారు? వారి తల్లిదండ్రుల కామంవల్ల. భార్యాభర్తల సంయోగంవల్ల పిల్లలు పుట్టేటప్పుడు, భగవంతుడు ఎందుకు? ఆయన గురించి ఆలయాలు నిర్మించటం ఎందుకు, పూజలు, అభిషేకాలు చెయ్యటం ఎందుకు అంటారు. ఆ డబ్బంతా శుద్ధ దండగ, దాన్ని బీదవారికి పంచితే మంచిది అంటారు.

ఇటువంటి వాదనలు వింటే, మనకు కూడా 'నిజమేసుమీ,' అనే సందేహం రావచ్చు. కాని శాస్త్రం ఒప్పుకోదు. భగవంతునికి చేసే పూజ, ధర్మకార్యాలు, అభిషేకాలు, ఆలయనిర్మాణాలు వృథాఖర్చు కానేకాదు. అది చెట్టు వేరుకు నీరు పొయ్యటం వంటిది. మీరు నీరు పోస్తున్నది చెట్టు కిందభాగంలో. అది వేరుకు వెళుతుంది. కాని ఒక కనబడని ప్రకృతిసూత్రం ఆ వేళ్ళకు పోసిన నీటిని వేళ్ళనుంచి చెట్టుయొక్క చిటారుకొమ్మదాకా అందే ఏర్పాటు చేస్తుంది. నాకు కంటికి కనబడలేదే అంటే, కనబడనవసరం లేదు. చెట్టుయొక్క అణువు, అణువుకూ నీరు వెళుతుంది. అదే విధంగా భగవంతుడు ఈ సృష్టికి మూలవేరు. గీతలోనే ముందు అధ్యాయంలోనే ఈ విషయాన్ని చూశాము.

**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్** – 15.1

అందువల్ల మీరు చేసే అభిషేకాలు, మీరు పెట్టే నైవేద్యాలు వృథాపోవు. అవి మొత్తం మానవాళికే మేలు చేస్తాయి. కాని ఇవన్నీ ఎంతచెప్పినా లౌకిక విషయాలకే ప్రాముఖ్యతనిచ్చే వ్యక్తికి అర్థం కావు.

అపరః అంటే పురుషుడు; పరః అంటే స్త్రీ; అపరస్పరః అంటే స్త్రీపురుషుల సంయోగంవల్ల; సంభూతమ్ అంటే పుడతారు అంటారు వారు. ఆ సంయోగం ఎందువల్ల జరుగుతుంది?

**కిమన్యత్ కామహైతుకమ్**– స్త్రీపురుషుల సంయోగం పిల్లలు కావాలనే కోరికవల్ల జరుగుతుంది అంటారు వారు.

శ్లో. 9 **ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోऽల్పబుద్ధయః ।**
**ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోऽహితాః ॥**
ఏతామ్, దృష్టిమ్, అవష్టభ్య, నష్టాత్మానః, అల్పబుద్ధయః,
ప్రభవంతి, ఉగ్రకర్మాణః, క్షయాయ, జగతః, అహితాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏతామ్, దృష్టిమ్ | = | ఈ లౌకిక దృష్టిని | ఉగ్రకర్మాణః | = | క్రూరకర్మలను ఆచరిస్తూ |
| అవష్టభ్య | = | అవలంబించి | జగతః, క్షయాయ | = | జగత్తుయొక్క వినాశము కొరకే |
| నష్టాత్మానః | = | నష్టపోతారు | ప్రభవంతి | = | సమర్థులగుచున్నారు |
| అల్పబుద్ధయః | = | మందబుద్ధులు | | | |
| అహితాః | = | అందరికీ అపకారము చేసే | | | |

**ఏతామ్ దృష్టిమ్ అవష్టభ్య నష్ట–ఆత్మానః అల్ప–బుద్ధయః,**
**ఉగ్ర–కర్మాణః, అహితాః జగతః క్షయాయ ప్రభవన్తి ॥**

తా: ఈ లౌకిక దృష్టిని అవలంబించి నష్టపోతారు మందబుద్ధులు అందరికీ అపకారము చేసే క్రూరకర్మలను ఆచరిస్తూ జగత్తుయొక్క వినాశము కొరకే సన్నద్ధులగుచున్నారు.

**ఏతాం దృష్టిమవష్టభ్య** – ఈ ఆసురీసంపత్తి ఉన్నవారు లౌకిక జీవనవిధానానికే కట్టుబడివుంటారు. వారు ప్రత్యక్ష ప్రమాణాన్ని మాత్రమే నమ్ముతారు. ప్రత్యక్షప్రమాణమైన జ్ఞానేంద్రియాలకు అందనిదేదీ లేదని వారి నమ్మకం. ఇంద్రియాలకతీతంగా ఒకటుందనీ, దాన్ని ఇంకొక ప్రమాణం ద్వారా తెలుసుకోగలమనీ మనం అంటే వారు ససేమిరా ఒప్పుకోరు.

ఇదెలాగుంటుందంటే, ఒకవ్యక్తికి పంచజ్ఞానేంద్రియాల్లో నాలుగే పనిచేస్తున్నాయనుకుందాము. అతనికి కంటిచూపు పనిచెయ్యదు; అంటే గుడ్డివాడు. అతనితో ఒక దృశ్యప్రపంచం ఉందనీ, అందులో అనేక రూపాలు, రంగులు ఉన్నాయని మనం చెబితే అతనేమంటాడు? అతను ససేమిరా ఒప్పుకోడు. నా నాలుగు ఇంద్రియాలకు అవి అందటంలేదు కాబట్టి దృశ్యప్రపంచం లేదు పొమ్మంటాడు. ఒకవేళ అతనికి మనం ఇలా నచ్చచెప్పటానికి ప్రయత్నించాం అనుకోండి, 'ఇదుగో చూడుబాబూ, మొత్తం ఐదు ఇంద్రియాలు ఉన్నాయి; చెవితో శబ్దాన్ని విన్నట్టుగా, ముక్కుతో వాసనలను తెలుసుకున్నట్టుగా, కంటితో రూపాలను, రంగులను చూస్తాము. అది వేరే ప్రత్యక్షప్రమాణం, నీకు అదిలేదు. అందువల్ల నువ్వు చూడలేకుండా ఉన్నావు.'

అతను మొండికేస్తాడు. లేదు ఇంకొక ప్రమాణం ఉందంటే నేను నమ్మను. నాకున్న ఈ నాలుగు ఇంద్రియాలతో నాకు దృశ్యప్రపంచాన్ని చూపించు అంటాడు. అతనికి తెలియనిది ఇంకొకటి ఉందనే విషయాన్నే జీర్ణించుకోలేడు. అదేసూత్రం వేదప్రమాణానికి కూడా వర్తిస్తుంది.

శాస్త్రం వేదాన్ని ఆరవ ఇంద్రియం అంటుంది. నేత్రాలతో జగత్తును చూస్తే, జ్ఞాననేత్రంతో బ్రహ్మను చూస్తాము; అంటే బ్రహ్మ గురించి తెలుసుకుంటాము. బ్రహ్మ గురించి తెలిపే ప్రమాణం వేదప్రమాణం. కొందరేమో ఈ ఐదు ఇంద్రియాలకు అందని బ్రహ్మను, ఇంద్రియాలతో చూడాలంటారు. కాని గుడ్డివాడు ఎలా దృశ్యప్రపంచాన్ని చూడలేడో, అలా వేదప్రమాణాన్ని ఉపయోగించటానికి ఇష్టపడని వ్యక్తి బ్రహ్మ గురించి తెలుసుకోలేడు. గుడ్డివాడు కన్ను లేదు అంటే నష్టపోయేది ఎవరు? అతనే! రంగులప్రపంచానికి ఏమీ నష్టంలేదు. రంగుల ప్రపంచంయొక్క అద్భుతాన్ని చూసి, మైమరచిపోవాలంటే, కన్ను అనే ఇంకో ప్రమాణం ఉందనీ, దాన్ని వాడితీరాలనీ అర్థం చేసుకోవాలి. అది చూపించేదాన్ని వేరే ప్రమాణంతో చూడలేరు.

అదే విధంగా వేదం ఒక ప్రమాణం. దాన్ని అవుననికానీ, కాదనికానీ ప్రత్యక్షప్రమాణమైన ఇంద్రియాలద్వారా చెప్పలేరు. కంటిని ప్రమాణంగా ఎంత ఖచ్చితంగా నమ్ముతారో, అలా వేదాన్ని కూడా ప్రమాణంగా అంత ఖచ్చితంగానూ నమ్మితే, ఒక అద్భుతమైన లోకంలోకి మిమ్మల్ని తీసుకువెళుతుంది వేదం. అది పంచజ్ఞానేంద్రియాలకు అందదు; సైన్సుకు అందదు. అందులోకి అడుగుపెట్టగలిగితే ఆనందం పొందేది మీరే.

వేదాన్ని ప్రమాణం కాదని తిరస్కరిస్తే, నష్టపోయేది ఎవరు? వేదం నష్టపోదు; అపౌరుషేయ ప్రపంచం నష్టపోదు. కాని ఈ విషయం లౌకికప్రపంచంలో మునిగితేలేవారికి అర్థంకాదు. పైగా వీరు మేము తార్కికంగా ఆలోచిస్తాము; ప్రత్యక్షప్రమాణానికి అందకపోతే మేము నమ్మము అని గొప్పగా చెబుతారు. అది ఇంతకుముందు చెప్పిన గుడ్డివాని వ్యవహారంలాగానే ఉంటుంది. ఏమన్నాడు అతను? నేను నాకున్న నాలుగు ఇంద్రియాలతో ఐదో ఇంద్రియం చూసే వస్తువును చూస్తానన్నాడు. అదెలా సాధ్యం కాదో, ఇదీ అలాగే సాధ్యం కాదు. అందువల్ల లౌకికప్రపంచానికి అంకితమైపోయేవారు,

**నష్టాత్మానః** – వారే నష్టపోతారు. ఎందుకంటే వారు సృష్టిలో అత్యధికభాగమైన తత్త్వాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అది తెలుసుకోవాలంటే వేదానికి రావాలి. వేదం నిర్వచనం ఏమిటి?

> **ప్రత్యక్షేణానుమిత్వా వా యస్తూపాయో న బుధ్యతే**
> **ఏనం విదంతి వేదేన తస్మాత్ వేదస్య వేదతా**

వేదం ఆరవప్రమాణం. అది చూపించే ప్రపంచం పంచజ్ఞానేంద్రియాలకు అందదు. ఎలాగైతే కన్ను చూపించే రంగులప్రపంచాన్ని వేరే ప్రమాణాలు చూపించలేవో, అలాగే వేదం చూపించే ప్రపంచాన్ని కన్నుకూడా చూపించలేదు. అందువల్ల ఇటువంటివారు నష్టపోతారు. ఎందుకు?

**అల్పబుద్ధయః** – వారికి ప్రమాణం గురించి సరిగ్గా తెలియకపోవటంవల్ల నష్టపోతారు. ఒక ప్రమాణం చూపించేదాన్ని ఇంకొక ప్రమాణం చూపించలేదు. కన్ను చూపించే వస్తువును చెవి అవుననీ నిరూపించలేదు, కాదనీ నిరూపించలేదు.

ఉదాహరణకు కన్ను ఒకరంగును చూపించి ఇది పసుపురంగు అని చెపితే, చెవులు అవును, ఇది పసుపురంగే అని నిర్ధారించలేవు, కాదు ఇది పసుపురంగు కాదని ఖండించనూలేవు. ఇదే సూత్రం వేదప్రమాణానికి కూడా అన్వయించవచ్చు. వేదప్రమాణం చూపించేదాన్ని ప్రత్యక్షప్రమాణం అవుననీ నిరూపించలేదు, కాదనీ ఖండించలేదు. ఇది ప్రమాణంయొక్క పరిధి. ఒక ప్రమాణంలోకి ఇంకొక ప్రమాణం జొరబడలేదు. ఇది అందరికీ అర్థంకాదు. అందువల్ల వేదం చెప్పినదాన్ని సైన్సుపరంగా నిరూపించటానికి ప్రయత్నిస్తారు. అది జరిగేపని కాదు. అలా నిరూపించలేమని అర్థంకాక, వారి తప్పు తెలుసుకోలేక, అసలు వేదాలే లేవు పొమ్మనేస్తారు. అందుకని వారిది అల్పబుద్ధి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఏతాం దృష్టిమవష్టభ్య – ఇటువంటి లౌకికదృష్టి ఉండటంవల్ల వారే నష్టపోతున్నారు.

**ఉగ్రకర్మాణః** – వారు క్రూరకర్మలైన అర్థకామాల వెంట పరుగులు తీయటంవల్ల ధర్మాన్ని ఉల్లంఘిస్తున్నారు. శరీరధర్మాన్ని పాటించకుండా శరీరాన్ని అనారోగ్యంపాలు చేసినట్టే, సమాజానికి ఉండాల్సిన ధర్మాన్ని పాటించకుండా సమాజాన్ని పాడుచేస్తున్నారు.

**జగతః క్షయాయ ప్రభవంతి** – సమాజంయొక్క నాశనానికి వారు కారణమవుతున్నారు. జ్ఞానానికి, విజ్ఞానం తోడవ్వాలి. జ్ఞానం అంటే లౌకికజ్ఞానం; విజ్ఞానం అంటే ధార్మికజ్ఞానం. లౌకికజ్ఞానం పెరిగి, ధార్మికజ్ఞానానికి విలువనివ్వకపోతే సమాజం భ్రష్టుపట్టిపోతుంది. అందువల్ల జగత్తు నాశనం అవుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉగ్రవాదులు ఎక్కువవుతారు; సైన్సును చెడుకారణాలకు ఉపయోగించే అవకాశం ఉంది. అంటే అణుబాంబులు ఎక్కువగా వాడే అవకాశం ఉంది. అందువల్ల ఇటువంటివారు చీడపురుగులు అవుతారు సమాజానికి.

**అహితాః** – అహితాః అంటే మానవాళికి శత్రువులు అవుతారు. చదువు ఉండి, సంస్కారం లేనివారు అవుతారు. **సాక్షరా రాక్షసాః భవంతి.** సాక్షరా అంటే చదువుకున్నవారు, విద్యావంతులు. కాని వారు రాక్షసులు అవుతారు. **సాక్షరా** తిరగేస్తే **రాక్షసా** అవుతుంది. చదువుకుని ధర్మాన్ని పాటించనివారు రాక్షసులు అవుతారు.

## పురుషార్థాలమీద విశ్లేషణ

ఇక్కడొకసారి ఆగి మనం వేదం మానవాళికి నిర్దేశించిన పురుషార్థాలను విశ్లేషించుకోవాలి. పురుషః అంటే మనిషి, పురుషుడు మాత్రమే కాదు; అర్థః అంటే లక్ష్యం. అందువల్ల **పురుషార్థాలు అంటే మానవలక్ష్యాలు.** వాటిని పురుషార్థాలు అని ఎందుకన్నారంటే మనిషి మాత్రమే తనకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, పట్టువదలని దృఢత్వంతో దాన్ని సాధించటానికి ప్రయత్నించగలడు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలంటే దానికొక ఫ్రీవిల్ ఉండాలి. మనిషి ఒక్కడే బుద్ధిజీవి. అందువల్ల అతనికి మాత్రమే ఫ్రీవిల్ ఉంది. అతను మాత్రమే చిన్న లక్ష్యాలను, దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటికి తగ్గ ప్రణాళికలను వేసుకోగలడు. అలా ఫ్రీవిల్, లక్ష్యాలు మనిషికి మాత్రమే ఉన్నాయి కాబట్టే దీన్ని పురుషార్థాలు అంటారు.

శాస్త్రం మనిషి ఆశించే లక్ష్యాలను నాలుగుగా విభజించింది. అతను ఏది కోరుకున్నా ఈ నాలుగింటిలోకే వస్తాయి. అవి ధర్మఅర్థకామమోక్షాలు. ధర్మం గురించి ముందు చెప్పినా అర్థం గురించి ముందు చూద్దాము.

**అర్థం** – అర్థం మాటను అక్షరాలా తీసుకుంటే డబ్బు. కాని దానితోపాటు అన్ని లౌకిక సంపదలూ వస్తాయి అంటే ధనం, హెూదా, పరపతి, ఆస్తిపాస్తులు కూడా వస్తాయి. జీవితానికి భద్రతను ఇస్తాయని మనిషి భావించినవన్నీ అర్థంలోకి వస్తాయి.

ఒక అద్భుతమైన ప్రకటన ఉంది, 'జీవితం చాలా అందమైనది; దానికి భద్రతను చేకూర్చుకోండి.' అంటే మా జీవితబీమా పాలసీ తీసుకోండి అంటారు దానితర్వాత. అందువల్ల భద్రత కోరుకోవటం చాలా సహజమైన ప్రవృత్తి. అది ఏరూపంలోనైనా ఉండవచ్చు. డబ్బు, షేర్లు, స్థలం, ఇల్లు వంటివన్నీ.

**కామం** – కామం అంటే కోరిక. ఇంద్రియాలు కోరుకునే అనేక విషయవస్తువులు. కాస్త డబ్బు పోగవగానే సుఖాల్లో తేలిపోవాలనుకుంటాడు మనిషి. అందువల్లనే ఇప్పటి టీవీలకు దాదాపు వంద ఛానెళ్ళు ఉన్నాయి. అవికాక సినిమాలు, షికార్లు, ఊర్లు తిరగటాలు ఉండనే ఉన్నాయి. మనిషి ఎలా డబ్బు సంపాదించాలి, ఎలా సుఖంగా ఉండాలని ఎవరూ ప్రత్యేకించి బోధించనవసరం లేదు. దానికి గురువు అవసరం లేదు, శాస్త్రం అవసరం లేదు. అంటే అర్థ, కామాలు మనిషికి సహజంగా అబ్బే కోరికలు.

కాని శాస్త్రం ఈ రెండింటితో ఆగిపోవద్దు, ఇంకో రెండు ఉన్నాయి, అవి కూడా మనిషికి మాత్రమే ఉన్నాయని చెబుతుంది.

**ధర్మం** – వాటిలో ఒకటి ధర్మం. ఆంతరశుద్ధి అంటారు లేదా చిత్తసంస్కారం అంటారు. మనిషికి అటువంటి సంస్కారాలు 41 చేస్తారు. అతను పుట్టక ముందునుంచీ, పుట్టాకా గర్భాధారణ సంస్కారం, పుంసవన సంస్కారం, సీమంతం, జాతకర్మ, నామకర్మ, అన్నప్రాశన, ఉపనయనం, వివాహం – ఇలా 41 సంస్కారాలు చేస్తారు. చివరి సంస్కారాన్ని మనిషి మరణించాక చేస్తారు. దాన్ని అంత్యేష్టి సంస్కారం అంటారు. ఈ సంస్కారాలన్నీ అతను అంతఃకరణశుద్ధి పొందటానికి తోడ్పడతాయి.

అంతఃకరణశుద్ధికి ఈ సంస్కారాలే కాదు, విలువలకు విలువనిచ్చే జీవనవిధానం కూడా తోడ్పడుతుంది. నైతిక విలువలు చాలా ముఖ్యం. నైతికవిలువలే కాదు, ఆరోగ్యకరమైన దృక్పథం కూడా తోడవుతుంది. అందువల్లనే మన సాంప్రదాయం చిన్నప్పటినుంచే ఇటువంటివి నూరిపోస్తుంది.

**మాతృదేవో భవ । పితృదేవో భవ । ఆచార్యదేవో భవ । అతిథిదేవో భవ**

తల్లిని, తండ్రిని, గురువును, అతిథిని దైవంగా కొలవాలి. వారికి వంగి నమస్కారాలు చెయ్యాలి. అలా చెయ్యటంవల్ల వారి వయస్సును గౌరవిస్తున్నాము; వారి విజ్ఞతకు దాసోహం అంటున్నాము; వారి అనుభవానికి జోహార్లు పలుకుతున్నాము. ఎందుకంటే కొంత పరిణితి వయస్సువల్ల, అనుభవంవల్లనే వస్తుంది. అందువల్ల డబ్బును చూసేతీరు, పరిసరాలను చూసేతీరు, జగత్తును చూసేతీరు ఇవన్నీ మన జీవనవిధానంలో ఒకభాగం. ఇవన్నీ మన చిత్తశుద్ధికి తోడ్పడతాయి. దీన్ని ధర్మం అంటారు. దీన్ని వేదాంతం సూక్ష్మబుద్ధి అంటుంది.

**దృశ్యతే తు అగ్రయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః** – కఠ

కాని వచ్చిన చిక్కేమిటంటే ఈ లక్ష్యాన్ని మనిషికి ప్రత్యేకించి చూపించలేకపోతున్నాము. అర్థ, కామాల గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మనిషికి తనకే స్వయంగా తెలుసు. ఒకవేళ తెలియకపోయినా డబ్బును చూపించి ఇదిగో ఇది అర్థపురుషార్థం అనీ, ఏ టీవీ ఛానెల్‌నో పెట్టి ఇదిగో ఇది కామపురుషార్థం అనీ చూపించవచ్చు. కానీ ధర్మాన్ని చూపించటమెలా? ధర్మం ఎందుకు ముఖ్యమైన పురుషార్థమో తెలుసుకోవాలంటేనే దానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి. ధర్మం అంటే ఆంతరసంస్కారం. ఇది విలువలతో కూడిన మతపరమైన జీవితం గడిపితేనే అలవడుతుంది. కేవలం విలువలు పాటించినా రాదు; కేవలం మతపరంగా జీవించినా రాదు; రెండింటి మేలుకలయిక ఉంటేనే ధార్మికజీవనం గడుపుతాడు మనిషి. దీన్నే ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ **దైవీసంపత్తి** అన్నాడు. దైవీసంపత్తి అంటే ఆంతరసంపద; కనబడని ఐశ్వర్యం.

**మోక్షం** – చివరి పురుషార్థం మోక్షం. అన్నింటికన్నా ఇది ఉన్నతమైనది. ధర్మార్థకామాలను ప్రేయోమార్గమని, మోక్షాన్ని శ్రేయోమార్గమని అంటుంది కఠోపనిషత్తు. ప్రేయోమార్గం మనిషికి ప్రియమైనది; శ్రేయోమార్గం మనిషికి శ్రేయస్కరమైనది. మోక్షం అంటే ఆధ్యాత్మిక జ్ఞానం. దీన్ని మోక్షం అని ఎందుకన్నారు? ఇది ముక్తిని లేదా స్వేచ్ఛను ఇస్తుంది. దేన్నించి? అజ్ఞానంనుంచి. ఆధ్యాత్మికజ్ఞానం మనకు అజ్ఞానంనుంచి విముక్తిని కలిగిస్తుంది. అజ్ఞానంనుంచి ముక్తి పొందితే, మొత్తం సంసారంనుంచే ముక్తి పొందుతాము. ఎందుకంటే శాస్త్రం మన సంసారం అజ్ఞానంవల్లనే ఏర్పడింది అంటుంది.

నేను అపూర్ణుడను, నాలో ఏదో వెలితి ఉంది అనే అజ్ఞానంవల్ల కోరికలు కలుగుతాయి; కోరికలు తీర్చుకోవటానికి కర్మలు చేస్తాను; కర్మవల్ల పుణ్య, పాప, కర్మఫలాలు కలుగుతాయి; పుణ్యపాపాలను సుఖదుఃఖాల రూపంలో అనుభవిస్తాను. వాటిని అనుభవించటానికి పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాను. ఇదే సంసారము

అజ్ఞానం → కోరిక → కర్మ → పుణ్యపాపాలు → సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం → సంసారం.

మొదటిదశ, చివరిదశ కలిపితే అజ్ఞానం=సంసారం. అందువల్ల అజ్ఞానం తొలిగితే, అజ్ఞానజనిత సంసారం కూడా తొలిగిపోతుంది. కాని ముందే చూసినట్టుగా ఏ డబ్బునో, సుఖాన్నో చూసినట్టుగా మోక్షాన్ని ఒక షోకేసులో పెట్టి, ఇదిగో ఒక్కొక్కరూ వచ్చి చూడండి అని చూపలేము. అందువల్ల ధర్మం, మోక్షం కంటికి కనబడవు.

కాని శాస్త్రం ఈ రెండింటిని కూడా మనిషి యొక్క లక్ష్యాలలో కలిపింది. వీటి విలువ మీకు తెలియకపోయినా, వీటి అర్థం మీకు తెలియకపోయినా ఫర్వాలేదు. నేను చెప్పిన జీవనవిధానం పాటించండి చాలు, మీకే కాలక్రమేణా ధర్మం అంటే ఏమిటో, మోక్షం అంటే ఏమిటో తెలుస్తుంది అంటున్నది శాస్త్రం.

తన పిల్లవానికి చిన్నవయస్సులో తల్లి సుద్దులు చెపితే అతనికి అర్థంకాదు. పరిశుభ్రత ఉండాలి; అన్నం తినే ముందు చేతులు కడుక్కోవాలి; ఇవన్నీ వివరించి చెబితే అర్థం చేసుకునే వయస్సు లేనప్పుడు తల్లి ఏంచేస్తుంది? మరీ చిన్నవయస్సులో అయితే తనే తీసుకువెళ్ళి చేతులు కడుగుతుంది; కొంచెం వయస్సు వచ్చాక, చేతులు

కడుక్కోరా అని ఆదేశిస్తుంది. ఇంకా పెద్దవాడయ్యాక వివరిస్తుంది. వేదమాత చేసేది కూడా అదే. ముందు విధినిషేధ వాక్యాలను నిర్దేశిస్తుంది. ఇవి చెయ్యి, ఇవి చెయ్యకు అంటుంది. వేదాన్ని తల్లిగా భావించి ఆ ఆజ్ఞలను పాటించాలి. వేదమాత నామంచికోసమే చెబుతున్నదని అర్థం చేసుకోవాలి. అందువల్ల అర్థ, కామాలతో పాటు తన జీవనవిధానంలో ధర్మ, మోక్షాలను కూడా కలుపుకోవాలి మనిషి. అలా చేస్తే మనిషి మతపరంగా జీవితం గడిపినట్టు అవుతుంది. అప్పుడు అతను దైవీసంపత్తిని పెంపొందించుకుంటాడు. అతనికి ఆంతరశుద్ధి అంటే ఏమిటో తెలియకపోవచ్చు; వైదికజీవనం అంటే ఏమిటో తెలియకపోవచ్చు; కాని ధర్మ, మోక్షాలు వేదమాత చెప్పిన పురుషార్థాలు, వాటిని కూడా నేను పాటించాలని నేర్చుకుంటే చాలు.

కాని లౌకికజీవనవిధానంలో మునిగితేలేవారు అర్థకామాల వెంటే పరుగులు తీస్తారు కాని వారికి ధర్మమోక్షాలంటే ఏమిటో తెలియదు. తెలుసుకోవాలని కూడా అనుకోరు. కనీసం వారికి వేదాలమీద శ్రద్ధ ఉంటే తెలుసుకునే అవకాశం ఉంది. కాని వారికి వేదాలమీద శ్రద్ధ లేదు; భగవంతునిమీద శ్రద్ధ లేదు; గురువుమీద శ్రద్ధ లేదు. కొంతమందికి వారికి తెలియదు, ఇంకొకరు చెపితే వినరు. అలాంటివారిని ఎవరూ బాగుచెయ్యలేరు. ఇలాంటి వ్యక్తులను అర్థకామప్రధాన మనుష్యులు అంటారు. వీరు లౌకకజీవనం గడిపేవారు. ఇటువంటివారిని కృష్ణపరమాత్మ ఆసురీసంపత్తి ఉన్నవారు అని పేర్కొని, వారిని తీవ్రంగా విమర్శించాడు తొమ్మిదవ శ్లోకంలో. వారు ఆధ్యాత్మికంగా నష్టపోతున్నారు అన్నాడు. **నష్టాత్మానః** అన్నాడు. వారికి అద్భుతమైన మోక్షం ఒకటి ఉందని తెలియదు. ఎందుకు? **అల్పబుద్ధయః**. వారికి అల్పబుద్ధి ఉండటంవల్ల.

వారితో ధర్మం గురించి మాట్లాడితే, వారు ధర్మానికి విలువనివ్వరు. పైగా ఎదురు మీకే కొన్ని ఉదాహరణలు చూపుతారు. అదుగో, వీరు చాలా ధార్మికపురుషులు; గొప్ప భక్తులు; నైతిక విలువలు బాగా పాటిస్తారు; కాని వారి పరిస్థితి ఎలావుందో చూడండి అంటారు. దానికి భిన్నంగా అధార్మికజీవనం గడుపుతూ పైకి వచ్చినవారిని చూపిస్తారు. భక్తి ఉండి లాభమేమిటి అని ఎదురు ప్రశ్నిస్తారు.

కాని అది అర్థంలేని వాదన. అలా వాదిస్తూపోతే, ఏ ప్రకృతిసూత్రాన్ని కూడా ఒప్పుకోలేరు. మంచి ఆరోగ్యం ఉండాలంటే ఎన్నో ఆరోగ్యసూత్రాలను పాటించాలి అంటారు. ఎటువంటి ఆహారం తినాలో, ఎటువంటి ఆహారం తినకూడదో చెబుతారు. అలాగే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తారు. సిగరెట్టు, మద్యం, మాంసాహారం ఆరోగ్యానికి హానికరం అంటారు. కాని అన్ని జాగ్రత్తలూ పాటించి, మందు జోలికి వెళ్ళనివారు చిన్నవయస్సులోనే మరణించినవారు ఉన్నారు. తెగ సిగరెట్లు కాల్చి, రోజూ మద్యపానం చేసినవారు ఆరోగ్యంగా తిరుగుతున్నవారు ఉన్నారు. రోజూ యోగాసనాలు వేస్తున్నా గుండెజబ్బు వచ్చి పోయినవారు ఉన్నారు. పొగత్రాగుట హానికరం అంటారు. అది ఊరికే చెప్పిన వాక్యం కాదు. చాలా పరిశోధనలు జరిపాక చెప్పినది. అయినా పొగత్రాగినవారు దుక్కలాగా ఉంటే, సిగరెట్టు మొహం కూడా ఎరగనివారు క్యాన్సర్ వచ్చి పోయినవారు ఉన్నారు. ఇలాంటి ఉదాహరణలు చాలా చెబుతారు వారు. కాని అలా కొన్ని ఉదాహరణలను చూసి నిర్ణయాలకు రాలేము. ప్రకృతి సూత్రాలను కొట్టివేయలేము; ఆరోగ్యసూత్రాలను కాదనలేము.

ధర్మం పాటించినవారు అవస్థ పడుతున్నారు; అధర్మం పాటించినవారు హాయిగా ఉన్నారు అనటంలో అర్థంలేదు. సిగరెట్టు తాగినవ్యక్తి బాగున్నాడు, తాగనివాడు చనిపోతున్నాడు అనటంలోనూ అర్థంలేదు. పూరిగుడిసెల్లో ఉండేవాడు కుళాయినీరు తాగి హాయిగా ఉన్నాడు; బిస్లరీనీరు లేదా కాచి చల్లార్చిన నీరు తాగినవాడు అవస్థ పడుతున్నాడు. అందువల్ల నేను మురికినీరు తాగుతాను అనగలరా? అలా తాగగలరా? తాగలేరు. ఆరోగ్యసూత్రాలను పాటించి తీరాలి; ప్రకృతిసూత్రాలను పాటించితీరాలి. ప్రతి నియమానికి ఒక సడలింపు ఉంటుందని చూశాము. ఇలా సడలింపులను చూస్తూ పోతే ఏ నియమాన్ని పాటించలేరు. అందువల్ల ధర్మం అవసరం లేదు, నేను అధర్మాన్ని పాటిస్తాను అనకూడదు. ధర్మం మాత్రమే మన ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. దీన్ని ఆసురీసంపత్తి ఉన్నవారు అర్థం చేసుకోలేరు. అటువంటి వారిని మనం ఏమీ చెయ్యలేము, వారిని కాపాడమని రెండుచేతులూ జోడించి ఆ భగవంతుణ్ణి ప్రార్థించటం తప్ప.

అటువంటివారు హింసా కార్యక్రమాలను చేపడతారు. హింస అధర్మం; కాని వారికి అది అధర్మం అని తెలియదు. వారికి ఏది ఆటంకమయితే దాన్ని తొలగించుకోవటమే వారి ఉద్దేశ్యం. అందువల్ల వారు జగతః అహితాః అంటే జగత్తుకు శత్రువులు అవుతారు. అధార్మిక పురుషులు లేదా ఆసురీసంపత్తి ఉన్నవారు సమాజానికి చీడపురుగులుగా మారి, సమాజాన్ని భ్రష్టుపట్టిస్తారు.

ఇక్కడితో పురుషార్థాలమీద విశ్లేషణ అయిపోయింది.

శ్లో. 10 **కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః ।**
**మోహాద్గృహీత్వాఽసద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతాః ॥**
కామమ్, ఆశ్రిత్య, దుష్పూరమ్, దంభమానమదాన్వితాః,
మోహాత్, గృహీత్వా, అసద్గ్రాహాన్, ప్రవర్తంతే, అశుచివ్రతాః ॥

| | | | |
|---|---|---|---|
| దంభమానమదాన్వితాః | = దంభము, దురభిమానము, మదము మున్నగువాటిని కలిగిన వీరు | అసద్గ్రాహాన్ | = అవైదిక సిద్ధాంతములను |
| దుష్పూరమ్ | = తనివితీరని | గృహీత్వా | = అవలంబించి |
| కామమ్, ఆశ్రిత్య | = కోరికలను ఆశ్రయించి | అశుచివ్రతాః | = శాస్త్రవిరుద్ధములైన భ్రష్టాచారములను ఆచరించుచు |
| మోహాత్ | = అజ్ఞానకారణముగా | ప్రవర్తంతే | = ప్రవర్తించెదరు |

**దుష్పూరమ్ కామమ్ ఆశ్రిత్య, మోహాత్ అసత్ గ్రాహాన్ గృహీత్వా,**
**అశుచి-వ్రతాః దమ్భ-మాన-మద-అన్వితాః ప్రవర్తన్తే ॥**

తా: దంభము, దురభిమానము, మదము మున్నగువాటిని కలిగిన వీరు తనివితీరని కోరికలను ఆశ్రయించి, అజ్ఞానకారణముగా అవైదిక సిద్ధాంతములను అవలంబించి, శాస్త్రవిరుద్ధములైన భ్రష్టాచారములను ఆచరించుచు ప్రవర్తించెదరు.

**దుష్పూరం కామమ్ ఆశ్రిత్య** – లౌకికకోరికలకు అంతూపొంతూ ఉండదు. కోరికలు అనంతం అని వస్తుంది అర్థశాస్త్రంలో. లౌకికకోరికలు తీరితే ఆనందం కలుగుతుంది అనుకుంటాము కాని ఎండమావి వంటిది. కోరికను కామ అంటారు. ఇంగ్లీషులో కామా పెడితే దాని తర్వాత ఇంకా ఉందని అర్థం. అలాగే కోరికలకు ఫుల్‌స్టాప్ ఉండదు, కామాలే ఉంటాయి. ఒకటి తీరేలోపు పది చేరతాయి. దీన్ని చిన్మయానందస్వామి అద్భుతంగా వర్ణిస్తారు.

ఆనందం గురించిన అపోహ = మీకు తీరిన కోరికలు / మీకున్న కోరికలు – స్వామి చిన్మయానంద

మీకు 10 కోరికలుంటే, అందులో నాలుగు తీరితే, మీ ఆనందం 4/10 అవుతుంది. అలా అయితే పదవకోరిక తీరేసరికి 10/10 అయి, పూర్ణానందం అవాలి కదా! కాని అవదు. ఎందుకంటే పదవకోరిక తీరేసరికి మీ కోరికలు 1000 అవుతాయో, 10000 అవుతాయో తెలియదు. అప్పుడు ఆనందం ఎంత? 10/100000. అందువల్ల కోరికను **మహాశనమ్** అన్నాడు కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయంలో. మీరు ఎంతసేపూ పైన తీరుతున్న సంఖ్యనే చూస్తున్నారు కాని, కింద మీకు తెలియకుండా వందలు, వేలల్లో పెరిగిపోతున్న కింద సంఖ్యను చూడటం లేదు. అందువల్ల కోరికలు తీరినకొద్దీ, ఆనందం పెరగాల్సింది పోయి, కోరికలు అనంతంగా పెరగటంవల్ల ఆనందం పెరగటం లేదు.

అందువల్ల దుష్పూరం అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వారికి ఎంతకీ తృప్తి తీరదు. అది అగ్నిలో ఆజ్యం పోసినట్టవుతుంది. అగ్నిలో ఆజ్యం పోస్తే, మంట తగ్గకపోగా, ఇంకా ఎక్కువవుతుంది.

**దంభమానమదాన్వితాః** – వారి కోరికలు కొన్ని తీరేసరికి వారికి దంభము, దురభిమానము, మదము పెరుగుతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. దంభము అంటే ఆర్భాటం, గొప్పలకు పోవటం; దురభిమానం అంటే గర్వం; మదము అంటే పొగరు. అన్నీ ప్రతికూల లక్షణాలు. ఇవన్నీ ఎందుకు కలుగుతున్నాయి?

**మోహాద్గృహీత్వాసద్గ్రాహాన్** – మోహంవల్ల కలుగుతున్నాయి. ఏమిటా మోహం? ఎంతో కష్టపడి జీవితంలో ఏ విజయాన్ని సాధించినా దానికి కాలపరిమితి, దేశపరిమితి ఉంటుందని తెలియదు.

పరిచ్ఛిన్నం + పరిచ్ఛిన్నం = పరిచ్ఛిన్నఫలం

మనిషే పరిచ్ఛిన్నజీవి. అతను చేసే కర్మలు కూడా పరిచ్ఛిన్న కర్మలలోకి వస్తాయి. పరిచ్ఛిన్న కర్మలు ఎన్ని చేసినా కూడా అపరిచ్ఛిన్నఫలం అయితే రాదు. అది వారికి అర్థం కావటం లేదు. ఎందుకంటే వారు మోహంలోపడి కొట్టుకుపోతున్నారు.

అసద్గ్రాహాన్ అంటే తప్పుడు సిద్ధాంతాలు. బాహ్యవస్తువులు నాకు భద్రతను ఇస్తాయనే తప్పుడు సిద్ధాంతం. బాహ్యవస్తువుకే భద్రత లేదు; డబ్బు శాశ్వతం కాదు; ఆర్థికమాంద్యం ఏర్పడుతుంది; వడ్డీరేట్లు తగ్గుతాయి; ఖర్చులు పెరుగుతాయి; ఆదాయం తగ్గుతుంది; నిత్యావసరాల ఖర్చులు పెరుగుతాయి. అందువల్ల ధనం శాశ్వతం కాదు; ఆస్తి పదికాలాలు నిలువదు. బంధుబలగం ఆపేక్షలు ఎన్నడూ ఒకేతీరులో ఉండవు. ఉద్యోగం ఏ క్షణంలో పోతుందో అసలే తెలియదు. వాటికే భద్రతలేని ఇటువంటి వస్తువులను పట్టుకుని పాకులాడితే వారికేం భద్రత కలుగుతుంది? కాని ఈ విషయం ఆలోచించే తీరికలేదు మనుష్యులకు. పెద్దఇంటిని కాపాడటానికి

బయట సెక్యూరిటీగార్డ్‌ను పెట్టుకుంటారు. అతను అర్భకంగా, గాలివీస్తే పడిపోయేలా ఉంటాడు. అతనేం భద్రత చూపగలడు? కాని ఇవన్నీ అర్థంకావు ఇటువంటి మనుష్యులకు.

**ప్రవర్తంతేఽ శుచివ్రతాః** – అనేక వ్రతాలను ఆచరిస్తారు. ఎటువంటివి అవి? శుభ్రత లేనివి. అన్నీ భ్రష్టాచార పద్ధతులు. వ్రతం అంటే నిజంగా ఏ శబరిమలైకి వెళ్ళే మండలం దీక్షో కాదు; అటువంటి దీక్షలేమైనా తీసుకోవచ్చు కదా! అలాంటి మంచిపనులు చెయ్యరు. ఏమైనా దీక్ష తీసుకున్నా, అది ఎదుటివ్యక్తిని ఎలా అణగద్రొక్కాలా అన్నదే వారి పట్టుదల. రాక్షసులు అలాగే చేసేవారు. వారు తీవ్రంగా తపస్సు చేసేవారు కాని అది మానవాళికి హాని చేసేదిగా ఉండేది. అలా వారు దీక్షలను ప్రతికూలచర్యలకు పాటిస్తారు.

శ్లో. 11 **చింతామపరిమేయాం చ ప్రలయాంతాముపాశ్రితాః।**
**కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః॥**
చింతామ్, అపరిమేయామ్, చ, ప్రలయాంతామ్, ఉపాశ్రితాః,
కామోపభోగపరమాః, ఏతావత్, ఇతి, నిశ్చితాః ॥

| | | | |
|---|---|---|---|
| ప్రలయాంతామ్ | = మరణించు వఱకును ఉండెడి | కామోపభోగపరమాః | = విషయభోగానుభవములందే మునిగియున్నవారై |
| అపరిమేయామ్ | = అంతులేని | చ | = ఇంకా |
| చింతామ్ | = చింతలను | ఏతావత్, ఇతి | = ఇదే నిజమైన సుఖమని |
| ఉపాశ్రితాః | = ఆశ్రయించినవారై | నిశ్చితాః | = భావింతురు |

**(తే) అపరిమేయామ్ ప్రలయాన్తామ్ చిన్తామ్ ఉపాశ్రితాః**
**కామ–ఉపభోగ–పరమాః చ, ఏతావత్ ఇతి నిశ్చితాః ॥**

తా: మరణించు వఱకును ఉండెడి అంతులేని చింతలను ఆశ్రయించినవారై, విషయభోగానుభవములందే మునిగియున్నవారై ఇంకా ఇదే నిజమైన సుఖమని భావింతురు.

ఈ లౌకికలక్ష్యాలు కోరేవారు అంతకంతకూ బాహ్యప్రపంచంమీద ఆధారపడతారు. వారు కోరేది అర్థకామాలనే అని చూశాము. అందువల్ల అంతకంతకూ ఆస్తిని పోగేయటానికి ప్రయత్నిస్తారు. అంతకంతకూ బాహ్యవస్తువుల్లో సుఖాలను వెతుక్కుంటారు. వేదాంతం ఇలా బాహ్యవస్తువుల వెంట పరుగులు తీయటం ఆపమంటుంది.

**సర్వం పరవశం దుఃఖమ్ । సర్వమ్ ఆత్మవశం సుఖమ్**

బాహ్యవస్తువులమీద ఆధారపడితే అది దుఃఖానికే దారితీస్తుంది. మీమీదే మీరు ఆధారపడితే అది సుఖాన్ని కలుగజేస్తుంది. బాహ్యవస్తువులు అంటే మనుష్యులు కావచ్చు, వస్తువులు కావచ్చు, సందర్భాలు కావచ్చు. ఏదేమైనా అవి మీరు కోరుకున్న ఆనందాన్ని ఇవ్వలేవు. బాహ్యప్రపంచం అనంతమైన ప్రకటనలతో హోరెత్తిస్తుంది. అవి చూసి వాటికి ఆకర్షించబడి, వాటి ప్రలోభంలో పడిపోతారు. ఆఖరికి సబ్బు కూడా వందరకాల సబ్బులు; అందులోనూ కాలికొకటి, చేతులకొకటి, మొహానికొకటి, అలా ఒక్క మనిషికి ఐదురకాల సబ్బులు. అంతా

మాయాజాలం; ఆకర్షణీయమైన ప్రపంచం. జీవితం ఆనందమయంగా సాగటానికి అనేక సదుపాయాలు. ఒళ్ళొంచి కష్టపడకుండా అనేక యంత్రాలు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, వాషింగ్‌మిషన్లు, డిష్‌వాషర్లు, ఒకటేమిటి అడుగడుగునా సౌఖ్యాలు. కాని వాటిని వెన్నంటే అభద్రతాభావన. ఏక్షణంలో అవి పనిచెయ్యటం మానేస్తాయో తెలియదు. ఏక్షణంలో ఒక వస్తువు వాడుకలో లేకుండా పోతుందో తెలియదు.

జీవితం వీటివల్ల ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో తెలియదు; ఎప్పుడేమవుతుందో తెలియకపోయేసరికి క్షణక్షణం భయం, బ్రతుకుభయం, ఆందోళన, తాకిడి. ఈ భయాందోళనలు ఆధ్యాత్మికచింతన ఉన్నవ్యక్తికి కలుగవు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః**

తనమీదే ఆధారపడ్డవ్యక్తికి ఈ భయాలు ఉండవు. అతను సుఖంగా ఉంటాడు.

**చింతామ్ అపరిమేయామ్** – చింత అంటే బెంగ, ఆందోళన. అపరిమేయామ్ అంటే అంతులేని. ఆసురీసంపత్తి ఉన్న మనిషిని అంతులేని చింతలు వెంటాడుతాయి. నిద్రలేమి ఒక చింత. ఇప్పుడు ప్రపంచీకరణం జరగటం వల్ల ప్రపంచంలో ఏమూల ఏం జరిగినా అది అన్ని దేశాలనూ ప్రభావితం చేస్తుంది. రెండుదేశాల మధ్య యుద్ధం జరిగితే, ప్రపంచంయొక్క ఆర్థికవ్యవస్థ దెబ్బతింటుంది; షేర్‌మార్కెట్ పడిపోతుంది. అందువల్ల అమెరికాలో ఏదైనా నిర్ణయం తీసుకున్నా, ఇక్కడ మనదేశ ప్రజల జీవితంమీద కూడా ఆ ప్రభావం ఉంటుంది. ఆర్థికపరిస్థితి అల్లకల్లోలమైపోతుంది. కాని దైవీసంపత్తి ఉన్నవ్యక్తి కర్మయోగిలా పనిచేస్తాడు. అతనికి ఈ బాధలు ఉండవు.

**నాస్థా ధర్మే న చ వసునిచయే నైవ కామోపభోగే,**
**యద్యద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపమ్।**
**హ్యే తత్ప్రార్థ్యం మమ బహుమతం జన్మ జన్మాంతరేఽపి,**
**త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు॥**

ఏది జరగాలని రాసిపెట్టి ఉంటే, అది జరగనీ; నా శాంతి ఈ ఊహించలేని వస్తువులమీద ఆధారపడకుండు గాక. నాకు బాహ్యవస్తువులమీద అధికారం లేదు; అందువల్ల నాకు లభించినదాన్ని నేను నవ్వుతూ స్వీకరించే ధైర్యాన్ని నాకు ఇవ్వు – ఇదీ దైవచింతన ఉన్నవ్యక్తి చేసే ప్రార్థన. యాక్సెప్ట్ అండ్ అకామడేట్. నవ్వుతూ స్వీకరించు; దాని గురించి చింతించకు. కాని ఆసురీసంపత్తి ఉన్నవ్యక్తి ఏంచేస్తాడు? అంతులేని చింతలను పడతాడు. నిద్రపట్టకపోతే నిద్రమాత్ర వేసుకుంటాడు. అలా ఎన్నాళ్ళు చింతలు పడతాడు?

**ప్రలయాంతామ్** – అతను మరణించేవరకు. ఇటువంటి వారిని భగవంతుణ్ణి శరణు వేడమంటే వేడరు. ఎందుకు? వారికి భగవంతునిమీద నమ్మకం ఉంటేనే కదా, శరణు వేడేది. వారికి భగవంతునిమీద భక్తి లేదు; కర్మయోగంమీద శ్రద్ధ లేదు; శాస్త్రంమీద గురి లేదు; రోజువారీ ప్రార్థనలమీద అసలే నమ్మకం లేదు.

**కామోపభోగపరమాః** – వారికి ఉన్న శ్రద్ధల్లా ఒక్క కోరికలు, ధనంమీదే. కాసుకు లోకం దాసోహం అంటారు. వారు దాసోహం అనేది కనకానికీ, సుఖాలకూ.

**ఇతి ఏతావత్ నిశ్చితాః** – పైగా ఇదే జీవితమనే స్థిరమైన నిశ్చయంతో ఉంటారు వీరు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉపనిషత్తులన్నీ ఇటువంటి వారిని తీవ్రంగా విమర్శిస్తాయి.

**అవిద్యాయామంతరే వర్తమానాః స్వయం ధీరాః పండితం మన్యమానాః**

**జంఘన్యమానాః పరియంతి మూఢాః అంధేనైవ నీయమానా యథాంధాః** – ముండకం 1.2.8

ఇటువంటి లౌకికసుఖాల వెంటపడేవారిని ఉపనిషత్తు మూఢులు అనీ, అంధులు అనీ విమర్శిస్తున్నది. వారు మూఢులు అయినా, తమను తాము ధీరులుగా అంటే తెలివైనవారుగా భావిస్తారుట! అలా భావించి ఊరుకున్నా కొంతవరకూ నయమే. కాని ఒక అంధుడు ఇంకొక అంధునికి దారి చూపించినట్టుగా, వారి ప్రభావంలోకి ఇంకో నలుగురిని దింపుతారు. అది ఇంకా ప్రమాదం. వారు ఇదే జీవితం అనుకుంటారు. ఇంకో మంచి మార్గం ఉందని వారికి తెలియదు.

శ్లో. 12 **ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః ।**

**ఈహంతే కామభోగార్థమ్ అన్యాయేనార్థసంచయాన్ ॥**

ఆశాపాశశతైః, బద్ధాః, కామక్రోధపరాయణాః,

ఈహంతే, కామభోగార్థమ్, అన్యాయేన, అర్థసంచయాన్ ॥

| | | | |
|---|---|---|---|
| ఆశాపాశశతైః, బద్ధాః | = ఆశాపాశాలతో బంధింపబడినవారు | అన్యాయేన | = అక్రమ మార్గములద్వారా |
| కామక్రోధపరాయణాః | = కామక్రోధములకు లోనైనవారై | అర్థసంచయాన్ | = ధనసమూహములను ప్రోగుచేయుటకోసం |
| కామభోగార్థమ్ | = విషయభోగముల నిమిత్తమై | ఈహంతే | = ఆరాటపడుచుందురు |

**ఆశా–పాశ–శతైః బద్ధాః, కామ–క్రోధ–పరాయణాః,**

**కామ–భోగార్థమ్ అన్యాయేన అర్థ–సఞ్చయాన్ ఈహన్తే ॥**

తా: ఆశాపాశాలతో బంధింపబడినవారు కామక్రోధములకు లోనైనవారై, విషయభోగముల నిమిత్తమై అక్రమ మార్గములద్వారా ధనసమూహములను ప్రోగుచేయుటకోసం ఆరాటపడుచుందురు.

**అశాపాశశతైః బద్ధాః** – ఈ లౌకికపురుషులు అనేక పాశాలతో బంధింపబడి ఉంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. పాశం అంటే కంటికి కనిపించే తాడు కాదు. మనిషి వేసుకునే అనేక బంధాలు; ఆశలతో కూడిన బంధాలు; అవి కూడా ఒకటా, రెండా? శతైః – వందలకొద్దీ ఉన్నాయి.

కాని దైవీసంపత్తి ఉన్నవ్యక్తిని ఇలాంటి బంధాలేవీ పట్టి బంధించవు. అతను తనకున్నదంతా భగవంతునికి ధారాదత్తం చేసేస్తాడు. భగవంతుని ఆస్తికి, తనను తాను ధర్మకర్తగా భావించుకుంటాడు. తను కష్టపడి ఇల్లు కట్టుకున్నా, గృహప్రవేశంలో భగవంతుని ప్రతిమతోనో, ఫోటోతోనో ఎందుకు అడుగుపెడతారో తెలుసా? ఇది కూడా భగవంతుని ఆలయం; అందులో నేను తాత్కాలికంగా, భగవంతుని కృపకొద్దీ నివసిస్తున్నాను అని

చూపించడానికి. ఆ విధంగా సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి ఏదీ తనదికాదు అనుకుంటాడు. కాని రాజసిక ప్రవృత్తి లేదా తమోగుణ ప్రవృత్తి ఉన్నవారు వారికున్న వాటిమీద బంధాలను పెంచుకుంటారు.

**కామక్రోధ పరాయణాః** – అంతేకాదు, వారు కామ, క్రోధాలకు కూడా తీవ్రంగా లోనవుతారు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఈ సమాజం కూడా ఇలా ఐశ్వర్యాల్లో మునిగితేలేవారినే స్తుతిస్తుంది. ఎవరైనా మెర్సిడిజ్ బెంజ్ కారులో దిగితే అతను లోకం దృష్టిలో గొప్పవాడు. ధర్మానికి విలువనిచ్చి, అణుకువగా ఉన్నవ్యక్తిని ఎవరూ పట్టించుకోరు. ఆ విధంగా సమాజమే మనుష్యులను తప్పుత్రోవ పట్టిస్తోంది. వైదిక సాంప్రదాయం సన్న్యాసికి విలువనిచ్చేది. బుద్ధుణ్ణి భగవంతునిగా ఎందుకు కీర్తించింది? అతన్ని రాజుగా కొలవటం లేదు; అతను తన రాజ్యాన్ని, రాజ్యభోగాలను త్యజించాడు కాబట్టి అతన్ని భగవంతునిగా ప్రార్థించింది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**

ఇప్పటి సమాజం ఆంతర సన్న్యాసానికి విలువను ఇవ్వటంలేదు; బాహ్యమైన ఆడంబరాలకే విలువను ఇస్తోంది. అందువల్ల మనుష్యులు కామ, క్రోధాలకు గురి అవుతున్నారు.

**ఈహంతే** – వాటివెంట పరుగులు తీస్తున్నారు. రోజుకు 16 లేదా 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవటం లేదు. సెల్‌ఫోను అవిరామంగా మ్రోగుతూనే ఉంటుంది. ఇటువంటి వారికి పంచమహాయజ్ఞాలు చేసే తీరికే ఉండదు. పంచమహాయజ్ఞాలు చెయ్యటం సంగతి దేవుడెరుగు, వాటి గురించి తెలుసుకునే తీరిక కూడా ఉండదు. అందువల్ల వారు ఎంతసేపూ పని, పని, పనిలో మునిగిపోతుంటారు. వారిని పనిరాక్షసులు అంటారు. ఇంగ్లీషులో వారిని వర్క్‌హాలిక్స్ అంటారు.

**అర్థసంచయాన్** – ఇంత పనిరాక్షసులుగా ఎందుకు పనిచేస్తారు? ఐశ్వర్యాన్ని ప్రోగేసుకోవటానికి. ధనాగమనతృష్ణలో పడికొట్టుకుపోతారు ఇటువంటివారు. వారికి ఎంత ఉన్నా తనివితీరదు. ఇంకా, ఇంకా కావాలనుకుంటారు. డబ్బును రెండు రకాలుగా దాచుకుంటారు. వాటిని తెల్లధనం, నల్లధనం అంటారు. న్యాయంగా సంపాదించింది కొంత; అన్యాయంగా సంపాదించింది కొంత. కొంతమంది చమత్కారంగా రామ్ అండ్ శ్యామ్ అంటారు. ఎందుకు ఇంతగా వెంపర్లాడతారు?

**కామభోగార్థమ్** – సుఖాల్లో మునిగితేలటానికి. శాస్త్రం డబ్బు సంపాదించటాన్ని ఎన్నడూ విమర్శించదు. ఈ విషయాన్ని ఇంతకుముందు కూడా చూశాము. పూర్వకాలపు జీవనవిధానం తీసుకుంటే గృహస్థు ఒక్కనికే సంపాదించే హక్కు, అవకాశం ఉంది. బ్రహ్మచారి గురుకులంలో ఉంటాడు; అతను సంపాదించలేడు. వానప్రస్థాశ్రమంలోనూ, సన్న్యాసాశ్రమంలోనూ భిక్షాటన చేసి జీవించాలి. వీరిని పోషించేది గృహస్థే. అందువల్ల గృహస్థాశ్రమంలో ఎక్కువ ధనం సంపాదించటానికి ఆవహంతీ హోమం వంటి యజ్ఞాలను కూడా సూచిస్తుంది శాస్త్రం. అందువల్ల ధనం సంపాదించటం తప్పుకాదు. మరి ఎందుకు ఈ ధనాగమనతృష్ణను విమర్శిస్తుంది వేదం?

ధనాన్ని సంపాదించాలి కాని దాన్ని ఇతరులకు ఖర్చుపెట్టాలి. అందువల్లనే కర్మయోగ జీవనవిధానాన్ని నిర్దేశిస్తుంది శాస్త్రం. కర్మయోగి ధనం సంపాదించి, దానితో పంచమహాయజ్ఞాలను చేస్తాడు. కేవలం కర్మ చేసే వ్యక్తి, తను సంపాదించిందంతా తనకొక్కడికే స్వంతం అనుకుంటాడు.

సన్న్యాసి ఇటు ధనమూ సంపాదించడు, అటు అతని దగ్గర ధనమూ ఉండదు; కేవలం కర్మచేసే వ్యక్తి వెయ్యి రూపాయలు సంపాదిస్తే, అందులో ఎవరికీ పైసా కూడా రాల్చడు. ఇది ఇంకొక విపరీతధోరణి. కర్మయోగి ఎక్కువ సంపాదించి, తన స్వంతానికి తక్కువ పెట్టుకుంటాడు. మిగిలినది దానం చేస్తాడు. కాని ఈ ఆసురీసంపత్తి ఉన్నవారు ధనాన్ని సంపాదిస్తారు. అది కూడా ఎలా?

**అన్యాయేన** – అక్రమమార్గాలద్వారా సంపాదిస్తారు. ఆ సంపాదించింది కూడా వారి కోరికలు తీర్చుకోవటానికి సంపాదిస్తారు.

శ్లో. 13 **ఇదమద్య మయా లబ్ధమ్ ఇమం ప్రాప్స్యే మనోరథమ్ ।**
**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥**

ఇదమ్, అద్య, మయా, లబ్ధమ్, ఇమమ్, ప్రాప్స్యే, మనోరథమ్,
ఇదమ్, అస్తి, ఇదమ్, అపి, మే, భవిష్యతి, పునః, ధనమ్ ॥

| | | | |
|---|---|---|---|
| మయా | = నాచేత | ప్రాప్స్యే | = పొందగలను |
| అద్య | = ఇప్పటికే | మే | = నాయొద్ద |
| ఇదమ్ | = ఈ అభీష్టవస్తువులు | ఇదమ్, ధనమ్ | = ఈపాటి ధనము |
| లబ్ధమ్ | = పొందబడినవి | అస్తి | = కలదు |
| ఇమమ్, మనోరథమ్ | = ఇంకను ఇటువంటి అభీష్టమును గూడ | పునః, అపి | = ఇంకను |
| | | ఇదమ్, భవిష్యతి | = ఈ సంపద ఎంతో పెఱుగును |

**అద్య ఇదమ్ మయా లబ్ధమ్, ఇమమ్ మనోరథమ్ (శ్వః) ప్రాప్స్యే,**
**ఇదమ్ ధనమ్ (అధునా) అస్తి, ఇదమ్ అపి (ధనమ్ చ) మే పునః భవిష్యతి ॥**

తా: నాచేత ఇప్పటికే ఈ అభీష్టవస్తువులు పొందబడినవి. ఇంకను ఇటువంటి అభీష్టమును గూడ పొందగలను. నాయొద్ద ఈపాటి ధనము కలదు. ఇంకను ఈ సంపద ఎంతో పెఱుగును.

13-16 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ ఆసురీసంపత్తి ఉన్నవారి ఆలోచన తీరుతెన్నులను వివరించబోతున్నాడు. ఆసురీసంపత్తితో రాక్షసీసంపత్తిని కూడా కలుపుకోవాలి. మనం ఉపోద్ఘాతంలో మూడురకాల మనుష్యులను చూశాము. వాటిని దైవీసంపత్తి, ఆసురీసంపత్తి, రాక్షసీసంపత్తిగా చూశాము. కృష్ణపరమాత్మ చివరి రెండూ కలిపి ఒకటిగా తీసుకున్నాడు. అంటే ఆసురీసంపత్తి, రాక్షసీసంపత్తులను కలిపి ఆసురీసంపత్తి అంటున్నాడు. ఈ రెండింటి మధ్య సూక్ష్మభేదాన్ని మనం ముందే చూశాము. ఆసురీసంపత్తి రాగప్రధానంగా ఉన్న జీవితాన్ని సూచిస్తే, రాక్షసీ సంపత్తి ద్వేషప్రధానంగా ఉన్న జీవితాన్ని సూచిస్తుంది. ఆసురీసంపత్తి రాజసికప్రవృత్తి ఉన్నవారికి ఉంటే, రాక్షసీసంపత్తి తామసికప్రవృత్తి ఉన్నవారికి ఎక్కువగా ఉంటుంది.

రాగప్రధానంగా ఉన్న వ్యక్తులు పూర్తిగా స్వార్థపూరితంగా ఉంటే, ద్వేషప్రధానంగా ఉన్న వ్యక్తులు ఇతరులను హింసిస్తారు. రాగప్రధానంగా ఉన్న వ్యక్తులు వెంటనే ఎవరికీ హానిచెయ్యకపోయినా, వారు కూడా సమాజానికి ఎప్పటికన్నా హానికరమే. ఎందుకంటే వారు సమాజంనుంచి తీసుకునేది ఎక్కువా, ఇచ్చేది తక్కువా ఉంటుంది. అంతేకాదు, ఎప్పటికన్నా ఆ స్వార్థం వారికి కూడా హానికరమే. కాకపోతే ఈ నష్టం వెంటనే కొట్టొచ్చినట్టు కనబడదు; నెమ్మదిగా కొంచెం కొంచెంగా విషపూరితం చేస్తుంది సమాజాన్ని.

ఆ విధంగా ద్వేషప్రధానంగా ఉన్నవ్యక్తి సమాజానికి వెంటనే హానిచేస్తే, రాగప్రధానంగా ఉన్నవ్యక్తి చాపకింద నీరులా నెమ్మదిగా ఎప్పటికో హాని చేస్తాడు. ఆ విధంగా ఇద్దరూ హానికరమే. అందువల్ల కృష్ణపరమాత్మ ఆసురీ సంపత్తి ఉన్నవారిని మాత్రమే పేర్కొన్నాకూడా, రాక్షసప్రవృత్తి ఉన్నవారు కూడా అందులోకే వస్తారు. వీరిని సాధారణంగా లౌకికప్రధానంగా ఉన్నవారు అనో, అర్థకామప్రధానంగా ఉన్నవారు అనో అంటారు. వీరు ధర్మ, మోక్షాలను పట్టించుకోరు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. అర్థకామాల వెంట పరుగులు తీసేవారిని విమర్శించినంత మాత్రాన అసలు ధనం కాని, ఇల్లు కాని ఉండకూడదు అనటం లేదు మనం. ఇల్లు, వాకిలి ఉండటానికి కావాలి; జీవితం గడపటానికి ధనమూ కావాలి. అందువల్ల వీటిని మనం బొత్తిగా చిన్నచూపు చూడటం లేదు. కాకపోతే ధర్మ, మోక్షాలను పట్టించుకోనంతగా వీటికోసం వెంపర్లాడకూడదు అంటున్నాము అంతే. ధనసంపాదనను పూర్తిగా ద్వేషించకూడదు; ధనసంపాదనలోనే లోతుగా మునిగిపోకూడదు. రెండూ తప్పే.

మన సాంప్రదాయం ధనాన్ని లక్ష్మీదేవిగా చూస్తుంది. ఎవరైనా సరే ధనాన్ని గౌరవించాలి కాని దానికి బందీ అయిపోకూడదు. ద్వేషించటమూ తప్పే, బందీ అవటమూ తప్పే. మరి ఏది సరియైన మార్గం? డబ్బు సంపాదించాలి కాని దాన్ని ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఉపయోగించాలి. కాని ఈ ఆసురీసంపత్తి ఉన్నవారికి అలాంటిది ఒకటి ఉందని తెలియనే తెలియదు. శరీరం ఒకటే కాదు, ఆ శరీరం వెనక ఆత్మ ఉంది. ఆత్మను గౌరవించాలి. ఇది సమతుల్యమైన భావన. కాని ఇది తెలియదు ఈ రకం మనుష్యులకు.

అందువల్ల ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ ఇటువంటివారి ఆలోచనా విధానాన్ని వివరిస్తున్నాడు. వారి ఆలోచన రోజంతా ఎలా ఉంటుంది, వారు దేని గురించి ఎక్కువగా ఆలోచిస్తారు, ఇటువంటివి చెప్పబోతున్నాడు. లక్ష్మీదేవి గురించి మాత్రమే కాదు, లక్ష్మీనారాయణుని గురించి కూడా ఆలోచించాలి అంటుంది శాస్త్రం. కాని వీరు ఎంతసేపూ ఎంత సంపాదించాము, ఇంకా ఎంత సంపాదించాలి, దాన్ని ఎలా సంపాదించాలనే ప్రణాళికలు వేసుకోవటంతోనే సరిపోతుంది. వారి దారికి ఎవరైనా అడ్డువస్తే వారిని అడ్డు తొలగించుకోవటానికి కూడా వెనుకాడరు. వారికి సమయం చాలా ముఖ్యం. 'టైమ్ ఈజ్ మనీ' అంటారు. అందువల్ల వారికి ప్రతి నిముషమూ ముఖ్యమే. వారికి ఖాళీ దొరికినా భగవద్గీత గురించో, భగవంతుని గురించో ఆలోచించే ఉద్దేశ్యం ఉండదు. దేనిమీద శ్రద్ధ ఉంటుందో కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో వివరించబోతున్నాడు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము. వీటిని ఈ ఆసురీసంపత్తి ఉన్నవారు అంటున్నట్లుగా అర్థం చేసుకోవాలి.

**ఇదమద్య మయా లబ్ధమ్** – ఇంత ఐశ్వర్యం నాచేత ఇవాళ పొందబడింది అనుకుంటారు వీరు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అద్య అంటే ఇవాళ లేదా ఇప్పుడు. అలా తను పొందినవాటి గురించి లెక్కలు వేసుకుంటూ ఉంటాడు. ఇన్ని లక్షలు సంపాదించాను, ఇన్ని కోట్లు సంపాదించాను అనుకుంటాడు. అతనికి ధర్మం, మోక్షం, జ్ఞానం అవసరంలేదు. అతని విలువ అతనికున్న ఆస్తే.

కర్మయోగి ఎంత సంపాదించానని చూడడు; ఎంత దానం చేశానని చూస్తాడు. నిజానికి భగవంతుడు కూడా ఒకవ్యక్తి ఎంత సంపాదించాడని చూడడు; ఎంత దానం చేశాడని చూస్తాడు. కాని కేవలం కర్మ చేసే వ్యక్తి లెక్కలు మాత్రమే చూస్తాడు.

**ఇమం మనోరథమ్ ప్రాప్స్యే** – ఇంకా ఇంత ఐశ్వర్యం భవిష్యత్తులో సంపాదిస్తానని అనుకుంటాడుట.

**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్** – ఇదం ధనమ్ అస్తి ఇదం ధనం భవిష్యతి. ఇప్పుడు ఇంత ఉంది, భవిష్యత్తులో ఇంకా ఇంత సంపాదిస్తాను అనుకుంటాడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే అతను కూడా ధ్యానం చేస్తాడు. కాని అతను ధ్యానం చేసే మూర్తి మారుతుంది. విష్ణుమూర్తిమీద ధ్యానం చెయ్యాలి; కనీసం నారాయణసమేత లక్ష్మీదేవిమీద ధ్యానం చెయ్యాలి; కాని అతనికంత తీరికలేదు. కాసులమీదే ధ్యానం చేస్తాడు.

శ్లో. 14 **అసౌ మయా హతః శత్రుః హనిష్యే చాపరానపి ।**
**ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ ॥**
అసౌ, మయా, హతః, శత్రుః, హనిష్యే, చ, అపరాన్, అపి,
ఈశ్వరః, అహమ్, అహమ్, భోగీ, సిద్ధః, అహమ్, బలవాన్, సుఖీ ॥

| | | | |
|---|---|---|---|
| అసౌ, శత్రుః | = ఈ శత్రువు | అహమ్, ఈశ్వరః | = నేనే సర్వాధిపతిని |
| మయా | = నాచేత | భోగీ | = సమస్త భోగములను అనుభవించువాడను |
| హతః | = చంపబడెను | | |
| చ | = ఇంకా | అహమ్, సిద్ధః | = నేను సర్వసిద్ధులు గలవాడను |
| అపరాన్, అపి | = ఇతర శత్రువులను గూడ | బలవాన్ | = నేను మిక్కిలి బలవంతుడను |
| అహమ్, హనిష్యే | = నేను వధింపగలను | సుఖీ | = సుఖాలు కలిగినవాడను |

**అసౌ శత్రుః మయా హతః, అపరాన్ చ అపి హనిష్యే, అహమ్ ఈశ్వరః,**
**అహం భోగీ, అహమ్ సిద్ధః బలవాన్ సుఖీ (చ అహమ్ అస్మి) ॥**

తా: ఈ శత్రువు నాచేత చంపబడెను మఱియు ఇతర శత్రువులను గూడ నేను వధింపగలను. నేనే సర్వాధిపతిని. సమస్త భోగములను అనుభవించువాడను, నేను సర్వసిద్ధులు గలవాడను, నేను మిక్కిలి బలవంతుడను, సుఖాలు కలిగినవాడను.

ఇంకా ఆసురీసంపత్తి ఉన్నవారి ఆలోచనాతీరు కొనసాగుతున్నది. ఎప్పుడైతే ధనదాహం ఉంటుందో, అప్పుడే అతను తక్కినవారిని తనకు పోటీదారులుగా చూస్తాడు. తనతో పోటీకి నిలిచేవారిని శత్రువులుగా, తన దారికి

ఆటంకం కలిగించేవారిగా భావిస్తాడు. అందువల్ల అతనికి శత్రువులు ఎక్కువవుతూ వస్తారు. వ్యాపారంలో శత్రుశేషం ఉండకూడదు అనుకుంటాడు. అందువల్ల ఆ శత్రువులను అడ్డదారులు తొక్కి అయినా కాలరాయటానికి వెనుకాడడు. అందువల్లనే పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలను కబళించి వేస్తాయి. అందువల్లనే వీటిని పోటీలు అనరు, యుద్ధాలు అంటారు. ఇటువంటి వాటిని కృష్ణపరమాత్మ ఆ యుగంలోనే ఊహించి చెబుతున్నాడు చూడండి.

**అసౌ మయా హతః శత్రుః** – ఈ శత్రువు నాచేత చంపబడ్డాడని లౌకికుడు అంటాడని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. చంపబడ్డాడు అంటే ఇతను తన పోటీదారుని నిజంగానూ చంపించి ఉండవచ్చు లేదా అతని వ్యాపారాన్ని దెబ్బతీసి, అతను మళ్ళీ పైకి లేవకుండా చేసీ ఉండవచ్చు.

**(శత్రుః) హనిష్యే చాపరానపి** – అంతేకాదు, తక్కిన శత్రువులను కూడా చంపగలను. అపరాన్ అపి అంటే తక్కిన శత్రువులను కూడా నేను కాలరాయగలను అంటాడుట. ఇటువంటి వ్యక్తికి మొదట్లో కొంచెం అపరాధభావన ఉంటుంది; తప్పు చేస్తున్నాననే భావన తొలిచివేస్తుంది; కాని రానురాను అంతరాత్మ నోరునొక్కి వేస్తాడు. తను చేస్తున్నది న్యాయమని ఎదురు సమర్థించుకుంటాడు కూడా. తన రంగంలో తనే ప్రథమశ్రేణిలో ఉండాలి, వేరే ఎవరూ తన దరిదాపుల్లో కూడా ఉండకూడదు.

**అహమ్ ఈశ్వరః** – నేనే ఈశ్వరుణ్ణి అని విర్రవీగుతాడు. జ్ఞాని కూడా నేను ఈశ్వరుణ్ణి అంటాడు కాని అది దీనికి పూర్తి భిన్నమైన ఆలోచన. జ్ఞాని జీవ–ఈశ్వర ఐక్యజ్ఞానం పొంది అంటాడు. ఇక్కడ ఈ అజ్ఞాని తనే ఈశ్వరుడు అంటే తనే ప్రభువు అనే గర్వం తలకెక్కి అనేమాట అది. నేనే చక్రవర్తిని అనే అహంకారం.

**అహం భోగీ** – నేనే ఈ ఐశ్వర్యాన్నంతా అనుభవిస్తాను.

**అహం సిద్ధః** – నేను గొప్ప శక్తివంతుణ్ణి అంటాడు. అంత శక్తి, అంత ఐశ్వర్యం ఎలా పొందాడనేది వేరే విషయం; ఎంతమంది శవాలమీద నడిచాడో, ఎంతమంది కన్నీటిగాథలు అతని విజయం వెనక ఉన్నాయో ఎవరికీ తెలియదు. ఇతరులకు కనిపించేది ఇతని విజయం మాత్రమే. అహం సిద్ధః అంటే నేను విజేతను అని అర్థం తీసుకోవాలి.

**బలవాన్** – నేను అత్యంత గొప్ప బలవంతుణ్ణి. నా తలమీద ఒక్క వెంట్రుకను కూడా ఎవరూ ముట్టుకోలేరు. నేను నా ఐశ్వర్యంతో అందరినీ కొనగలను, పోలీసులు నా చేతిలో ఉన్నారు; చట్టం నా అధీనంలో ఉంది; రాజకీయనాయకులకు నేనేమంటే అదే రాజాజ్ఞ. అందువల్ల నేను బలవంతుణ్ణి అంటాడు.

**సుఖీ** – నా అంత అదృష్టవంతుడు ఈ లోకంలో లేదు. నేను చాలా సుఖంగా ఉన్నాను అంటాడు.

శ్లో. 15 **ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా ।**

**యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః ॥**

ఆఢ్యః, అభిజనవాన్, అస్మి, కః, అన్యః, అస్తి, సదృశః, మయా,

యక్ష్యే, దాస్యామి, మోదిష్యే, ఇతి, అజ్ఞానవిమోహితాః ॥

| | | | |
|---|---|---|---|
| ఆఢ్యః, (అహమ్) | = నేను గొప్ప ధనవంతుడను | యక్ష్యే | = యజ్ఞములను చేయగలను |
| అభిజనవాన్, అస్మి | = గొప్ప పరివారముగలవాడను | దాస్యామి | = దానములను ఈయగలను |
| మయా, సదృశః | = నాతో సమానుడైనవాడు | మోదిష్యే | = యథేచ్ఛగా వినోదింపగలను |
| అన్యః | = మరియొకడు | ఇతి | = ఇట్లు అనేక విధములుగా |
| కః, అస్తి | = ఎవడు కలడు? | అజ్ఞానవిమోహితాః | = అజ్ఞానవిమోహితులై |

**ఆఢ్యః అభిజనవాన్ అస్మి, మయా సదృశః కః అన్యః అస్తి,**
**(అహం) యక్ష్యే, దాస్యామి, మోదిష్యే ఇతి అజ్ఞాన-విమోహితాః (తే సన్తి) ॥**

తా: నేను గొప్ప ధనవంతుడను, గొప్ప పరివారము గలవాడను, నాతో సమానుడైనవాడు మరియొకడు ఎవడు కలడు? యజ్ఞములను చేయగలను, దానములను ఈయగలను, యథేచ్ఛగా వినోదింపగలను. ఇట్లు అనేక విధములుగా అజ్ఞానవిమోహితులై,

ఇంకా ఆసురీసంపత్తి ఉన్నవారి ఆలోచనాతీరు కొనసాగుతున్నది.

**అహం ఆఢ్యః అస్మి** – నేను కోటీశ్వరుణ్ణి; నాపేరు, నా ఫోటో, ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఇరవైమంది అత్యంత ధనికులలో నేను ఒకణ్ణి. ఆ స్థాయికి ఎదగటానికి ఎన్ని మోసాలు, కుట్రలు చేశాడో భగవంతునికి మాత్రమే తెలుసు. అది వేరే విషయం. కాని అతను గొప్పవారిలో ఒకడు.

**అభిజనవాన్ (అస్మి)** – నేను ఉన్నతవంశానికి చెందినవాడినని గొప్పలు చెప్పుకుంటాడు. మా తాతగారు ఘనాపాఠి; మా చిన్నతాతగారు జటావల్లభులు; మా ముత్తాతగారు సోమయాజి అని గొప్పలు పోతాడు. నీకేం వచ్చు అంటే అతనికి గాయత్రీమంత్రం కూడా సరిగ్గా రాదు. 'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి,' అన్నట్టు ఉంటుంది వీరి వ్యవహారం. తన వంశప్రతిష్ఠ గురించి గొప్పలు పోతాడు కాని, ఆ వంశప్రతిష్ఠను నిలబెట్టటానికి అతనేం చేశాడంటే ఏమీ చెయ్యలేదు. డబ్బు వేటలో పడిపోయాడు.

**ఉత్ఖాతం నిధిశంకయా క్షితితలం ధ్మాతా గిరేర్ధాతవో**
**నిస్తీర్ణః సరితాం పతిర్నృపతయో యత్నేన సంతోషితాః।**
**మంత్రారాధనతత్పరేణ మనసా నీతాః శ్మశానే నిశాః**
**ప్రాప్తః కాణ వరాటకోఽపి న మయా తృష్ణే! సకామా భవ॥** – భర్తృహరి వైరాగ్య శతకం 3

మనిషి ధనంకోసం ఏ అక్రమాలు చేశాడో వెనక్కి తిరిగి ఆలోచించుకుంటే తెలుస్తుంది. అటువంటి ఒక విశ్లేషణను భర్తృహరి చూపిస్తున్నారు.

**ఉత్ఖాతం నిధిశంకయా క్షితితలం ధ్మాతా గిరేర్ధాతవో** – భూమినంతా బంగారం, వెండి, లోహపు నిధులు దొరుకుతాయన్న ఆశతో తవ్విపెట్టాను.

**నిస్తీర్ణః సరితాం పతిర్నృపతయో యత్నేన సంతోషితాః**– నేను దేవతలకు పూజలు చెయ్యలేదు; అహంకారంతో

నిండిన రాజకీయనాయకులకు, గొప్ప వ్యాపారవేత్తలకు ఒంగి ఒంగి నమస్కారాలు చేశాను, వారిచుట్టూ ప్రదక్షిణలు చేశాను; వారికి లెక్కలేనన్ని దక్షిణలు చెల్లించుకున్నాను; నా స్వార్థంకోసం వారిని హోటళ్ళకు తీసుకెళ్ళాను.

**మంత్రారాధనతత్పరేణ మనసా నీతాః శ్మశానే నిశాః**– ఈ నల్లధనం ఉన్నవారి చుట్టూ భజనలు చేస్తూ తిరగటంలో తినకూడనివి తిన్నాను; తాగకూడనివి తాగాను; చేయకూడని చెడుపనులన్నీ చేశాను.

**ప్రాప్తః కాణ వరాటకోఽపి న మయా తృష్ణే! సకామా భవ** – కనీసం నా జీవితచరమాంకంలో అయినా నేను కళ్ళు తెరిచాను. ఓ కామమా! నీ మోజులో పడి నేను సర్వం కోల్పోయాను; సాంప్రదాయాన్ని, సంస్కృతిని భ్రష్టు పట్టించాను అని వాపోతాడు ముసలివయస్సులో ఒకవ్యక్తి. భర్తృహరి వైరాగ్యశతకం చదివితే మనను ఛర్నాకోలుతో కొట్టినట్టే ఉంటుంది. అంత పదునుగా ఉంటుంది ఆయన కలం.

అభిజనవాన్ అస్మి అంటే నేను మంచికుటుంబానికి చెందినవాణ్ణి, కాని దాన్ని అతను సరిగ్గా వినియోగించుకోలేక పోతున్నాడు. ఐదు మ్యాచ్‌లు ఆడి గెలవాల్సిన క్రికెట్‌మ్యాచ్‌లో రెండు మ్యాచ్‌లు గెలిచి, ఇంకొక్క మ్యాచ్ గెలవకపోతే ఏమవుతుంది? కప్పు రాదు. మనిషిజన్మ ఎత్తామంటేనే రెండుమ్యాచ్‌లు గెలిచినట్టే. మరోమ్యాచ్ గెలవకపోతే, మోక్షమనే కప్పును కోల్పోతాము. కాని ఆ స్ఫురణ చాలామందికి రాదు.

**కోఽన్యోఽస్తి సదృశో మయా** – నాకు సమానంగా ఎవరున్నారో చెప్పండి చూద్దాం అంటాడు. అంటే, 'సరిలేరు నాకెవ్వరూ,' అనుకుంటాడు. మన సాంప్రదాయం వినయవిధేయతలకు పెట్టింది పేరు కాని ఇతను సాంప్రదాయాన్ని పాటించడు కాబట్టి అహంకారానికి పెట్టింది పేరుగా నిలుస్తాడు.

**యక్ష్యే** – అతను నిజానికి భగవంతుణ్ణి కాని, మతాన్ని కాని, శాస్త్రాన్ని కాని, పూజలను కాని నమ్మడని ముందే చూశాము. కాని కొన్ని యజ్ఞాలు చేస్తాడు; తను ఆధ్యాత్మికంగా ఎదగటంకోసం కాదు, ఆర్భాటం చెయ్యటం కోసం. అందువల్ల పెద్దపెట్టున యజ్ఞాలు చేస్తాడని వార్తాపత్రికల్లో తాటికాయంత అక్షరాలతో తన పేరు, తన ఫోటో పడేలాగా చూసుకుంటాడు. ఇంకా వీడియోలు కూడా తీయిస్తాడు. యక్ష్యే అంటే **యాగం కరిష్యే**, యాగాలు చేస్తాడు, పేరుకోసం.

**దాస్యామి** – దానాలు చేస్తాడు, అది కూడా దానకర్ణుడు అనే బిరుదులు పొందటానికి. తన పేరు నలుదిశలా మారుమ్రోగిపోవటానికి. ఏమీ దొరకకపోతే, ఆలయాల్లో ఇచ్చిన ట్యూబ్‌లైట్లమీద తన పేరు వేయించి మరీ దానం చేస్తాడు. అలా దానం కూడా పేరుకోసమే చేస్తాడు.

**మోదిష్యే** – నాకు సన్మానాలపైన సన్మానాలు జరుగుతాయి. ధనం కావాల్సినవారు, ఇతని బలహీనతను చూసి ఇతన్ని అనేకరకాలుగా పొగిడి, సభలు, సన్మానాలు జరుపుతారు. అవి ఇతని అహంకారాన్ని మరింత పెంచి పోషిస్తాయి. అహంకారం ఎంత ఎక్కువయితే, అంత అధికంగా ఉంటుంది అతని ఆధ్యాత్మిక పతనం కూడా. ఎంత ఎక్కువగా అహంకారంమీద మక్కువ చూపితే, అంత తక్కువగా ఆధ్యాత్మిక చింతన ఉంటుంది.

**ఇతి** – ఇంతవరకూ ఆసురీసంపత్తి ఉన్నవారు అన్నమాటలు వచ్చాయి. ఇవి పదమూడవ శ్లోకంలో 'ఇదమద్య మయా లబ్ధమ్...' తో మొదలయి, ఇక్కడ పదిహేనవ శ్లోకంలో ఇతితో ముగిసింది. ఇకమీదట కృష్ణపరమాత్మ వారిని విమర్శిస్తున్నాడు.

**విమోహితాః** – ఇటువంటివారు పూర్తిగా మోహంలో పడిపోతున్నారు. వారికి మంచేదో వారికి తెలియటం లేదు. నిజానికి ఆధ్యాత్మికంగా వారి గొయ్యిని వారే తవ్వుకుంటున్నారు. వారికి మంచీ, చెడు విచక్షణ లేదు. భగవంతునికి వారిమీద చాలా కోపంగానూ ఉంది, జాలిగానూ ఉంది. వారు ఇటువంటి వలలో పడిపోకుండా భగవంతుడు వారికి ఎన్నో మంచి మార్గాలను ఏర్పాటుచేశాడు. మహాత్ములను ఏర్పాటు చేశాడు; శాస్త్రాన్ని అందించాడు. కాని ఏం ప్రయోజనం? వారి గర్వం, వారి పొగరు, వారు మహాత్ముల దగ్గరకు వెళ్ళకుండా చేస్తుంది; గీతలోని కొన్ని శ్లోకాలనైనా చదవకుండా చేస్తుంది. కృష్ణపరమాత్మ అంటున్నాడు, వారికి మందు ఉంది కాని వారు దాన్ని వేసుకోవటం లేదు. భగవంతుడు బలవంతంగా వారి నోట్లో కుక్కలేడు కదా! వారికి తెలివితేటలను ఇచ్చింది ఎందుకు? దాన్ని సద్వినియోగం చేసుకోవటానికి.

**అజ్ఞాన (విమోహితాః)** – వారు అజ్ఞానంవల్ల మోహంలో పడిపోతున్నారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మనం చాలాసార్లు చూశాము. అజ్ఞానం ఉండటం పాపంకాదు. ఎందుకంటే మనమందరం అజ్ఞానంతో పుట్టాము. నిజానికి అది మన పెట్టుబడి. మనమందరం పుట్టుకతో సమానంగా తెచ్చుకున్న ఆస్తి ఏదైనా ఉంటే అది అజ్ఞానమే. కాని ఆ అజ్ఞానాన్ని పెంచి పోషించటమే పెద్ద పాపం. ఎందుకంటే ఆ అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి కృష్ణపరమాత్మ మనకు అనేక మార్గాలను ఏర్పరచాడు; శాస్త్రప్రమాణాన్ని ఏర్పాటుచేశాడు; కాని ఇటువంటి మనుష్యులు దాని జోలికే పోరు. ఇంతకుముందు చూసినట్టుగా ముండకోపనిషత్తు ఇటువంటి వారిని **మూఢాః** అని విమర్శిస్తుంది. వారికి తెలియదు సరికదా, వారే పండితులని తమకు తామే నిర్ణయించేసుకుంటారు. అందువల్ల ఇటువంటి అజ్ఞానంలో పడిపోతారు.

శ్లో. 16 **అనేకచిత్తవిభ్రాంతాః మోహజాలసమావృతాః ।**
**ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽ శుచౌ ॥**
అనేకచిత్తవిభ్రాంతాః, మోహజాలసమావృతాః,
ప్రసక్తాః, కామభోగేషు, పతంతి, నరకే, అశుచౌ ॥

| | | |
|---|---|---|
| అనేక చిత్తవిభ్రాంతా | = | అనేకవిధాల చిత్తభ్రమణములకు లోనై |
| మోహజాలసమావృతాః | = | మోహజాలమున చిక్కుకొన్నవారై |
| కామభోగేషు | = | విషయభోగములందు |
| ప్రసక్తాః | = | మిక్కిలి ఆసక్తులై ఈ ఆసురీసంపద గలవారు |
| అశుచౌ, నరకే | = | ఘోరనరకములందు |
| పతంతి | = | పడుచుందురు |

**అనేక-చిత్త-విభ్రాన్తాః మోహ-జాల-సమావృతాః కామ-భోగేషు**
**ప్రసక్తాః, అశుచౌ నరకే పతన్తి ॥**

తా: అనేకవిధాల చిత్తభ్రమణములకు లోనై మోహజాలమున చిక్కుకొన్నవారై, విషయభోగములందు మిక్కిలి ఆసక్తులై ఈ ఆసురీసంపద గలవారు ఘోరనరకములందు పడుచుందురు.

**అనేక చిత్తవిభ్రాంతాః** – ఇటువంటి ఆలోచనలలో పడి కొట్టుకుపోతారు. చిత్తం అంటే ఆలోచనా విధానం. అనేక అంటే ఎన్నో. అలా అనేక ఆలోచనలలో కొట్టుకుపోతారు. ఏమిటా ఆలోచనలు? 13-15 శ్లోకాల్లో చూసిన తీరుతెన్నులు.

'నీ చరణకమలాల నేనున్న చాలు.' నీ పాదాల చెంత అరనిముషం ఉన్నా చాలు అని పాట ఉంది. అరనిముషం కూడా దేవుని పాదాల చెంత ఉండే తీరికలేదు వారికి. విభ్రాంతా అంటే ఆ ఆలోచనలలో కొట్టుకుపోయి,

**మోహజాలసమావృతాః** – మోహమనే వలలో చిక్కుకుపోతారు. మోహం అంటే మోజు, పొరపాటు. ధనమే అన్నిటికీ మూలం అనుకునే పొరపాటు. అదే అంతిమలక్ష్యం, అది నాకు కొండమీది కోతినైనా తెచ్చిపెడుతుందనే మిడిసిపాటు పడతారు. కాని ధనం అన్నీ ఇవ్వలేదని వారికి తెలియదు. ధనంతో ఇంటిని కొనగలరు కాని, గృహాన్ని కొనలేరు; ధనంతో మంచాన్ని కొనగలరు కాని, నిద్రను కొనలేరు; ధనంతో మనుష్యులను కొనగలరు కాని, ప్రేమను కొనలేరు; ధనంతో వస్తువులను కొనగలరు కాని, శాంతిని కొనలేరు. కాని ఈ పచ్చినిజాలు వారికి ఇప్పుడు కొరుకుడు పడవు. వారు మోహంలో ఉన్నారు.

**ప్రసక్తాః కామభోగేషు** – ప్రాపంచిక సుఖాలకు విలువను ఇచ్చే సమాజం తమకు ఉన్న వనరులను, అంతకంతకూ సుఖాలను పెంచి, ఆనందంలో ఓలలాడేటందుకే ఉపయోగిస్తుంది. వారి ప్రయోగాలన్నీ జీవితాన్ని మరింత సుఖమయంగా చెయ్యటానికి, మరిన్ని ఇంద్రియవిషయవస్తువులను సమకూర్చటానికే సరిపోతాయి. అలా జరిగితేనే దేశం పురోగమించింది అనుకుంటారు వారు.

అదే మనదేశంలో ఎలా ఉంటుందో చూడండి. మనదేశంలో ఏ రంగంలో ప్రగతి సాధించినా కూడా, మొట్టమొదట దాన్ని ఆధ్యాత్మిక రంగానికి ఉపయోగిస్తారు. కలర్ టీవీ రాగానే రామాయణ, మహాభారతాలు టీవీ సీరియల్సుగా వచ్చాయి. అనేక స్వామీజీలు టీవీల్లో కనబడి, వారి ప్రసంగాలను మరింత జనబాహుళ్యానికి అందించటానికి తోడ్పడింది. అలా ప్రతి సదుపాయాన్ని ఆధ్యాత్మికతకు ఉపయోగిస్తాము. కాని ప్రసక్తాః అంటే ఆనందాలు వెతుక్కునేవారు. కామభోగేషు అంటే ఇంద్రియవిషయవస్తువుల వెంట పడతారు. కామ అంటే విషయవస్తువులు, భోగేషు అంటే సరదా. ప్రసక్తాః కామభోగేషు అంటే విషయవస్తువులమీద సరదా పడి వాటి వెంట పడుతున్నారు.

మెడికల్ సైన్సు అభివృద్ధి చెందితే దాన్ని కూడా శరీరాన్ని మెరుగులు దిద్దటానికే ఉపయోగిస్తున్నారు. వయస్సు మీద పడుతున్నా ఇంకా ఇంకా చిన్నగా కనబడటానికి తాపత్రయపడుతున్నారు. పోనీ దానివల్ల ఆధ్యాత్మిక సాధన చెయ్యటానికా అంటే అదీ కాదు. 90 ఏళ్ళు వచ్చినా, ఇంకా చిన్నగా కనబడటం ఎలా అనేది తపనగా మారింది. అటువంటి వారి పరిస్థితి ఏమిటి?

**నరకే పతంతి** – నరకంలో పడతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. జంతువులకు రెండే పురుషార్థాలు ఉంటాయి. అవి అర్థకామాలు. జంతువులు భద్రతకోసం పని చేస్తాయి; ఆనందంకోసం పాకులాడతాయి; జంతువులకు

ధర్మం అంటే ఏమిటో తెలియదు; మోక్షం అంటే ఏమిటో తెలియదు. వాటికి వేదపూర్వభాగం అవసరం లేదు, వేద అంతఃభాగమూ అవసరం లేదు. ఒక దున్నపోతు ముందు నిల్చుని సత్యం వద, ధర్మం చర, స్వాధ్యాయ ప్రవచనే చ అని పలికితే దానికేమీ అర్థంకాదు. ఒక రంకె వేస్తుంది మనమీద.

అందువల్ల మనిషిగా పుట్టినవారు, నేను నా జీవితాన్నంతా అర్థకామాలకే అంకితం చేస్తాను అంటే భగవంతునికి వారు, 'నేను నా జీవితాన్ని జంతువుగానే గడుపుతాను,' అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. భగవంతుడు తన డైరీలో అటువంటి వారి గురించి రాసుకుంటాడు. ఏమని? 'ఈ జీవికి నేను మానవజన్మనిచ్చి పెద్ద పొరపాటు చేశాను. ఆ పొరపాటును నేను ఈసారి సరిదిద్దుకుంటాను.' ఎలా సరిదిద్దుకుంటాడు? జంతుజన్మనిస్తాడు. అప్పుడు అతనికే ఇంకా సుఖం. వేదం నేర్చుకోనవసరం లేదు, ధర్మశాస్త్రం జోలికి పోనవసరం లేదు. ప్రార్థన చెయ్యనవసరం లేదు. సత్యం వద, ధర్మం చరవంటి నీతిసూత్రాలను వల్లెవేయనవసరం లేదు. అన్నింటినీ మించి ఇలాంటివేవీ నేర్చుకోలేదనే అపరాధభావన కాని, పశ్చాత్తాపం కాని ఉండదు. హాయిగా జీవితం గడిపేయవచ్చు. ఇటువంటి జంతుజన్మ పొందటాన్ని నరకం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అశుచౌ (నరకే)** – ఆధ్యాత్మికంగా తక్కువస్థాయి జన్మను నరకం అంటున్నాడు. అటువంటి హీనజాతిలో పుడతారు.

శ్లో. 17 **ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః ।**
**యజంతే నామయజ్ఞైస్తే దంభేనావిధిపూర్వకమ్ ॥**

ఆత్మసంభావితాః, స్తబ్ధాః, ధనమానమదాన్వితాః,
యజంతే, నామయజ్ఞైః, తే, దంభేన, అవిధిపూర్వకమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తే | = ఆ అసుర లక్షణములుగలవారు | అవిధిపూర్వకమ్ | = శాస్త్రవిరుద్ధముగా |
| ఆత్మసంభావితాః | = తమకు తామే గొప్పవారమని తలంచుకొనుచుందురు | నామయజ్ఞైః | = పేరుకు మాత్రమే |
| | | దంభేన | = ఆడంబరముతో |
| స్తబ్ధాః | = స్తబ్ధులై | యజంతే | = యజ్ఞములను ఆచరింతురు |
| ధనమానమదాన్వితాః | = సంపదలచే, దురభిమానముచే మదోన్మత్తులై విఱ్ఱవీగువారు | | |

**ఆత్మ–సమ్భావితాః స్తబ్ధాః ధన–మాన–మద–అన్వితాః, తే దమ్భేన**
**అవిధి–పూర్వకమ్ నామ–యజ్ఞైః యజన్తే ॥**

తా: ఆ అసుర లక్షణములు గలవారు తమకు తామే గొప్పవారమని తలంచుకొనుచుందురు. స్తబ్ధులై, సంపదలచే, దురభిమానముచే మదోన్మత్తులై విఱ్ఱవీగువారు శాస్త్రవిరుద్ధముగా పేరుకు మాత్రమే ఆడంబరముతో యజ్ఞములను ఆచరింతురు.

మన ధర్మశాస్త్రం ధార్మిక జీవనవిధానాన్ని సూచిస్తూ, అందులో అన్ని స్థాయిల్లోనూ సమతుల్యతను పాటించమంటుంది. ముందుగా అంతర్గత సమతుల్యత పాటించాలి. అంటే త్రికరణశుద్ధిగా ఉండాలి. మనస్సు

ఏది ఆలోచిస్తే, వాక్కు అది పలకాలి; వాక్కు ఏది పలికితే కర్మ అదే చెయ్యాలి. మనోవాక్కాయకర్మలు ఒక్క త్రాటిమీద నడవాలి అంటారు. అంతేకాదు, ఆహారం అతిగా తీసుకోకూడదు, నిద్ర కూడా అతిగా పోకూడదు.

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥** – 6.17

శరీరంలో అన్నిభాగాల మధ్య సమతుల్యత ఉండాలి. ఇది శరీరపరంగా! ఇదే సమతుల్యత కుటుంబసభ్యుల మధ్య కూడా ఉండాలి. ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య ఆప్యాయత, అనురాగం ఉండాలి. అప్పుడే అది పండంటి కాపురం అవుతుంది. మీ ఇంట్లో మీ అనుబంధాలు పటిష్ఠంగా ఉండాలి.

ఇంట్లో ఒక కిటికీ తీసినప్పుడల్లా చప్పుడు చేస్తుందనుకోండి. ఏం చేస్తారు అప్పుడు? దానికి కొంచెం నూనె రాస్తారు. అప్పుడు ఆ చప్పుడు ఆగుతుంది. అలాగే మానవ అనుబంధాలు పటిష్ఠంగా లేకపోతే ఏమవుతుంది? ఇలాంటి చప్పుళ్ళు వినిపిస్తాయి. అంటే ప్రతి చిన్నదానికీ అరుపులూ, కేకలూ వినిపిస్తూ ఉంటాయి.

ఇదే సమతుల్యతను సమాజంలో కూడా పాటించాలి. అందువల్ల మన సాంప్రదాయం విధించిన కట్టుబాట్లను, సంస్కృతిని, నియమాలను, మర్యాదలను, మంచితనాన్ని పాటించాలి. ఇవన్నీ ధర్మసూత్రాల్లోకి వస్తాయి. ధర్మం అంటే కేవలం మతఃపరమైన కార్యక్రమాలు మాత్రమే కాదు, సమాజంలో పాటించాల్సిన నియమాలు, సంస్కృతి, సాంప్రదాయం. ఏ దేశానికి సంబంధించిన కట్టుబాట్లు ఆ దేశానికి ఉంటాయి. అవి ఆ దేశపు నాగరికతను సూచిస్తాయి.

ఈ రోజుల్లో బాడీలాంగ్వేజ్ ప్రధానపాత్ర వహిస్తున్నది. మీరు నిలుచునే తీరు, కూర్చునే తీరు, మాట్లాడే తీరు, తినే తీరు – అన్నీ మీ మర్యాదను సూచిస్తాయి. పూర్వం ఈ బాడీలాంగ్వేజ్ పదాన్ని వాడకపోయినా, అవన్నీ జాగ్రత్తగా పాటించేవారు. ఇంటికి ఎవరైనా మహాత్ములు వస్తే పిల్లలకు వంద జాగ్రత్తలు చెప్పేవారు. కుదురుగా కూర్చో, కాళ్ళు ఆడించకు, చేతులు కట్టుకో, పొగరుగా కనపడకు – ఇలా ఎన్నో సూచనలు ఇచ్చేవారు. ఎందుకంటే మన ప్రవర్తనలోనే మనం ఎదుటివారికి ఇచ్చే గౌరవం, ప్రేమ కనిపిస్తాయి.

అదే విధంగా భాష బాగుండాలి. మాటలు వినసొంపుగా ఉండాలి. కాని కొందరు, నలుగురిలో ఉన్నప్పుడు మొత్తం సంభాషణంతా ఒక్కరే నడుపుతుంటారు. ఎవరైనా మధ్యలో దూరటానికి ప్రయత్నించినా, వారి ప్రయత్నాన్ని ఫలించనివ్వరు. కొంతమంది వారి మాట ఆమడదూరం వినబడేలా గట్టిగా, కంచుకంఠంతో మాట్లాడతారు. అదీ తప్పే. మరికొంతమంది అందరిముందూ ఒకరిని అవమానం చేస్తూ లేదా హేళన చేస్తూ మాట్లాడతారు. లేదా అతని తప్పును నలుగురి ముందూ ఎత్తి చూపుతారు. అదీ తప్పే.

లౌకికంగా అనేక విజయాలు పొంది, గబగబా నిచ్చెనమెట్లు ఎక్కి పైకి వచ్చిన వ్యక్తిలో వద్దనుకున్నా గర్వం, దర్పం, అధికారం కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. దానివల్ల అతను ఇతరుల గురించి పట్టించుకోవటం తగ్గించేస్తాడు. తన ప్రవర్తనవల్ల ఇతరులు బాధపడుతున్నారేమోననే ఆలోచనే ఉండదు. ఎందుకంటే అతనిలో సున్నితత్త్వం మటుమాయమైపోతుంది. ఎంతసేపూ నా నీటు, నా గోటు అనుకుంటాడు. అందువల్ల అతని మాటలో, అతని

ప్రవర్తనలో, అతని నడవడికలో ఆ దర్పం, అహంభావం కనబడుతుంది. అగ్నికి ఆజ్యం తోడయినట్టు అటువంటి అహంభావుల చుట్టూ, బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టుగా, అతనికి భజన చేసేవారు కొందరు అతని చుట్టూ మూగుతారు.

**యస్యాస్తి విత్తం స నరః కులీనః, స పండితః స శ్రుతవాన్ గుణజ్ఞః।**
**స ఏవ వక్తా స చ దర్శనీయః, సర్వే గుణాః కాంచనమాశ్రయంతే।।**

ఇది చాలా ప్రసిద్ధి చెందిన శ్లోకం. ఎక్కడ ఐశ్వర్యం, హోదా ఉంటుందో, అక్కడ అతనిచుట్టూ అతన్ని పొగిడేవారు చేరుతారు. వారు 'నువ్వు అందరిలోకి గొప్పవాడివి, గొప్ప పండితుడివి; నువ్వు విద్యలో ఆరితేరావు,' అని అతన్ని ఆకాశానికి ఎత్తేస్తారు. అసలే కళ్ళు నెత్తికెక్కినవారికి, ఈ పొగడ్తలతో ఇంక కన్నూ మిన్నూ కానరాదు. ముందుగా మటుమాయమయ్యేది వినయం; దాని తర్వాత దైవభక్తి. అహంకారం, ఈశ్వరభక్తి ఒకచోట ఉండలేవు.

రాక్షసుల కథలు వింటే– కంసుడు అవనీ, హిరణ్యకశిపుడు అవనీ, హిరణ్యాక్షుడు అవనీ– వారికి భక్తి ఏ కోశానా లేదు. హిరణ్యకశిపుడు హరినామస్మరణ ఎవరు చేసినా మండిపడేవాడు. ఎప్పుడైతే ఇలా రాక్షసంగా ప్రవర్తిస్తారో, అలాంటివారి దరిదాపుల్లోకి కూడా మహాత్ములు వెళ్ళరు. దానితో వారికి మంచీ చెడూ వివరించి చెప్పే నాథుడు కూడా కరువవుతాడు.

**పాపాన్ నివారయతి యోజయతే హితాయ**
**గుహ్యం నిగూహతి గుణాన్ చ ప్రకటీకరోతి**
**ఆపద్గతం న చ జహాతి దదాతి కాలే**
**సన్మిత్ర లక్షణమ్ ఇదం ప్రవదంతి సంతః** – భర్తృహరి

మంచివారు మీకు స్నేహితులైతే వారు మీకు నాలుగు మంచిమాటలు చెబుతారు. కాని ఆసురీసంపత్తి ఉన్నవారి చుట్టూ ఉండేది కాకారాయుళ్ళు మాత్రమే. వారు ఇటువంటి వారిని మాటల్లో, సంస్కారంలో, మర్యాదలో అంతకంతకూ దిగజారిపోయేలా చేస్తారు. కృష్ణపరమాత్మ సభలోకి వచ్చినప్పుడు కంసుడు కనీసం లేచి నిల్చోలేదు. అదీ అహంకారంయొక్క పొగరు.

**అహంకారమ్** – ఎవరు, వారికి నమస్కారం పెట్టినా వారి అహంకారం పెరిగిపోవచ్చు. అందువల్ల కొందరు మహాత్ములు అసలు నమస్కారం పెట్టించుకోరు. ఒకవేళ పెట్టించుకున్నా ఆ నమస్కారం తమ గురువుకు చెందుతుంది అంటారు. ఆ గురువు తన గురువుకు అందిస్తాడు. చివరికి ఆ నమస్కారాలన్నీ జగద్గురువు అయిన భగవంతునికే చెందుతాయి. అందువల్ల నమస్కారం పెట్టించుకుంటే అహంకారం వస్తుంది.

**బలమ్** – అది శారీరకబలం కాదు; పదవి ఇచ్చిన బలం.

**దర్పమ్** – పొగరు.

**కామమ్** – కోరిక, లౌకిక కోరికలు.

**క్రోధమ్** – కోపం. ఐశ్వర్యం, హోదా వారికిచ్చిన అహంకారంతో వారి మాటే చెల్లుబాటు అవాలనుకుంటారు. అది కుదరకపోతే కోపం వస్తుంది. (ఈ పదాలన్నీ తర్వాత వచ్చే శ్లోకంలో వస్తాయి. వాటిని ఇక్కడ చూశాము)

**ఆత్మసంభావితాః** – ధనం, హోదా ఇచ్చిన దర్పంతో నన్ను ఎవరూ విమర్శించలేరు; నన్ను ఎవరూ తప్పు పట్టలేరు అనుకుంటారు. ఎక్కడున్నా వారిదే పైచెయ్యి అంటారు. నలుగురిలో ఉన్నప్పుడు ఇతరులను మాట్లాడనివ్వరు. వారే మొత్తం చక్రం తిప్పుతారు. పోనీ ఏమైనా నాలుగు మంచిమాటలు చెబుతారా అంటే అదీ ఉండదు. ఎంతసేపూ స్వోత్కర్షే ఉంటుంది. ఎంతసేపూ ఆత్మస్తుతే ఉంటుంది, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ. నలుగురికీ వారి గొప్పలు చాటిచెప్పుకోవాలి.

**స్తబ్ధాః** – వారి శరీరం నిటారుగా, స్తంభంలాగా ఉంటుంది. ఎవరికీ తలవంచరు; ఎవరికీ నమస్కారం చెయ్యరు. మెడనొప్పి ఉన్నవారు వంగి నమస్కారం చెయ్యలేరు; వీరి మెడనొప్పి అహంకారం. వీరు కూడా వంగి నమస్కారం చెయ్యలేరు, ఆఖరికి భగవంతునికి కూడా. అందువల్ల స్తబ్ధాః అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ధనమానమదాన్వితాః** – అతనికి ధనం ఉండటంవల్ల మదం, మానం మెండుగా ఉంటాయి. మదం అంటే అహంకారం; మానం అంటే గర్వం. మదానికీ, మానానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. మానం ఆలోచనా స్థాయిలో పొగరు; నేను గొప్పవాడినని గర్వపడటం. మదం అంటే మాటల్లో, చేతల్లో ఆ గర్వాన్ని ప్రదర్శించటం. రెండు బలహీనతలు కూడా ధనం ఉండటంవల్లనే.

**యజంతే నామయజ్ఞైస్తే** – పూజలు చేస్తారు కాని అది అణకువతో చేసే పూజ కాదు. నేను ఇన్ని పూజలు చేశానని గొప్పలు పోవటానికి చేస్తారు. నామయజ్ఞైః అంటే నామ్ కే వాస్తే అంటారు హిందీలో. అంటే ఏదో చెయ్యాలని చెయ్యటమే తప్ప శ్రద్ధపెట్టి చెయ్యరు. అది కూడా ఆర్భాటంగా చేస్తారు. అసలు ఏదైనా పూజ చెయ్యాలంటే దానిలో ముఖ్యమైన భాగం మంత్రభాగం, ఆచరణ చేసే విధానం. కాని ఇటువంటి వ్యక్తి పూజకు గానీ, బ్రాహ్మణునికి కాని పూర్తి ప్రాముఖ్యతను ఇవ్వడు.

ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు అలా ఆర్భాటంగా సాగుతున్నాయి. పెళ్ళిమంత్రాలకు విలువనివ్వటం లేదు. ముఖ్యంగా మాంగళ్యధారణ చేసేటప్పుడు పలికే మంత్రాలు చాలా ముఖ్యమైనవి. కాని తీరా పెళ్ళికొడుకు మంగళసూత్రం కట్టబోయే సమయానికి వీడియోగ్రాఫర్ వచ్చి ఆగండి అంటాడు. అసలే వివాహబంధాలు పదికాలాలపాటు నిలవటం కష్టంగా ఉన్న ఈ రోజుల్లో ముహూర్తబలానికి విలువనివ్వకపోవటం చాలా తప్పు. పెళ్ళిలో వేదమంత్రాలకు, వాటి ఆచరణకు విలువను ఇవ్వాలి. కాని ఫోటోలు, వీడియోలు వాటికన్నా ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి.

**దంభేన (యజ్ఞేన)** – అందువల్ల కృష్ణపరమాత్మ దంభేన యజ్ఞేన అంటున్నాడు. అంటే వారు చేసే యజ్ఞాల్లో ఆర్భాటం, హడావుడే ఎక్కువ కనిపిస్తోంది. అంతేకాదు,

**అవిధిపూర్వకమ్** – మంత్రాలకు, నియమాలకు విలువను ఇవ్వటం లేదు. పెళ్ళి అయ్యాక భార్యాభర్తలు ధృవనక్షత్రాన్ని, అరుంధతీ నక్షత్రాన్ని చూడాలి. ఎందుకు? వారి బంధం పదికాలాలు దృఢంగా నిలబడటానికి. ధృవుడు చాలా

శక్తివంతుడు, విశ్వాసానికి పెట్టింది పేరు; అలాగే అరుంధతీ–వసిష్ఠుల బంధం భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అన్యోన్యతకు చిహ్నం. ఈ నక్షత్రాలను చూడటంవల్ల ఈ జంట కూడా అంత అన్యోన్యంగా ఉండాలని శాస్త్రం నిర్దేశించింది. కాని ఇప్పుడు పట్టపగలు ముహూర్తాలు పెడుతున్నారు. మిట్టమధ్యాహ్నం తీసుకువెళ్ళి అరంధతీ నక్షత్రాన్ని చూపించే క్రతువును యధాలాపంగా ముగించేస్తున్నారు. అదే అవిధి పూర్వకం అంటే.

పోనీ అప్పుడైనా పెళ్ళికొడుకు శ్రద్ధగా చేస్తాడా అంటే అదీలేదు; పెళ్ళి చూడటానికి వచ్చిన అతిథులు షేక్‌హ్యాండులిచ్చి, బహుమతులు ఇచ్చి వెళుతుంటారు. పురోహితుడే దూ దూ మంత్రాలు చదివేస్తాడు అమ్మాయి చెయ్యి పట్టుకుని. ఆ మంత్రం అర్ధమేమిటి? 'ఓ భార్యామణీ నువ్వు నాతో అన్యోన్యంగా ఉండాలి.' ఆ మాట అమ్మాయి చెయ్యిపట్టుకుని పురోహితుడు చెబితే, అమ్మాయి అన్యోన్యంగా ఉండాల్సింది పురోహితునితోనా? అందువల్లనే పెళ్ళయ్యాక భర్తతో పోట్లాడుతుంది. ఆ విధంగా చేసే యజ్ఞాలు అవిధిపూర్వకంగా చేస్తారు; అంటే నియమ నిబంధనలను పాటించరు.

శ్లో. 18 **అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।**
**మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః ॥**
అహంకారమ్, బలమ్, దర్పమ్, కామమ్, క్రోధమ్, చ, సంశ్రితాః,
మామ్, ఆత్మపరదేహేషు, ప్రద్విషంతః, అభ్యసూయకాః ॥

అహంకారమ్ = అహంకారము
బలమ్ = బలము
దర్పమ్ = గర్వము
కామమ్ = కామము
క్రోధమ్ = క్రోధము మొదలగువాటిని
సంశ్రితాః, చ = ఆశ్రయించినవారై
అభ్యసూయకాః = అసూయతో ఇతరులను నిందించువారై
ఆత్మపరదేహేషు = తమ శరీరములందును, ఇతరుల శరీరములందును
మామ్ = అంతర్యామిగానున్న నన్ను
ప్రద్విషంతః = ద్వేషించుచుందురు

**అహంకారమ్ బలమ్ దర్పమ్ కామమ్ క్రోధమ్ చ సంశ్రితాః**
**ఆత్మ–పర–దేహేషు (స్థితం) మామ్ ప్రద్విషన్తః అభ్యసూయకాః (తే భవన్తి) ॥**

తా: అహంకారము, బలము, గర్వము, కామము, క్రోధము మొదలగువాటిని ఆశ్రయించినవారై, అసూయతో ఇతరులను నిందించువారై, తమ శరీరములందును, ఇతరుల శరీరములందును అంతర్యామిగానున్న నన్ను ద్వేషించుచుందురు.

ఇంతకుముందే చూసినట్టుగా ఇటువంటి ఆసురీసంపత్తి ఉన్నవ్యక్తిని సరిదిద్దేవారు ఎవరూ ఉండరు.

**అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః** – దానివల్ల అతనిలో గర్వం, పదవి ఇచ్చిన బలం, పొగరు, కోరిక, కోపం రాజ్యమేలుతాయి. (ఈ పదాలను ముందు శ్లోకంలో చూశాము). క్రమంగా ఈ లక్షణాలు అతన్ని నాస్తికునిగా మారుస్తాయి. అహంకారం, భక్తి ఒకచోట ఉండలేవని చూశాము.

హిరణ్యకశిపుడు 'ఓం నమో నారాయణాయ' అనకూడదు, 'ఓం నమో హిరణ్యాయ నమః' అనాలని చాటింపు వేశాడు.

**మాం ప్రద్విషంతః** – వారు నన్ను ద్వేషించటం మొదలుపెడతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎక్కడ ఉన్నాడు కృష్ణపరమాత్మ?

**ఆత్మపరదేహేషు** – నేను అతనితో సహా, అందరిలోనూ ఉన్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మదేహే అంటే అతని శరీరంలో; పరదేహే అంటే ఇతరుల శరీరంలో ఉన్నాను. అందరిలో చైతన్యస్వరూపంగా ఉన్నాను. కాని అటువంటి నన్ను – ప్రద్విషంతి – అతను ద్వేషిస్తున్నాడు. అటువంటి వ్యక్తి భగవంతుణ్ణి మాత్రమే కాదు, శాస్త్రాన్ని కూడా ద్వేషిస్తాడు. సాక్షాత్తూ భగవంతుడే ఇచ్చిన శాస్త్రంమీద కూడా అతనికి శ్రద్ధ లేదు.

**అభ్యసూయకాః** – శాస్త్రాన్ని కూడా విమర్శిస్తున్నాడు. ఇలా విమర్శించి, ద్వేషించేవారిని అభ్యసూయకాః అంటారు.

శ్లో. 19 **తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్ ।**
**క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు ॥**
తాన్, అహమ్, ద్విషతః, క్రూరాన్, సంసారేషు, నరాధమాన్,
క్షిపామి, అజస్రమ్, అశుభాన్, ఆసురీషు, ఏవ, యోనిషు ॥

| | | | |
|---|---|---|---|
| తాన్, ద్విషతః | = ద్వేషించువారైన | సంసారేషు | = ఈ సంసారములందు |
| అశుభాన్ | = పాపాత్ములను | అజస్రమ్ | = మాటిమాటికిని |
| క్రూరాన్ | = క్రూరులైన | ఆసురీషు, యోనిషు, | = ఆసురీ యోనులందే |
| నరాధమాన్ అహమ్ | = నరాధములను నేను | ఏవ క్షిపామి | పడవేయుదును |

**తాన్ ద్విషతః క్రూరాన్, అశుభాన్, నరాధమాన్ సంసారేషు**
**ఆసురీషు ఏవ యోనిషు అజస్రమ్ అహమ్ క్షిపామి ॥**

తా: ద్వేషించువారైన పాపాత్ములను, క్రూరులైన నరాధములను నేను ఈ సంసారములందు మాటిమాటికిని ఆసురీ యోనులందే పడవేయుదును.

ఆధ్యాత్మిక చింతన ఉన్న ఇంటికీ, లౌకికభావన ఉన్న ఇంటికీ మధ్య భేదం ఆ యింటి వాతావరణంలోనే తెలిసిపోతుంది. ఆధ్యాత్మిక చింతన ఉన్న ఇంట్లోకి అడుగుపెడితేనే భగవంతుని ఉనికి తెలుస్తుంది అక్కడ. పూజగదినుంచి పూలపరిమళాలు, అగరొత్తుల సువాసనలు, ప్రసాదాల గుభాళింపులు ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతేకాకుండా భగవంతుని చిత్రపటాలు కూడా అక్కడక్కడా కనిపిస్తాయి. కాని లౌకిక జీవనవిధానికే అంకితమైన వారింట్లో పూజగదే ఉండదు; వారు ఏ మతానికి చెందినవారో కూడా తెలియదు; ఉన్న పటాలు కూడా భగవంతునివి కావు. ఆ విధంగా వారి జీవితంలో ఆధ్యాత్మికతకు చోటులేదు.

**ద్విషతః** – వారు అన్నింటినీ ద్వేషిస్తారు. ఇప్పుడు మనదేశంలో కూడా పాశ్చాత్యదేశ ప్రభావం పెచ్చుపెరిగి పోవటంతో నుదుట తిలకం దిద్దుకోవటం కూడా నామోషీ అయిపోయింది. నేను హిందువునని చెప్పుకోవటం నామర్దా. తక్కిన మతాలవారికి ఆ నామర్దా లేదు. సిక్కుమతస్థులు సైన్యంలో ఉన్నా, వారు, వారి తలపాగాను

తీయమని ప్రభుత్వంతో పోరాడి మరీ నిలబెట్టుకున్నారు. అదీ వారు వారి మతానికి ఇచ్చిన విలువ. మనకే అన్ని తిప్పలూ. పేర్లు మన మతాన్ని సూచించేలాగా ఉండటం వారికి ఇష్టం లేదు ఈరోజుల్లో. పెద్దవారు లక్షణంగా అమ్మవారి పేర్లైన మీనాక్షి, కామాక్షి పెడితే, వారు పింకీ, చింకీ అని పిలిపించుకుంటారు. ఇదీ నేటి ఆధునిక సాంప్రదాయంయొక్క దుస్థితి. అటువంటి వారిని ఆ దేవుడే కాపాడాలి. కాని వారు ఆ దేవుణ్ణి కూడా ద్వేషిస్తారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**క్రూరాన్** – వారి ప్రవర్తనలో కూడా క్రూరత్వం కనిపిస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. మంచి, మర్యాద, సంస్కృతి, సాంప్రదాయం పొరపాటున కూడా కనబడవు.

**నరాధమాన్** – వారు నరులలో అధములు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అశుభాన్** – అశుభానికి చిహ్నాలు వారు అని కూడా అంటున్నాడు. అశుభం అంటే ఆధ్యాత్మిక చింతన లేకపోవటం; ధర్మ, మోక్షాలకు విలువను ఇవ్వకపోవటం. అందువల్ల వారి జీవితం అమంగళకరంగా ఉంటుంది. అటువంటి వారిని నేను మాత్రం ఏం చేయగలను, నరకంలో త్రోసివేయటం తప్ప అంటున్నాడు కృష్ణపరమాత్మ. **నరకే పతంతి** అని పదహారవ శ్లోకంలో చూశాము.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – 4.8

ముందు సమాజాన్ని శాస్త్రంద్వారా, గురువుద్వారా మార్చటానికి ప్రయత్నిస్తాను; అయినా సమాజం భ్రష్టుపట్టి పోతుంటే, మహాత్ములు, శాస్త్రం కూడా సమాజాన్ని మార్చలేకపోతే, మళ్ళీ నేనే అవతారం ఎత్తి వారిని సంహరిస్తాను అన్నాడు కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో.

ముందే చూసినట్టుగా రాజసికగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి ఆధ్యాత్మికంగా పతనమవడు, అలాగని ఆధ్యాత్మికంగా ఎదగనూ లేదు; తామసికగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి ఆధ్యాత్మికంగా కిందకు పడిపోతాడు. ఇద్దరూ సమాజానికి ప్రమాదమే. ఆధ్యాత్మిక ఎదుగుదల లేకపోతే మానవజాతికి అది పూడ్చలేని పెద్ద నష్టం. అన్నింటిలోకి మానవజన్మ ఎంతో ఉన్నతమైనది; అందులో మనం సరిగా వినియోగించే సమయం చాలా తక్కువ.

**ఆయుర్వర్షశతం నృణాం పరిమితం రాత్రౌ తదర్ధం గతం**
**తస్యార్ధస్య పరస్య చార్ధమపరం బాలత్వవృద్ధత్వయోః**
**శేషం వ్యాధివియోగదుఃఖసహితం సేవాదిభిర్నీయతే**
**జీవే వారి తరంగచంచలతరే సౌఖ్యం కుతః ప్రాణినామ్** – భర్తృహరి వైరాగ్యషట్కం

మనిషికి నిర్దేశించబడిన జీవితం వంద సంవత్సరాలు. శతమానం భవ అంటారు అందుకే. ఆ వంద సంవత్సరాల్లో సగం సంవత్సరాలు రాత్రి నిద్రలో గడిచిపోతుంది; మిగిలిన ఆ సగం కూడా బాల్యం, వృద్ధాప్యంలో గడిచిపోతుంది. అదికాక అనారోగ్యం, బాధలు, కష్టాలు, ఇతరులకు సేవ చెయ్యటానికి సమయమంతా అయిపోతే, నీటిబుడగలాగా తాత్కాలికమైన ఈ జీవితంలో మనుష్యులు ఏం సాధించగలరు అంటున్నారు భర్తృహరి.

100 సంవత్సరాల జీవితకాలంలో 50 సంవత్సరాలు నిద్రకు, 25 సంవత్సరాలు బాల్యం, వృద్ధాప్యానికి పోతాయి. బాల్యంలో మంచీ–చెడు విచక్షణాజ్ఞానం ఉండదు కాబట్టి ఏమీ మంచి చెయ్యలేము. వృద్ధాప్యంలో మంచీ–చెండు విచక్షణాజ్ఞానం ఉంటుంది కాని, ఆచరణలో పెట్టే శక్తి ఉండదు. మిగిలిన 25సంవత్సరాలలో అనారోగ్యానికి, బాధలు పడటానికి, కష్టాలు పడటానికి, సేవలు చెయ్యటానికి పోతే ఇంక మిగిలేదెంత? ఈ రోజుల్లో ఈ పట్టికలో క్యూ (వరుసలో నిలబడటం)లను కూడా కలుపుకోవాలి. సగం జీవితం క్యూలలో నిల్చోవటానికే సరిపోతుంది. జీవితమేమో అశాశ్వతం; ఉన్న సమయం చాలదు, అయినా మనమెంత జీవితాన్ని వృథాపరుస్తున్నామో చూడండి.

రాజసిక ప్రవృత్తి ఉన్నవారు జీవితాన్ని వృథాపరచుకుంటే, తామసిక ప్రవృత్తి ఉన్నవారు ఏకంగా నాశనమే చేసుకుంటున్నారు. అందువల్ల ఇటువంటి వారిని కృష్ణపరమాత్మ తీవ్రంగా విమర్శిస్తున్నాడు. వారు వారికిచ్చిన మానవజన్మను సరిగ్గా వినియోగించుకోలేదు. వారు నరాధములుగా ప్రవర్తిస్తున్నారు, అందువల్ల వారికి వచ్చే జన్మలో నికృష్టజన్మను ఇస్తాను అంటున్నాడు.

కోతి చేతికి పూమాలను ఇచ్చినట్టు ఉంటుంది వారి ప్రవర్తన. కోతికి అద్భుతమైన పూమాల ఇస్తే దానికి ఆ పూమాలను ఏంచెయ్యాలో తెలియదు. అందులోని పూలన్నీ లాగేస్తుంది, లేకపోతే తినటానికి ప్రయత్నిస్తుంది. అదే విధంగా ఈ రకం మనుష్యులు ప్రవర్తిస్తున్నారు. వారికిచ్చిన అద్భుతమైన మానవశరీరం విలువ వారికి తెలియటం లేదు.

**అజస్రమ్ ఆసురీష్వేవ యోనిషు క్షిపామి** – వారిని తక్కువజాతి శరీరాలలో పడవేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ధర్మ, మోక్షాల జోలికి పోని అధమజన్మను ఇస్తాడు. అది అధమమైన మనుష్యజన్మే కావచ్చు, జంతుజన్మ కావచ్చు, చెట్టు జన్మ కావచ్చు లేదా అధోలోకాలైన అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళలోకాల్లో కావచ్చు. అందువల్ల అర్జునా, ఇటువంటి జీవితం ఉండాలని కోరుకోకు అని హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 20 **ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।**
**మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాం గతిమ్ ॥**
ఆసురీమ్, యోనిమ్, ఆపన్నాః, మూఢాః, జన్మని, జన్మని,
మామ్, అప్రాప్య, ఏవ, కౌంతేయ, తతః, యాంతి, అధమామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | ఆపన్నాః | = పొందినవారై |
| మూఢాః | = ఈ మూఢులు | తతః | = దానికన్నా |
| మామ్, అప్రాప్య, ఏవ | = నన్ను పొందకయే | అధమామ్, గతిమ్ | = అతిహీనమైన గతిని |
| జన్మని, జన్మని | = ప్రతిజన్మయందు | యాంతి | = పొందుతారు |
| ఆసురీమ్, యోనిమ్ | = ఆసురీయోనిని | | |

**హే కౌన్తేయ! ఆసురీమ్ యోనిమ్ ఆపన్నాః జన్మని జన్మని మూఢాః**
**(సన్తః) మామ్ అప్రాప్య ఏవ, తతః అధమామ్ గతిమ్ యాన్తి ॥**

తా: ఓ అర్జునా! ఈ మూఢులు నన్ను పొందకయే ప్రతిజన్మయందు ఆసురీయోనిని పొందినవారై, దానికన్నా అతిహీనమైన గతిని పొందుతారు.

కృష్ణపరమాత్మ వీరిని తీవ్రంగా విమర్శించినా, మళ్ళీ జాలిపడుతున్నాడు వీరిమీద. ఈ ఆసురీసంపత్తి ఉన్నవారు ఎప్పుడైతే కిందకి దిగజారటం మొదలుపెడతారో, అప్పుడే వారు ఒక విషవలయంలో చిక్కుకుపోతారు. ఆ వృత్తంనుంచి బయటపడటం బొత్తిగా సాధ్యం కాదు. ఎందుకు? మనిషిగా వారికున్న గొప్పవరం – ఫ్రీవిల్. ఆ ఫ్రీవిల్‌ను ఉపయోగించకుండా, చెడుకర్మలు చేస్తే, రెండు అవస్థల్లో పడతారు.

మొదటిది, మనిషి చేసిన చెడుకర్మ పాపాన్ని కలుగజేస్తుంది. రెండవది, మనిషి చేసే ప్రతిపని కూడా అతనిలో వాసనలను ఏర్పరుస్తుంది. మనస్సుకు ఒక ప్రత్యేకమైన సామర్థ్యం ఉంది. ఏ పనినైనా వరుసగా కొన్నిరోజులు చేస్తే, దాన్ని అలవాటుగా మార్చుకుని, దానికి బానిస అయ్యే లక్షణం ఉంది మనస్సుకు. మంచి అవనీ, చెడు అవనీ, నాలుగురోజులు చేస్తే, అది అలవాటు అవుతుంది.

మీరు క్రమం తప్పకుండా నాలుగురోజులు గీతాబోధకు వెళుతుంటే, ఒకే కుర్చీలో ఎప్పుడూ కూర్చోవటం జరిగితే, ఆ కుర్చీ మీకు వ్యసనంగా మారుతుంది. ఆ కుర్చీలో కూర్చోలేకపోతే బోధ వినలేను అనే నమ్మకం ఏర్పడిపోతుంది. ఆ కుర్చీ నాది అనే బంధం కూడా ఏర్పడుతుంది. దానితో ఎవరైనా అందులో కూర్చుంటే, వారిని లేపటానికి కూడా వెనుకాడరు. అంటే ఆ కుర్చీకి బానిస అయ్యారు. అది మీలో వాసనలను ఏర్పరిచింది. కాకపోతే ఇది శుభవాసన.

అలా మీరు ఒకటికి నాలుగుసార్లు ఏంచేసినా కూడా అది మీలో ఏదో ఒక వాసనను ఏర్పరుస్తుంది. అది మీరు చేసే పనినిబట్టి శుభవాసనో, అశుభవాసనో అవుతుంది. ఒకరకం ఆహారానికి, ఒకరకం చల్లని పానీయానికి అలవాటుపడితే అది మానలేరు. గీతాబోధకు వెళ్ళటానికి అలవాటుపడితే, అది కూడా మానలేరు.

ఆ విధంగా మీ మనస్సుకు ఒక అద్భుతమైన శక్తి ఉంది. అది అశుభవాసననో, శుభవాసననో కలుగజేయగలదు. ఆ వాసనలు మీ ఫ్రీవిల్‌ను పక్కకు తోసేసి, మీ జీవితాన్ని నిర్దేశించటానికి ప్రయత్నిస్తాయి. అప్పుడు మీ తెలివితేటలు, మీ విచక్షణాశక్తి ఈ వాసనల ముందు ఎందుకూ పనికిరావు. మీకు వీటినుంచి బయటకు రావాలని ఉన్నా రాలేరు. ప్రతి నూతనసంవత్సరానికీ అనేక ప్రతినలు పూనతారు – ఇది చెయ్యను, అది చెయ్యను అంటారు కాని ఏం లాభం? ఆ ప్రతినలు నీటిమీద రాసిన రాతలు అవుతాయి. మీ అలవాట్లు హాయిగా వాటిపనిని అవి చేసుకు పోతుంటాయి. ఎందుకు చెయ్యలేకుండా ఉన్నారు? మీరు బుద్ధిజీవులు, మీకు ఫ్రీవిల్ ఉంది. అయినా చెయ్యలేకపోతున్నారూ అంటే మీ వాసనలు మిమ్మల్ని అధిగమించి వేస్తున్నాయి.

ఇదే జరుగుతున్నది ఆసురీసంపత్తి ఉన్నవారి జీవితంలో. వారు ఆసురీకర్మలు చెయ్యటంవల్ల ఆసురీవాసనలు నెలకొంటాయి వారిలో. ఆ ఆసురీవాసనలవల్ల వారు అదే కర్మను పదేపదే చేస్తారు.

మనం ఇంతకుముందు కూడా చూశాము. ఏదైనా వ్యసనానికి బానిస అయ్యేముందు మొదటిసారి మాత్రమే మీకు 'నో' అనగలిగే అవకాశం ఉంది. అప్పుడు మీ ఫ్రీవిల్‌కి అధికారం ఉంది. ఉదాహరణకు సిగరెట్టు కాల్చటమే తీసుకుంటే, మొదటి సిగరెట్టుకు మాత్రమే 'నో' అనగలగే హక్కు మీకుంది. తర్వాత సిగరెట్టు వాసన మీలో నెలకొంటుంది; వాసన తాగదు; వాసన మిమ్మల్ని సిగరెట్టు తాగేలాగా ఉసిగొల్పుతుంది. వాసనకూ, ఫ్రీవిల్‌కు మధ్య టగ్ ఆఫ్ వార్ మొదలవుతుంది. అందులో వాసనే గెలుస్తుంది; ఫ్రీవిల్ దారుణంగా ఓడిపోతుంది. మీరు గనుక కొన్ని వందల సిగరెట్లు కొన్ని వందలరోజులు కాల్చివుంటే, సిగరెట్టు విషయంలో మీ విల్‌పవర్ సున్నా. ఎన్ని చెప్పినా, దాన్నించి బయటపడలేరు.

నువ్వు బ్రహ్మవు అని ఎంతగా నేర్పించినా, తక్కిన విషయాల్లో బ్రహ్మను అని అర్థం చేసుకుంటారేమో కాని, సిగరెట్టు ముందు మాత్రం మీరు బ్రహ్మ అనే సత్యం భ్రమ అయి కూర్చుంటుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అది సిగరెట్టు విషయమే కానవసరం లేదు; త్రాగుడు, మత్తుమందు ఏదైనా కావచ్చు. ఈ వ్యసనం మంచివాటికి కూడా ఏర్పడుతుందని చూశాము కదా. అందుకని ఇలా వాసనలు ఏర్పరచే శక్తిని మనం శుభవాసనలు ఏర్పడేలా మలచుకోగలగాలి.

**శుభాశుభ్యాం మార్గాభ్యాం వహంతీ వాసనాసరిత్।**
**పౌరుషేణ ప్రయత్నేన యోజనీయా శుభే పథి॥**

అందువల్ల వ్యసనానికి బానిస అయినా, మంచి వ్యసనాలకు బానిసలు అవ్వాలి. కాని ఇటువంటి వారు మంచివాటికి బానిసలు అయ్యే అవకాశమే లేదు.

**ఆసురీం యోనిమాపన్నా** – ఈ ఆసురీసంపత్తి ఉన్నవారు ఈ జన్మలో చెడు వ్యసనాలకు బానిసలు అవటమే కాక, ఆ వాసనలను వచ్చే జన్మకు కూడా తీసుకుపోతారు. అందువల్లనే చూడండి, ఈ జన్మలో మనుష్యులందరూ ఒకటే అయినా, కొంతమంది సహజంగా ఉన్నతమైన కార్యాలవైపు ఆకర్షింపబడుతారు; అది కూడా చిన్నవయస్సులోనే. అంత చిన్నవయస్సులోనే వారికి మంచి స్వభావం ఎలా అలవడుతుంది? అది పూర్వజన్మలో ఏర్పరచుకున్న శుభవాసనలవల్ల.

**తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్** – 6.43

మనం పూర్వజన్మ పుణ్యపాపాలనే కాదు, వాసనలను కూడా ఈ జన్మలోకి తీసుకుని వస్తాము.

**తం విద్యాకర్మణీ సమన్వారభేతే పూర్వప్రజ్ఞా చ** – బృహదారణ్యకం 4.4.2

పూర్వప్రజ్ఞ అంటే వాసనలు. అందువల్ల ఆసురీసంపత్తి ఉన్న ఈ దురదృష్టకరమైనవారు నికృష్టమైన జన్మలను పొందుతారు. యోని అంటే ఇక్కడ శరీరం. నికృష్ట శరీరాన్ని పొందుతారు.

**మూఢాః** – వారి తప్పుడు ఆలోచనల్లోనే వారు ఉంటారు. అది కూడా ఒక్క జన్మలో కాదు;

**జన్మని జన్మని** – ప్రతి జన్మలోనూ మూఢులుగానే ఉంటారు. కర్మవల్ల వాసన ఏర్పడుతుంది; వాసనవల్ల తర్వాత

కర్మలు చేస్తారు; తర్వాత చేసిన కర్మలవల్ల కొత్త వాసనలు ఏర్పడతాయి. అందువల్ల జన్మజన్మకీ కిందికి పడిపోతూనే ఉంటారు. ఆధ్యాత్మికంగా కిందికి పడిపోయినకొద్దీ, పరమాత్మకు దూరమైపోతారు; శాస్త్రానికి దూరమైపోతారు; మహాత్ములకు దూరమైపోతారు.

**మామ్ అప్రాప్య ఏవ** – అటువంటి వారు అంతకంతకూ నాకు దూరమైపోతారు. వారికి దైవచింతన కాని, ఆధ్యాత్మిక చింతన కాని ఏర్పడే అవకాశాలు అంతకంతకూ అరుదైపోతాయి. అందువల్ల వారు ఇంకా ఇంకా దిగజారిపోతారు, అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అధమామ్ గతిమ్ యాంతి** – అటువంటివారు అధోగతిపాలు అవుతారు. పాతాళలోకం దాకా వెళతారు. అదే అన్నిటికన్నా అధోలోకం. అంతకన్నా కిందికి వెళ్ళలేరు. ఇదంతా ఎందుకు వచ్చింది? ఈ జన్మలో వారు అర్థకామాలకే విలువనిచ్చి, ధర్మమోక్షాలను పట్టించుకోకపోవటంవల్ల. దైవీసంపత్తిని అలవరచుకోకుండా, ఆసురీసంపత్తిని పెంపొందించుకోవటంవల్ల; ఫ్రీవిల్‌ను మొదట్లోనే ఉపయోగించుకోకపోవటంవల్ల.

అందువల్లనే ఏ వ్యసనానికైనా మొట్టమొదటిసారి 'నో' చెప్పటమే మీ చేతిలో ఉంది అన్నాము. రెండోసారికే 'నో' చెప్పటం కష్టం. అందువల్ల చెడువిషయాల జోలికి పోకూడదు; అందువల్లనే చెడుస్నేహాలను చెయ్యకూడదని చెప్పేది. ఎప్పుడూ ధార్మికవ్యక్తులతో స్నేహం చెయ్యాలి.

**సత్సంగః సర్వదా కార్యః దుస్సంగః సర్వదా త్యాజ్యః**

ఒక్కోసారి పుస్తకాల్లో మిమ్మల్ని తప్పుదారి పట్టించే ప్రమాదం ఉంది. కొంచెం మద్యం సేవిస్తే మంచిదే అంటారు ఒకరు. నలుగురితో కలిసి త్రాగటం నాగరికత అంటారు ఇంకొకరు. ఇటువంటి తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండమంటున్నాడు కృష్ణపరమాత్మ. అంత్యనిష్ఠూరంకన్నా ఆదినిష్ఠూరం మేలు అన్నారు పెద్దలు.

శ్లో. 21 **త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥**
త్రివిధమ్, నరకస్య, ఇదమ్, ద్వారమ్, నాశనమ్, ఆత్మనః,
కామః, క్రోధః, తథా, లోభః, తస్మాత్, ఏతత్, త్రయమ్, త్యజేత్ ॥

| | | | |
|---|---|---|---|
| కామః | = కామము | నరకస్య, ద్వారమ్ | = నరకద్వారములును |
| క్రోధః | = క్రోధము | ఆత్మనః, నాశనమ్ | = ఆత్మనాశనమునకు కారణమైనవి |
| తథా | = అలాగే | తస్మాత్ | = అందువలన |
| లోభః | = లోభము | ఏతత్, త్రయమ్ | = ఈ మూడింటిని |
| ఇదమ్, త్రివిధమ్ | = ఈ మూడు విధములైన | త్యజేత్ | = విడిచిపెట్టవలెను |

**కామః క్రోధః తథా లోభః ఇదమ్ త్రివిధమ్ ఆత్మనః నాశనమ్**
**నరకస్య ద్వారమ్ (అస్తి), తస్మాత్ ఏతత్ త్రయమ్ త్యజేత్ ॥**

తా: కామము, క్రోధము అలాగే లోభము ఈ మూడు విధములైన నరకద్వారములును ఆత్మనాశనమునకు కారణమైనవి. అందువలన ఈ మూడింటిని విడిచిపెట్టవలెను.

మొత్తం ఆసురీసంపత్తిని కృష్ణపరమాత్మ మూడు ప్రాథమిక సమస్యల కింద విభజించాడు. ఎవరైతే ఈ మూడు ప్రాథమిక సమస్యలను తెలివిగా అదుపులో పెట్టుకుంటారో, అతనికి ఏ సమస్యా ఉండదు. ఏమిటా మూడు లక్షణాలు?

**త్రివిధం నరకస్యేదం ద్వారమ్** – మూడు రాచమార్గాలు ఉన్నాయి నరకానికి తీసుకుపోవటానికి. ద్వారం అంటే గుమ్మం లేదా రోడ్డు. అవి మూడు. నరకం అంటే ఏమిటి? నరకం అనే ప్రదేశం ఉందో లేదో మనకనవసరం. నరకం అంటే ఆధ్యాత్మిక ఎదుగుదలకు అడ్డుపడేది ఏదైనా నరకమే. ఆధ్యాత్మికంగా ఎదగకుండా కిందికి తోసేది ఏదైనా నరకమే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఆత్మనః నాశనమ్** – ఏదైతే ఒకవ్యక్తిని ఆధ్యాత్మికంగా ఎదగకుండా నాశనం చేస్తుందో, ఏదైతే మోక్షమార్గానికి అడ్డుపడుతుందో అది నరకం అని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మనః నాశనమ్ అంటే ఆధ్యాత్మికపతనం. ఈ ఆధ్యాత్మికపతనం కలిగించే మూడు ఏమిటి?

**కామః క్రోధః లోభః** – ఈ మూడూ కామ, క్రోధ, లోభాలు. కామం అంటే కోరిక; క్రోధం అంటే కోపం; లోభానికి రెండు అర్థాలున్నాయి. అవి అత్యాశ, పీనాసితనం. తనకున్న ఆస్తిని ఎవరితోనూ పంచుకోకపోవటాన్ని పీనాసితనం అంటారు. రెండూ లోభం కిందికే వస్తాయి. అత్యాశలోనూ అన్నీ నాకే కావాలనుకుంటాను; పీనాసితనంలోనూ అంతా నా దగ్గరే ఉండాలి, ఎవరికీ ఇవ్వను అనుకుంటాను. అందువల్ల లోభం అంటే దాచుకోవాలనే తపన. ఈ మూడూ నరకద్వారాలు. అందువల్ల ఏం చెయ్యాలి?

**తస్మాత్ ఏతత్ త్రయమ్ త్యజేత్** – అందువల్ల ఈ మూడింటినీ త్యజించు అంటున్నాడు. ఈ మూడింటినీ వదిలేయమంటున్నాడు. అంటే కామక్రోధలోభాలను వదిలేయమంటున్నాడు.

కాని కామాన్ని వదిలేయమని కృష్ణపరమాత్మ అంటున్నాడు అంటే ఈ విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. శాస్త్రమే స్పష్టంగా చెబుతుంది; కామాన్ని వదలటం అసాధ్యం అనీ, అవసరం లేదనీ కూడా. అందువల్ల కామాన్ని త్యజించటం అంటే పూర్తిగా కామాన్ని మానటం కాదు. కామాన్ని మానలేము, మాననవసరం లేదు కూడా.

మరి అయితే కామత్యాగం అంటే ఏమిటి? కామత్యాగం అంటే కోరికలను సంస్కరించుకోవటం. కోరికలను సంస్కరించుకోవటం అంటే ఏమిటి? తామసిక కోరికలను రాజసిక కోరికలుగానూ; రాజసిక కోరికలను సాత్త్విక కోరికలుగానూ మార్చుకోవాలి. గీతాబోధకు వెళ్ళాలంటే మీకు రాజసిక కోరిక ఉండాలి. కోరికలను వదిలేయమని అంటే, అయితే గీతాబోధకు వెళ్ళాలనే కోరిక కూడా వదలుకుంటాను అని మీరు గీతాబోధకు వెళ్ళకపోతే, అక్కడ గురువు ఒక్కరే మిగులుతారు. అందువల్ల ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

ముందు తామసిక కోరిక అంటే ఏమిటి? ఏ కోరిక అయినా సరే అది అధార్మికంగానో, చట్టవిరుద్ధంగానో, ఇతరులకు హాని కలిగించేదిగానో, ఇతరులను మోసం చేసేదిగానో ఉంటే, అది తామసిక కోరిక కిందికి వస్తుంది. దానిని వెంటనే వదిలివేయాలి.

రాజసిక కామం అంటే ఏమిటి? అనేక ధార్మిక కోరికలు ఉన్నాయి, చట్టపరమైన కోరికలు ఉన్నాయి కాని అవన్నీ లౌకికసుఖాలను మాత్రమే ఇస్తాయి. వీటిని అర్థకామాలు అంటారు. అవి ధనాన్ని, సుఖాన్ని ఇస్తాయి కాని వాటిని ధర్మబద్ధంగా కోరుకుంటే, ఎవరినీ మోసం చెయ్యకుండా సంపాదించాలని కోరుకుంటే, అవి రాజసిక కోరికల కిందికి వస్తాయి. అంటే చట్టపరంగా సరదాలను తీర్చుకోవచ్చు. ఇందులో ఏమిటి సమస్య? అతను జీవితాన్ని బాగా అనుభవిస్తాడు, ఐశ్వర్యంలో మునిగితేలుతాడు; సుఖాల అంచులదాకా వెళతాడు; కాని ఆధ్యాత్మిక చింతన కొంతకూడా ఉండదు. ధర్మం, మోక్షం అనవసరం అతనికి. అందువల్ల రాజసికకోరిక ఆధ్యాత్మిక పతనాన్ని తీసుకురాదు కాని, ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా ఇవ్వదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది అన్న సామెతలాగా ఉంటుంది అతని జీవితం.

కాని ఇది గుడ్డిలో మెల్ల. తామసిక కర్మకన్నా ఎంతో నయం. ఇందులో జీవితాన్ని అనుభవిస్తాడు కాని అది అనైతికంగానూ, చట్టవ్యతిరేకంగానూ ఉండదని చూశాము. అందువల్ల అది హానికరమైతే కాదు; ధార్మిక చర్య కిందే వస్తుంది. కాని ఎంతసేపూ తిని, త్రాగి ఆనందిస్తే గీత నేర్చుకునేది ఎప్పుడు? ఉన్నత లక్ష్యాలను కోరుకునేది ఎప్పుడు? అందువల్ల తామసిక కోరికలను ముందు రాజసిక కోరికలుగా మార్చుకోవాలి నిజమే, కాని అక్కడే ఆగిపోకూడదు. అయితే ఏం చెయ్యాలి?

రాజసిక కోరికను సాత్త్విక కోరికగా మార్చుకోవాలి. అప్పుడు అర్థకామాలమీద కోరిక నెమ్మదిగా తగ్గి, మనస్సు ధర్మ, మోక్షాల వైపు తిరుగుతుంది. చిత్తశుద్ధి కోరుతుంది మనస్సు. అది కోరికే, కాదనటం లేదు కాని, అది సాత్త్విక కోరిక కింద వస్తుంది. గురుప్రాప్తి కోరుకుంటుంది మనస్సు; అది కూడా సాత్త్విక కామమే. ఆరోగ్యం కోరుకుంటుంది మనస్సు; అది కూడా సాత్త్విక కామమే.

**శరీరం మే విచర్షణం జిహ్వా మే మధుమత్తమా**

నాకు మంచి ఆరోగ్యాన్ని ఇయ్యి; మంచి వాక్కును ఇయ్యి; ముఖ్యంగా మంచి చెవులను ఇయ్యి. అప్పుడే నేను శాస్త్రాన్ని వినగలను అని ప్రార్థన చేస్తాడు సాధకుడు. నాకు చిత్తశుద్ధి, గురుప్రాప్తి, శ్రవణప్రాప్తి, మననప్రాప్తి, నిదిధ్యాసనప్రాప్తి ఇవ్వమని కోరే ఈ కోరికలన్నీ కూడా సాత్త్విక కోరికల్లోకి వస్తాయి. అందువల్ల తామసిక కామాన్ని రాజసికకామంగా, రాజసికకామాన్ని సాత్త్వికకామంగా మలుచుకోవాలి.

సాత్త్విక కామంతో సహా ఈ మూడు కోరికలూ బంధకత్వాన్నే ఇస్తాయి. సరిగ్గా మీరు గీతాబోధకు బయలుదేరే సమయానికి ఏ ముఖ్యమైన అతిథో వస్తారు; మీరు వారిని పొమ్మనలేరు, వారిని వదిలి బోధకూ వెళ్ళలేరు. మీరు చాలా బాధపడతారు. అందువల్ల 14వ అధ్యాయంలో చూసినట్టుగా బంధించే కోరిక మంచిదైనా, చెడ్డదైనా కూడా బంధకత్వానికే దారితీస్తుంది. ఆత్మజ్ఞానం పొంది, గుణాతీతునిగా ఎదగాలి. సాత్త్వికకోరికను మిమ్మల్ని బంధించని కోరికగా మలుచుకోవాలి. అంటే ఆ కోరిక కోరవచ్చు తప్పులేదు; కాని అది తీరకపోతే బాధపడకూడదు. ఎప్పుడైతే ఆ కోరికలు మిమ్మల్ని బంధించవో అప్పుడే మీరు కోరికలకు అతీతంగా ఎదిగినట్టు అర్థం.

మన సాంప్రదాయంలో ఆచార్యులు కూడా మన శాస్త్రాన్ని నలుగురికీ చాటాలనే కోరికతోనే ప్రయత్నించారు. శంకరాచార్యులవారు గీతమీద, ప్రకరణగ్రంథాలమీద, బ్రహ్మసూత్రాలమీద, ఉపనిషత్తులమీద భాష్యాలు రాశారు. ఆయన భారతదేశంలో మఠాలు స్థాపించారు. ఇవన్నీ ఎందుకు చేశారు? వైదికధర్మాన్ని నిలబెట్టాలని, దేశం నలుమూలలా హిందూధర్మం ప్రచారం అవాలని, అద్వైత సిద్ధాంతం తరతరాలకు నిలబడాలని కోరికతో చేశారు. కాని ఎటువంటి కోరిక? అది తీరిందా సంతోషం; లేదా అది ఈశ్వరప్రసాదం అనుకుని చేశారు. అలాంటి కోరికలు ఎన్నైనా ఉండవచ్చు.

ఆమాటకొస్తే భగవంతునికి కూడా కోరికలున్నాయి. ఏమిటా కోరికలు? పరిత్రాణాయ సాధూనామ్ – సాధువులను రక్షించటం**కోసం**; వినాశాయ చ దుష్కృతామ్ – ఆగడాలను నాశనం చెయ్యటం**కోసం**, మళ్ళీ కోరిక; ధర్మసంస్థాపనార్థాయ – ధర్మం నిలబెట్టటం**కోసం**, మళ్ళీ కోరిక. ఇవన్నీ ఎవరు అన్నారు? భగవంతుడు. దానికోసం ఏంచేస్తాడు? సంభవామి యుగేయుగే – మళ్ళీమళ్ళీ పుడతాను; మళ్ళీ కోరిక.

**సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి** – తైత్తిరీయం

భగవంతుడు అనుకున్నాడట. ఏమని? నేను అనేకంగా అవుతాను అనుకున్నాడట. అందువల్ల కామాన్ని త్యజించటం అంటే తామసిక కోరికలను రాజసిక కోరికలుగానూ, రాజసిక కోరికలను సాత్త్విక కోరికలుగానూ మలుచుకోవటం. సాత్త్విక కోరికలను బంధించని కోరికలుగా మలుచుకోవటం. త్యజేత్ అంటే అర్థం అది. మరి క్రోధ లోభాల సంగతి ఏమిటి? కామాన్ని అదుపులో పెట్టుకుంటే అవి రెండూ వాటికవే సర్దుకుంటాయి. ఎందుకంటే క్రోధ, లోభాలు కామంయొక్క ఇంకో రూపాలు మాత్రమే. ఎలా చెప్పగలరు? కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

కామ, క్రోధాలు రెండూ రజోగుణంనుంచి పుట్టాయి అని చెబుతూ ఆ రెండింటికీ కలిపి ఏకవచనం వాడాడు కృష్ణపరమాత్మ. సంస్కృతంలో ద్వివచనం కూడా ఉంది. కామం, క్రోధం రెండుగా తీసుకుంటే వాటికి ద్వివచనం వాడాలి కాని కృష్ణపరమాత్మ రజోగుణసముద్భవః అని ఏకవచనం వాడాడు. కామం క్రోధంలోకి దారితీస్తుంది అంటే కోరిక తీరకపోతే కోపం వస్తుంది. అందువల్ల కోరికను అదుపులో పెట్టుకోగలిగితే, కోపం వచ్చే అవకాశం ఎక్కడుంటుంది? అప్పుడే చూశాము. కోరిక తీరకపోతే క్రోధం వస్తుంది; కోరిక తీరితే లోభం పుడుతుంది. అందువల్ల కామంనుంచి పుట్టినవే ఈ రెండూ. కామం స్థాయిలోనే దాన్ని సరిదిద్దితే తీరని కోపమూ రాదు; తీరిన లోభమూ రాదు. అందువల్ల కామాన్ని నియంత్రిస్తే, క్రోధంలో కూడా తామసక్రోధం రాజసికక్రోధానికీ, రాజసికక్రోధం సాత్త్వికక్రోధానికీ, సాత్త్వికక్రోధం బంధానికి అతీతంగానూ మారుతుంది. ఇదే సూత్రం లోభానికి కూడా వర్తిస్తుంది. అందువల్ల ఈ మూడింటినీ మార్చుకోవాలి. ఇక్కడితో ఆసురీసంపత్తిమీద విశ్లేషణ ముగిస్తాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 22 **ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైః త్రిభిర్నరః ।**
**ఆచరత్యాత్మనః శ్రేయః తతో యాతి పరాం గతిమ్ ॥**
ఏతైః, విముక్తః, కౌంతేయ, తమోద్వారైః, త్రిభిః, నరః,
ఆచరతి, ఆత్మనః, శ్రేయః, తతః, యాతి, పరామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | ఆచరతి | = ఆచరించును |
| ఏతైః, త్రిభిః, తమోద్వారైః | = ఈ మూడు నరకద్వారములనుంచి | తతః | = దానివల్ల అతడు |
| విముక్తః నరః | = బయటపడినవాడు | పరామ్, గతిమ్ | = పరమగతిని |
| ఆత్మః, శ్రేయః | = తనకు శ్రేయస్కరమైన శుభకర్మలే | యాతి | = పొందును. అనగా నన్నే పొందును |

**హే కౌన్తేయ! ఏతైః త్రిభిః తమో–ద్వారైః విముక్తః నరః ఆత్మనః**
**శ్రేయః ఆచరత్, తతః పరామ్ గతిమ్ యాతి ॥**

తా: ఓ అర్జునా! ఈ మూడు నరకద్వారములనుంచి బయటపడినవాడు తనకు శ్రేయస్కరమైన శుభకర్మలే ఆచరించును. దానివల్ల అతడు పరమగతిని పొందును. అనగా నన్నే పొందును.

### 3. శాస్త్రంయొక్క ప్రాముఖ్యత – శ్లోకాలు 22–24

కామ, క్రోధ, లోభాలను మార్చుకోవటం అంటే ఆసురీసంపత్తినుంచి దైవీసంపత్తికి మారటం. దైవీసంపత్తి ఉన్నవ్యక్తికి కూడా కోరిక ఉంటుంది. ఏమిటా కోరిక? నాకు వైరాగ్యం బలంగా ఉండాలి; వివేకం బాగా పనిచెయ్యాలి; శమాదిషట్కసంపత్తి మెండుగా ఉండాలి; ముముక్షుత్వం తీవ్రంగా ఉండాలి అనుకుంటాడు. అంటే సాధనచతుష్టయ సంపత్తి పెంపొందించుకోవాలనుకుంటాడు. ఇది ఉన్నతమైన కోరిక కాబట్టి దైవీసంపత్తిలోకి వస్తుంది.

ఆసురీసంపత్తినుంచి దైవీసంపత్తికి ఎలా మారాలి? ఏ సాధన చెయ్యాలి? ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పడు కాని సాధనచతుష్టయ సంపత్తి పెంపొందించుకోవాలంటే కర్మయోగం, ఉపాసనయోగం చెయ్యాలని అంతకుముందు చూశాము. వేదపూర్వభాగం కర్మయోగం గురించీ, ఉపాసనయోగం గురించీ చెబుతుంది. కర్మయోగం అంటే పంచమహాయజ్ఞాలు చెయ్యటం అని చూశాము. అదికూడా ఈశ్వరార్పణభావనతో చేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలని చూశాము. ఇటువంటి జీవితం గడిపితే ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పిన మార్పు వస్తుంది.

**ఏతైర్విముక్తః కౌంతేయ** – ఓ అర్జునా, వీటినుంచి బయటపడిన వ్యక్తి. వీటినుంచి అంటే కామక్రోధలోభాలనుంచి. అవి ఎటువంటివి?

**తమోద్వారైః త్రిభిర్నరః** – ఈ మూడూ తమోగుణానికి చెందినవి; మూడూ నరకానికి దారితీస్తాయి. ఈమాట ముందు శ్లోకంలో కూడా చెప్పాడు. వాటినుంచి జాగ్రత్తగా బయటపడాలి. వాటినుంచి బయటపడితే ఇంక మీ ఆధ్యాత్మికసాధన మొదలుపెట్టవచ్చు.

**ఆత్మనః శ్రేయః ఆచరతి** – మీ చిత్తశుద్ధికోసం మరింత ఎక్కువగా ప్రయత్నించవచ్చు. బాహ్యంగా ఎదగటంకన్నా ఆంతరంగా ఎదగటానికి ఎక్కువగా ప్రాముఖ్యతను ఇస్తారు. సమాజం ఆంతర ఎదుగుదలకన్నా, బాహ్యాడంబరాలకే ప్రాముఖ్యతను ఇచ్చినా, మీరు పట్టించుకోరు. మీకు సమాజం ఆశించే పదవి, హోదా లేకపోవచ్చు కాని ఎప్పుడైతే మీరు ఆంతర ఎదుగుదలకు ప్రాముఖ్యతనిస్తారో, మీకు అవి లేవనే ఆత్మన్యూనతా భావన కూడా కలగదు. మీరు పాటించే విలువలు వేరు; సమాజం కోరే జీవనవిధానం వేరు. అయినా మీరు ఆ పరుగుపందెంలో పడిపోకుండా, ఆగి, ఆంతర ఎదుగుదలనే కోరుకుంటారు. అంటే మీరు ఐశ్వర్యం, హోదాలను అసలు పట్టించుకోరని కాదు అర్థం. కాని వాటిని రెండవస్థాయికి పంపిస్తారు. మొదటిస్థాయి చిత్తశుద్ధి పొందటం. అందువల్ల కర్మయోగాన్ని పాటిస్తారు. అది మీకు శ్రేయస్కరమైనది.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతే** – కఠ

శ్రేయోమార్గం, ప్రేయోమార్గం తమను వరించమని మనుష్యుల ముందు నిలుచుంటాయిట. ముందంతా మీరు కూడా ప్రేయోమార్గంలో వెళ్ళారు. ప్రేయోమార్గం అంటే మీకు ప్రియమైనది. ఇప్పుడు శ్రేయోమార్గం ఎన్నుకుంటున్నారు. అది మీకు శ్రేయస్కరమైనది. అంటే మీమార్గం మారింది. శ్రేయోమార్గాన్ని మోక్షమార్గం అనికూడా అంటారు. ఎందుకంటే ఇందులో మోక్షపురుషార్థాన్ని కోరుకుంటారు.

**తతః** – ఎప్పుడైతే మీరు ఈ శ్రేయోమార్గంలోకి వస్తారో అప్పుడు మీకు చిత్తశుద్ధి త్వరగా ఏర్పడుతుంది. గురువు కావాలి; శాస్త్రం నేర్చుకోవాలి అనే తపన ఎక్కువవుతుంది. ఎప్పుడైతే మీలో గురువు కావాలి, శాస్త్రం నేర్చుకోవాలి అనే తపన తీవ్రంగా ఉంటుందో, అప్పుడే భగవంతుడు మీ యోగక్షేమాలను తనమీద వేసుకుంటాడు. మీకు గురువును ఏర్పాటుచేస్తాడు. మీకు మంచి గురువెవరో మీకు తెలియకపోవచ్చు, కాని భగవంతునికి తెలుసు. ఆయన దగ్గర గురు ఏజన్సీయే ఉంది; ఒకవేళ ఏ గురువూ దొరకకపోతే ఆయనే గురువుగా వస్తాడు. అర్జునునికి సాక్షాత్తూ కృష్ణపరమాత్మే బోధిస్తున్నాడు కదా! అందువల్లనే భగవద్గీత అంత పవిత్రమైన గ్రంథం అయింది. అందువల్ల మీరు చెయ్యాల్సిన పనిని మీరు శ్రద్ధగా చెయ్యండి; తక్కిన పనులు వాటంతట అవే అయిపోతాయి; ఇది ప్రకృతిసూత్రం.

అందువల్ల తతః అంటే త్వరలోనే. మీకు చిత్తశుద్ధి కలిగి, గురుప్రాప్తి కలిగి, శ్రవణప్రాప్తి కలుగుతుంది. శ్రవణం చెయ్యందే మోక్షం రాదని పదేపదే చూశాము. స్పర్శవల్ల మోక్షం వచ్చేసేటట్టయితే, యుద్ధభూమిలో కృష్ణపరమాత్మ అర్జునునికి గీతాబోధ చెయ్యాల్సిన అవసరమే లేదు. అందువల్ల మోక్షం పొందాలంటే శాస్త్రశ్రవణ మనన నిదిధ్యాసనలు చెయ్యాలి. శ్రవణం అంటేనే ఆషామాషీగా వినేది కాదని చూశాము. శ్రవణం అంటే క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో, కొన్ని సంవత్సరాలపాటు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువద్ద వేదాంతశాస్త్ర అధ్యయనం చెయ్యాలి.

**(తతో) యాతి పరాం గతిమ్** – అతను మోక్షం పొందుతాడు. మంచిగురువు చేసే బోధలో మీ ప్రయాణం చాలా సునాయాసంగా సాగి, మీకు తెలియకుండానే అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని పొందుతారు. మంచిగురువు చెబితే అరటిపండు వలిచి నోట్లో పెట్టినట్టు చెప్పాడు అంటారు. ఆ విధంగా మీరు సునాయాసంగా మోక్షాన్ని పొందుతారు.

శ్లో. 23 **యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥**
యః, శాస్త్రవిధిమ్, ఉత్సృజ్య, వర్తతే, కామకారతః,
న, సః, సిద్ధిమ్, అవాప్నోతి, న, సుఖమ్, న, పరామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ మనుష్యుడు | సిద్ధిమ్ | = సిద్ధిని |
| శాస్త్రవిధిమ్ | = శాస్త్రోక్తవిధులను | న, అవాప్నోతి | = పొందజాలడు |
| ఉత్సృజ్య | = వదిలిపెట్టి | పరామ్, గతిమ్ | = పరమగతిని |
| కామకారతః | = తన యిష్టము వచ్చినట్లు | న | = పొందజాలడు |
| వర్తతే | = ప్రవర్తించునో | సుఖమ్ | = సుఖమును సైతము |
| సః | = అతడు | న | = పొందజాలడు |

**యః శాస్త్ర-విధిమ్ ఉత్సృజ్య, కామ-కారతః వర్తతే, సః న సిద్ధిమ్,**
**న సుఖమ్, న (చ) పరామ్ గతిమ్ అవాప్నోతి ॥**

తా: ఏ మనుష్యుడు శాస్త్రోక్తవిధులను వదిలిపెట్టి తన యిష్టము వచ్చినట్లు ప్రవర్తించునో, అతడు సిద్ధిని పొందజాలడు. పరమగతిని పొందజాలడు. సుఖమును సైతము పొందజాలడు.

7-21 శ్లోకాల్లో ఆసురీసంపత్తి గురించి చెప్పాక, 22 నుంచి తర్వాత ఏం చెయ్యాలో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఆసురీసంపత్తినుంచి దైవీసంపత్తికి మారినంత మాత్రాన ప్రయాణం ముగియదు. మంచి ప్రవర్తన ఉన్నంత మాత్రాన మోక్షం రాదు. ధార్మికజీవనం ఒక్కటే మోక్షాన్ని ఇవ్వదు. ఎందుకంటే అది అజ్ఞానాన్ని తొలగించదు. అంతకుముందు అతను అధార్మిక అజ్ఞాని అయితే, ఇప్పుడు ధార్మిక అజ్ఞాని అవుతాడు. అంతే భేదం. అందువల్ల అజ్ఞానం తొలగాలంటే అతను ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి. **తతో యాతి పరాం గతిమ్.** అతను పరమగతిని పొందుతాడు; అంటే మోక్షాన్ని పొందుతాడు. ఎప్పుడు? అజ్ఞానం తొలగటానికి గురువుద్వారా శాస్త్ర అధ్యయనం చేస్తే పొందుతాడు.

ఇప్పుడు అలా తన జీవితవిధానం మార్చుకోని వ్యక్తి పరిస్థితి ఏమిటో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే మోక్షం పొందుతాడని చెప్పి, చెయ్యకపోతే ఏమవుతుందో హెచ్చరిస్తున్నాడు.

**యః శాస్త్రవిధిముత్సృజ్య** – ఎవరైతే ఈ అద్భుతమైన శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యరో,

**వర్తతే కామకారతః** – తన జీవితాన్ని తన రాగద్వేషాలకనుగుణంగా నడుపుకుంటాడో అతని పరిస్థితిని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

నిజానికి మనం ఒక అద్భుతమైన సాంప్రదాయంలో పుట్టాము. అది వేలాది సంవత్సరాలుగా, తరతరాలుగా మనకు అందించబడుతున్నది. పైగా ఇంతమంచి సంస్కృతి మనకు ఉచితంగా అందించబడుతున్నది. శంకరాచార్యులవారు ఎన్నడూ కాపీరైట్సు నా స్వంతం అనలేదు; వ్యాసాచార్యులవారు కాపీరైట్సు నా స్వంతం

అనలేదు. వారి పేటెంట్ రైట్స్‌ను అమ్ముకుని ఉంటే ఎంత ధనం సంపాదించి ఉండేవారు? కాని వారు మనమీద అభిమానం కొద్దీ, మన హిందూధర్మాన్ని నిలబెట్టటంకోసం కృషిచేశారు. ఇంత గొప్ప సంస్కృతిని అందుకోవటానికి మనమేం చెయ్యాలి? ఏమీ కష్టపడనవసరం లేదు. అదృష్టవశాత్తూ ఇంత గొప్ప సాంప్రదాయంలో ముందే పుట్టేశాము. మనం చేయవలసిందల్లా, మన చెవులను ఒక గురువుకు అప్పజెప్పటమే. కాని అది కూడా చెయ్యలేకపోతున్నారు కొందరు. ఉత్సృజ్య – ఈ శాస్త్రాన్ని త్యజిస్తున్నారు. త్యజించి ఏంచేస్తున్నారు?

రాగద్వేషాలు తీసుకెళ్ళిన మార్గంలో వెళుతున్నారు. సంస్కృత జీవనవిధానం పాటించాల్సింది పోయి, ప్రాకృత జీవనవిధానాన్ని ఎన్నుకుంటున్నారు. ధర్మాధర్మ విచక్షణ చూపాల్సింది పోయి, రాగద్వేషాలతో కూడిన జీవన విధానాన్ని ఎన్నుకుంటున్నారు. కన్ను చూస్తున్న ప్రతిదానివైపు కాలు పోవచ్చా? మనస్సు పోయిన దానికల్లా మనిషి పోవచ్చా? అటువంటి జీవితం గడిపినవాని పరిస్థితి ఏమిటి?

**సః సిద్ధిమ్ న అవాప్నోతి** – అటువంటి వ్యక్తి చిత్తశుద్ధిని పొందలేడు. అంటే జ్ఞానయోగ్యతను పొందలేడు.

**న పరాం గతిమ్** – జ్ఞానయోగ్యతే పొందలేని వ్యక్తి ఇంక పరమమార్గమైన మోక్షాన్ని ఏం పొందుతాడు? జ్ఞానయోగ్యతే లేకపోతే జ్ఞానప్రాప్తి కలిగే అవకాశం ఎక్కడుంది? జ్ఞానం పొందలేకపోతే మోక్షం పొందే అవకాశం ఎక్కడుంది? అక్కడితో ఆగలేదు కృష్ణపరమాత్మ – ఇంకో ఆశనిపాతంవంటి మాటను వదులుతున్నాడు. ఇటువంటి వారు ఆధ్యాత్మికసుఖం పొందటం మాట దేవుడెరుగు, వారు ముందు ముందు లౌకికసుఖాలను కూడా పొందలేరు అని హెచ్చరిస్తున్నాడు. ఈ లౌకికసుఖాలు ఎలా ఉంటాయంటే, అవి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి కాని ఆ ఆనందం మూన్నాళ్ళ ముచ్చటగా మిగులుతుంది. ఆ ఆనందం ఒంట్లోని వేడినీ, మనస్సులోని వాడినీ, చేతిలోని విత్తాన్నీ క్షణంలో కరిగించివేస్తుంది.

**న సుఖమ్** – అందువల్ల ఈ విషయసుఖం ఎన్నాళ్ళో నిలవదు. జవసత్వాలు ఉడిగిపోతాయి, ఆస్తేమో హారతి కర్పూరంలా కరిగిపోతుంది. 'ధనసంపాదన మోజులో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశాడు. తర్వాత ఆరోగ్యాన్ని తిరిగి తెచ్చుకోవటంకోసం సంపాదించిన ధనమంతా వ్యయం చేస్తున్నాడు,' అన్నారొక మహానుభావుడు. అలా ఉంటుంది వీరి పరిస్థితి. చివరికి అటు డబ్బూ, ఇటు ఆరోగ్యమూ పోయి, రెంటికీ చెడ్డ రేవడి పరిస్థితిలా ఉంటుంది వీరి పరిస్థితి. అర్జునా అటువంటి దుస్థితి తెచ్చుకోకు అని పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ కింది శ్లోకంతో తన బోధను ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 24 **తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥**
తస్మాత్, శాస్త్రమ్, ప్రమాణమ్, తే, కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా, శాస్త్రవిధానోక్తమ్, కర్మ, కర్తుమ్, ఇహ, అర్హసి ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువలన | శాస్త్రవిధానోక్తమ్ | = శాస్త్రమర్యాదను అనుసరించి చెప్పబడిన |
| తే | = నీకు | కర్మ | = కర్మలనే |
| ఇహ | = ఈ | కర్తుమ్ | = చేయుటకు |
| కార్యాకార్యవ్యవస్థితౌ | = కార్యాకార్య వ్యవస్థయందు | అర్హసి | = తగియున్నావు |
| శాస్త్రమ్, ప్రమాణమ్ | = శాస్త్రమే ప్రమాణము | | |
| ఏవమ్, జ్ఞాత్వా | = ఈ విషయమును తెలుసుకొని | | |

**తస్మాత్ కార్య-అకార్య-వ్యవస్థితౌ తే శాస్త్రమ్ ప్రమాణమ్ (అస్తి),**
**శాస్త్ర-విధాన-ఉక్తమ్ కర్మ జ్ఞాత్వా (తత్ త్వమ్) ఇహ కర్తుమ్ అర్హసి ॥**

తా: అందువలన నీకు ఈ కార్యాకార్య వ్యవస్థయందు శాస్త్రమే ప్రమాణము. ఈ విషయమును తెలుసుకొని శాస్త్రమర్యాదను అనుసరించి చెప్పబడిన కర్మలనే చేయుటకు తగియున్నావు.

**తస్మాత్** – అందువల్ల. అందువల్ల అంటే ఎందువల్ల? ముందు శ్లోకంలో చేసిన హెచ్చరికను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ఏమిటది? శాస్త్రం చెప్పినట్టుగా నడుచుకోకపోతే, జ్ఞానయోగ్యతాప్రాప్తి రాదు; జ్ఞానయోగ్యతాప్రాప్తి రాదు కాబట్టి జ్ఞానమూ రాదు అని చెప్పాడు కృష్ణపరమాత్మ. మన లౌకికజీవనంలోనే ఒక టీవీ కొంటేనో, చిన్న సెల్‌ఫోన్ కొంటేనో దానితోపాటు ఒక మాన్యువల్‌ను ఇస్తారు. ఆ వస్తువును ఎలా వాడాలో, ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో అనేక సూచనలు ఉంటాయి అందులో. అవి పాటిస్తే లాభం, లేకపోతే మన ధనం వృథా. అలా భగవంతుడు మనను సృష్టించినప్పుడే మనతో పాటు ఒక మాన్యువల్‌ని కూడా మనకు సృష్టించి ఇచ్చాడు. మనం శాస్త్రం నిర్దేశించినదాన్ని పాటిస్తే, మన జీవితం కూడా అద్భుతంగా ఉంటుంది. లేకపోతే మనం కూడా అవస్థ పడతాము. అలా ఇక్కడ కలుపుకోవాలి.

**(తస్మాత్) శాస్త్రమ్** – శాస్త్రం అంటే ప్రధానంగా వేదశాస్త్రం. అది అపౌరుషేయం. తర్వాత పురుషబుద్ధిలోంచి వచ్చినవి రెండవశ్రేణి శాస్త్రములు. అవి స్మృతులు, ఇతిహాసాలు, పురాణాలు, సూత్రములు, ప్రకరణ గ్రంథములు. ఈ తక్కినవన్నీ వేదంనుంచి వచ్చాయి. అందువల్ల మనకు వేదం ప్రమాణం; అది మన జీవితాన్ని నిర్దేశిస్తుంది. ఏ విషయంలో?

**కార్యాకార్యవ్యవస్థితౌ** – ఏ కర్మలు చెయ్యాలో, ఏ కర్మలు చెయ్యకూడదో నిర్దేశిస్తుంది. వ్యవస్థితౌ అంటే నియమాలు, జీవనవిధానం. దేని గురించి? కార్యం అంటే చెయ్యాల్సిన పనుల గురించి; అకార్యం అంటే చెయ్యకూడని పనుల గురించి నియమాలు విధిస్తుంది. దీన్ని విధినిషేధవాక్యాలు అంటారు. ఇవి ధర్మ, అధర్మాల గురించి బోధిస్తాయి. అందువల్ల ఇక్కడ శాస్త్రం అంటే వేదపూర్వభాగాన్ని తీసుకోవాలి. దాన్నే కర్మకాండ అనీ, ధర్మశాస్త్రం అనీ అంటారు.

వేద అంతఃభాగంలో విధినిషేధాలు ఉండవు. ధర్మ, అధర్మాల గురించి ఉండవు. వేద అంతఃభాగంలో ఆత్మజ్ఞానం గురించి వస్తుంది. భగవద్గీతలో శాస్త్రంయొక్క గొప్ప ప్రణాళికను చాలాసార్లు చూశాము. కర్మయోగం

పాటించి చిత్తశుద్ధి పొంది; ఉపాసనయోగం పాటించి చిత్తఏకాగ్రత పొంది; జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి ఆత్మజ్ఞానం పొంది; మోక్షం పొందాలి.

ఇప్పుడు జ్ఞానయోగ్యత గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఇక్కడ శాస్త్రం అంటే వేదపూర్వ శాస్త్రాన్ని తీసుకోవాలి. వేద అంతఃభాగంలో జ్ఞానం పొందితే చాలు. దాని తర్వాత కర్మ చెయ్యనవసరం లేదు. వేదపూర్వభాగంలో అలాకాదు.

**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తమ్** – వేదపూర్వభాగంలో కర్మ గురించి తెలుసుకుంటే, శాస్త్రం విధించిన విధానంలో ఆ కర్మ చెయ్యాలి. జ్ఞానకాండలో జ్ఞానం పొందితే చాలు మోక్షం వస్తుంది; కాని కర్మకాండలో కర్మగురించిన జ్ఞానం పొందితే చాలదు; దాని తర్వాత కర్మ అనుష్ఠానం చెయ్యాలి. ఉదాహరణకు మీరు యోగాసనాల గురించి నేర్చుకున్నారు. మయూరాసనం, శీర్షాసనం, సర్వాంగాసనంవంటి అనేక ఆసనాల గురించి మీకు క్షుణ్ణంగా తెలుసు. ఎవరైనా ఎంతసేపు నువ్వు ఈ ఆసనాలు వేస్తావు అంటే నాకు వీటి గురించి తెలుసు, కాని నేను వెయ్యను అంటే మీకు ఆసనాలవల్ల కలిగే ప్రయోజనం కలుగుతుందా? కలగదు. ఆసనాలు గురించిన జ్ఞానం చాలదు; దానికి తగ్గ కర్మ చెయ్యాలి.

**కర్మ కర్తుమిహార్హసి** – శాస్త్రం చెప్పిన కర్మల విధివిధానాలననుసరించి ఆ కర్మ చెయ్యటానికి జ్ఞానం పొందాలి. ఆ కర్మలు చెయ్యాలి.

ఆ విధంగా కృష్ణపరమాత్మ ఎలా ఆసురీసంపత్తినుంచి దైవీసంపత్తికి ఎదగాలో, దాని తర్వాత వేదాంతం నేర్చుకుని, జ్ఞానం పొంది, ఎలా మోక్షం పొందాలో ఈ అధ్యాయంలో అద్భుతంగా వివరించాడు.

ఆసురీసంపత్తి → దైవీసంపత్తి → వేదాంతం → జ్ఞానం → మోక్షమ్

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే దైవాసురసంపద్విభాగయోగో నామ షోడశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు దైవాసురసంపద్విభాగయోగము అనే పదహారవ అధ్యాయము.

# అధ్యాయము 16 – దైవాసురసంపద్విభాగయోగము సారాంశము

భగవద్గీతలోని రెండు అధ్యాయాలు 16, 17 ఆత్మజ్ఞానం గురించి అసలు బోధించవు. నిజానికి భగవద్గీత బోధించే ముఖ్యాంశం ఆత్మజ్ఞానం. అయినా కృష్ణపరమాత్మ ఈ రెండింటిలో ఆ విషయాన్ని పక్కనపెట్టి జ్ఞానయోగ్యతాప్రాప్తి గురించి చెబుతున్నాడు. ఎందుకంటే శాస్త్రం కూడా పదేపదే చెబుతుంది, సంసిద్ధమైన మనస్సు ఉన్నవ్యక్తికే జ్ఞానం అబ్బుతుంది అని. సంసిద్ధమైన మనస్సు అంటే జ్ఞానయోగ్యత. అది కర్మయోగం, ఉపాసనయోగాలవల్ల వస్తాయని చూశాము. అవి చిత్తశుద్ధిని, చిత్త ఏకాగ్రతని పెంపొందించి, సాధకుణ్ణి సాధన చతుష్టయ సంపన్నుణ్ణి చేస్తాయి. ఈ విషయం సందర్భం దొరికినప్పుడల్లా శాస్త్రం చెబుతూనే ఉంది. అందువల్ల కృష్ణపరమాత్మ కూడా వీటికున్న ప్రాముఖ్యత దృష్ట్యా, జ్ఞానయోగ్యతాప్రాప్తి గురించి కూడా చెబుతున్నాడు. పైగా భగవద్గీత వేదపూర్వ, వేద అంతఃభాగాల సారాంశం.

జ్ఞానయోగ్యత లేకపోతే అతనికి ఆత్మజ్ఞానంవల్ల ప్రయోజనం ఉండకపోగా, ఒక్కోసారి వికటించవచ్చు కూడా. అహం బ్రహ్మ అస్మి జ్ఞానంలో ఆ అహం ఎవరో సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అది చాలా ప్రమాదకరం. ఇది ఇంత ముఖ్యం కాబట్టే ప్రతి ఉపనిషత్తులోనూ సాధనచతుష్టయ సంపత్తి గురించి వస్తుంది. ఆ మాటకొస్తే వేదాన్నే తీసుకుంటే, ఆత్మజ్ఞానం గురించి మొదట్లోనే రాదు. వేద అంతఃభాగంలో వస్తుంది. వేదపూర్వభాగం చాలా పెద్దభాగం. వేద అంతఃభాగం చాలా చిన్నది. వేదపూర్వభాగం ఈ జ్ఞానయోగ్యతను బోధిస్తుంది. దాన్ని సాంకేతికంగా **సంస్కారః** అంటారు.

వేదపూర్వభాగం మనిషికి నాలుగు ఆశ్రమధర్మాలను విధించింది. అవి – బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం. మనిషి జీవితం వందసంవత్సరాలు అనుకుంటే, 75 సంవత్సరాలు మొదటి మూడు ఆశ్రమాలకు అంకితం అవుతాడు. అంటే ఈ ఆశ్రమాల్లో సంస్కారం పొంది, ఆఖరి ఆశ్రమమైన సన్న్యాసంలో ఆత్మజ్ఞానం పొందాలి. వీటన్నిటినుంచి మనకు అర్థమవుతున్నది ఏమిటి? మనం జ్ఞానయోగ్యతను లేదా సాధన చతుష్టయ సంపత్తిని నిర్లక్ష్యం చెయ్యకూడదు. దీనికి చాలా ప్రాముఖ్యతను ఇవ్వాలి.

సంస్కారం లేకపోతే జ్ఞానాన్ని పొందలేము; జ్ఞానాన్ని పొందినా దాన్ని నిలుపుకోలేము; జ్ఞానాన్ని నిలుపుకున్నా అది ఆశించిన మార్పు తీసుకురాలేదు. ఒక రైతు తన పొలంలో విత్తనాలను జల్లేముందు నేలను చదును చేసి, ఏర్పాట్లు చెయ్యాలి. లేకపోతే ఎంత మంచి విత్తనమైనా కూడా, అది ఆ నేలలో సరిగ్గా ఎదగలేదు. అదే సూత్రం మన మనస్సు అనే నేలకు కూడా వర్తిస్తుంది. మన మనస్సును చదునుచేసి, తయారు చెయ్యకపోతే ఆత్మజ్ఞానం అనే విత్తనం సరియైన ఫలాన్నివ్వలేదు. అందువల్ల కృష్ణపరమాత్మ రెండు అధ్యాయాలను (16, 17) ఈ సంస్కారాలకు కేటాయించాడు.

**సంస్కార అనంతరమ్ ఏవ జ్ఞానం మోక్షం దదాతి**

సంస్కారం పొందాకనే, జ్ఞానం మోక్షాన్ని కలుగజేస్తుంది. ఈ సంస్కారాల గురించి కృష్ణపరమాత్మ చాలా వివరంగా ఈ అధ్యాయంలో విశ్లేషించాడు. విధినిషేధాలను దైవీసంపత్తిగా, ఆసురీసంపత్తిగా వివరించాడు.

ఇప్పుడు మనం ఆ దైవీసంపత్తిని, ఆసురీసంపత్తిని మళ్ళీ వివరంగా చూడబోవటం లేదు. ఇప్పుడు ఈ సారాంశంలో ఈ సంస్కారాన్నే ఇంకో కోణంలోంచి చూద్దాము. కోణం మారుతుంది తప్పితే, అంతిమ ఉద్దేశం, సంస్కారం గురించి నేర్చుకోవటం. సంస్కారం అంటే జ్ఞానయోగ్యత.

ఈ సంస్కారాన్ని నాలుగు కోణాల్లోంచి చూడవచ్చు. అవి మనిషిగా, కర్తగా, భోక్తగా, ముముక్షువుగా పొందాల్సిన సంస్కారాలు. ఒక్కొక్కటీ వివరంగా చూద్దాము.

1. **మనుష్యదృష్టి** – మనిషిగా మీరు జంతువుకన్నా ఉన్నతస్థాయిలో ఉన్నారు. మనిషిగా మీ కర్తవ్యం ఏమిటి? మనిషిగా మీరు పొందవలసిన, పొందగలిగిన సంస్కారాలు ఏమిటి?

ఎ) **శారీరక ఆరోగ్యం పెంచుకోవటం**– మొట్టమొదటిది ఆరోగ్యం. శాస్త్రం పదేపదే హెచ్చరిస్తుంటుంది, ఆరోగ్యాన్ని ఎన్నడూ నిర్లక్ష్యం చెయ్యకూడదు. ఎందుకంటే, ఆరోగ్యం బాగుండకపోతే జీవితంలో దేన్నీ సాధించలేరు. అందువల్ల ప్రతి ప్రార్థనలో ఆరోగ్యం గురించి వస్తుంది. మోక్షశాస్త్రం అయిన ఉపనిషత్తులు శాంతిపాఠంతో మొదలవుతాయి. అవి ఎందుకనుకున్నారు? ఈ ఉపనిషత్తు బోధను నేను శ్రద్ధగా నేర్చుకునేందుకు నాకు తగిన ఆరోగ్యాన్నియ్యి అని కోరటానికి.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః ... స్థిరైరంగైః సుష్టువాగ్ం సస్తనూభిః**

నా అన్ని అంగాలు స్థిరంగా ఉండుగాక. ఎందుకంటే ఒక గంట వేదాంతబోధ వినాలంటే వెన్నునొప్పి, మోకాలినొప్పి, మెడనొప్పివంటి బాధలేం లేకుండా ఉండాలి. చెవులు చక్కగా పనిచెయ్యాలి. గురువు చెప్పేది బాగా వినబడాలి. అందువల్ల మంచి ఆరోగ్యం లేనిదే దేన్నీ సాధించలేరు. 'ఆరోగ్యమే మహాభాగ్యం,' అన్నారెవరో మేధావి. అందువల్ల ఆరోగ్యసంస్కారం మొదటి సంస్కారం.

మళ్ళీ ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఆరోగ్యం అంటే ఒక్క శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు. శాస్త్రం గట్టిగా నొక్కివక్కాణిస్తుంది – ఆరోగ్యం అంటే శారీరక, మానసిక, బుద్ధిపరమైన ఆరోగ్యం. శారీరక ఆరోగ్యం గురించి మనకు బాగానే తెలుసు. ఏ ప్రకటన చూసినా అర్థమవుతుంది. యోగాసనాలు వెయ్యండి, ఇంతసేపు నడవండి, ఇటువంటి ఆహారం తీసుకోండి, ఇటువంటి ఆహారం తినకండి అంటూ హోరెత్తిస్తాయి ప్రకటనలు. అది తెలిసిందే. కాని తక్కినవి కూడా చూడాలి.

బి) **మానసిక ఆరోగ్యం పెంచుకోవటం** – మానసిక ఆరోగ్యం అంటే ప్రశాంతమైన మనస్సు కలిగివుండటం. ఎటువంటి ఆందోళనా లేకపోవటం. ఆరవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ చెప్పాడు, శరీర ఆరోగ్యం బాగుంటే శరీరం మనకు మిత్రునిలా ఉంటుంది; శరీర ఆరోగ్యం బాగుండకపోతే అదే శరీరం భారంగా ఉంటుంది – మనకు శత్రువుగా మారుతుంది. కృష్ణపరమాత్మ ఇదే సూత్రం మనస్సుకు కూడా వర్తిస్తుంది అంటున్నాడు. శాంతి, సమత్వం లేని మనస్సు భారంగా తయారవుతుంది. **అశాంతస్య మనోభారమ్.** అశాంతిగా ఉన్న మనస్సు భారంగా మారుతుంది, శత్రువుగా మారుతుంది, ఆటంకంగా అనిపిస్తుంది. అందువల్ల మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం.

నిజానికి ఈ దైవీసంపత్తి, ఆసురీసంపత్తుల గురించి చెప్పిందే మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవటానికి. దైవీసంపత్తికి అనుగుణమైన ఆలోచనలు మనస్సును ఆరోగ్యకరంగా ఉంచుతాయి. ఆసురీసంపత్తికి అనుగుణమైన ఆలోచనలు మనస్సుకు అనారోగ్యం కలుగజేస్తాయి. శాంతి అంటే స్ట్రెస్ లేకపోవటం. ఈ రోజుల్లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ పెద్ద అంశంగా మారింది. అందువల్ల శాంతి, సమత్వం ఉన్న మనస్సు ఉండాలి.

సి) **బుద్ధిపరమైన ఆరోగ్యం పెంచుకోవటం–** బుద్ధియొక్క ఆరోగ్యం అంటే నేర్చుకునే సామర్థ్యం; స్పష్టంగా ఆలోచించగలిగే సామర్థ్యం; అనుకున్నది బాగా చెప్పగలిగే సామర్థ్యం కలిగిన బుద్ధి ఉండాలి. చాలామందికి ఆలోచనల్లో స్పష్టత ఉండదు. అందువల్ల వారు చెప్పాలనుకున్నదాన్ని స్పష్టంగా చెప్పలేరు. ఆలోచనలు గందరగోళంగాను, అయోమయంగాను ఉంటే, వారు చెప్పే మాటలు కూడా అలాగే ఉంటాయి. కొంతమంది గంటల తరబడి మాట్లాడతారు కాని, వారు ఏం మాట్లాడదలుచుకున్నారో వారికే తెలియదు. కుటుంబసమస్య గురించో, ప్రభుత్వం గురించో ఏదో మొదలుపెడతారు కాని చెప్పాలనుకున్న విషయంమీద వారికే స్పష్టమైన అవగాహన ఉండదు. వారు గంటసేపు మాట్లాడినదాన్ని విన్నవ్యక్తి సరిగ్గా అర్థం చేసుకోగలిగితే, దాన్ని ఒక్క వాక్యంలోకి కుదించవచ్చు.

దీనికి కారణం ఆలోచనలో స్పష్టత లేకపోవటం. ఈ రోజుల్లో అందువల్లనే కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తున్నారు. జీవితమంతా ఏదో ఒకటి ఎవరో ఒకరికి చెబుతూనే ఉండాలి. పూర్వం అందువల్లనే తర్కశాస్త్రాన్ని నేర్పించేవారు. అది బుద్ధికి పదును పెట్టటానికి తోడ్పడుతుంది. ఇది స్పష్టంగా ఆలోచించటం నేర్పిస్తుంది. కుశాగ్రబుద్ధిని పెంపొందిస్తుంది. సాంప్రదాయ వేదాంతగ్రంథాల్లో కొన్నిచోట్ల ఫుట్‌నోట్స్ అని రాస్తారు. అసలు రచయిత ఒక పేరాగ్రాఫ్‌లో చెప్పినదాన్ని, వీరు ఒక వాక్యంలో రాసేస్తారు. అంటే అందులోని అతిముఖ్యమైన అంశాన్ని ఏరుతారు.

ఇది చాలా మంచి సాధన. ఒక గంటసేపు గీతాబోధ విన్నాక, స్వామీజీ ఆ గంటలో ఏం చెప్పారో కొన్ని సూక్ష్మమైన వాక్యాల్లో రాయటానికి ప్రయత్నించండి. అది మెదడుకు మేతగా ఉంటుంది. స్కూల్లో చదువుకునే రోజుల్లో ఇంగ్లీషులో ప్రెసీరైటింగ్ అని ఉండేది. ఇచ్చిన వ్యాసాన్ని సరిగ్గా మూడవ వంతుకు తగ్గించి రాయాలి. అంటే ఆ వ్యాసంలో 150 పదాలుంటే 50 పదాల్లో మనం తిరిగిరాయాలి. రచయిత చెప్పిన భావాన్ని మార్చకుండా, మన స్వంతమాటలతో, ఎక్కడా ముఖ్యమైన అంశాలను వదలకుండా రాయాలి. అదొక స్కిల్. దాన్ని సరిగ్గా పట్టించుకునేవారు కాదు చాలామంది. కాని అది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అది ఇందాక చూసినట్టుగా మెదడుకు మేత పెడుతుంది. అలా తర్కశాస్త్రం తోడ్పడుతుంది.

ఇంకొక అద్భుతమైన శాస్త్రం పాణినీ వ్యాకరణశాస్త్రం. అది సూత్రాలరూపంలో ఉంటుంది. ఏదైనా చెపితే, సరిగ్గా అర్థం చేసుకునేలాగా చెప్పాలి అంటారు పాణినీ. కాని ఇప్పటి జీవనవిధానంలో అది లోపిస్తోంది. మనం గాడిద గురించి మాట్లాడితే, కోతి గురించి మాట్లాడుతున్నాం అనుకుంటాడు ఎదుటివ్యక్తి. పొద్దున్న లేచిన దగ్గర్నుంచీ అనేకమందితో మాట్లాడాలి – భార్యాపిల్లలతో, తోటి ఉద్యోగులతో, బయటవారితో. మనం ఏదో చెబుతాము. వారు ఇంకేదో అర్థం చేసుకుంటారు. నేను బాధపడ్డాను అంటారు, మనం బ్రతిమాలతాము. సగం జీవితం వారు బాధపడటం, మనం బ్రతిమలాడటంతోనే సరిపోతుంది. ఎందుకు? మనకు స్పష్టంగా మాట్లాడే సామర్థ్యం లేకపోవటంవల్ల.

డి) **ఆర్జవం చూపటం** – అనేక స్థాయిల్లో ఆరోగ్యం బాగుండటం ఒకటే కాదు; అన్నీ అంగాలు కూడా ఏకత్రాటిమీద నడవాలి. ఈ సంస్కారం చాలా ముఖ్యమైన సంస్కారం. ఏదైనా ఒకపని చేస్తున్నప్పుడు శరీరం ఒకవైపు, ఇంద్రియాలు మరోవైపు, మనస్సు ఇంకోచోట ఉంటే చేసేపని సక్రమంగా, విజయవంతంగా సాగదు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతఃకరణం – ఈ మూడూ (14 అంగాలు) ఏకత్రాటిమీద నడవాలి. అప్పుడు ఏకాగ్రత కుదురుతుంది. చెల్లాచెదురుగా పడుతున్న సూర్యకిరణాలను భూతద్దంతో ఒకచోటకు కేంద్రీకరిస్తే ఆ కాంతి అక్కడ ఉన్న కాగితాన్ని కాల్చగలదు. అంటే విడివిడిగా పడుతున్న సూర్యకిరణాలకన్నా, ఒకచోట ఏకీకృతం చేసిన సూర్యకిరణాలకు చాలా శక్తి వస్తుంది. అదే విధంగా మన శరీరంలోని భిన్న అంగాలు, భిన్న దిశల్లో వెళితే శక్తి ఉండదు. అదే అన్నింటినీ ఒకచోట కేంద్రీకరింపజేయగలిగితే, పనిని అద్భుతంగా చెయ్యగలుగుతుంది.

ఇలా అన్ని అంగాలను ఒక్కచోట ఏకీకృతం చెయ్యగలగటాన్ని ఆర్జవం అంటారు. అష్టాంగయోగం అంతా ఈ ఆర్జవం పెంపొందించుకోవటానికి తోడ్పడుతుంది. ఇక్కడ కూడా చాలామందికి అష్టాంగయోగం గురించిన సరియైన అవగాహన లేదు. అష్టాంగయోగమే ఆత్మజ్ఞానాన్ని ఇస్తుందనుకుంటారు. అది పొరపాటు. అష్టాంగయోగం అన్ని అంగాలు ఏకత్రాటిమీద నడవటానికి, అంటే ఆర్జవం పెంపొందించుకోవటానికి తోడ్పడుతుంది అంతే. దాని తర్వాత వేదాంతానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. అష్టాంగయోగం గురించి ఆరవ అధ్యాయంలో వివరంగా చూశాము.

అలా శారీరక, మానసిక, బుద్ధిపర ఆరోగ్యం కలిగివుండటం. అన్ని అంగాలూ ఏకత్రాటిమీద నడవటం కలిసి మనిషిపరంగా సంస్కారం అవుతుంది.

2. **కర్త దృష్టి** – మనిషిగా మనకు ఫ్రీవిల్ ఉంది. మనిషిగా మనం బుద్ధిజీవులం. జంతువులకు ఈ ఫ్రీవిల్ లేదు. అవి బుద్ధితో ఆలోచించి నిర్ణయాలు తీసుకోలేవు. కర్తగా మనను మనం సంస్కరించుకోవాలి.

ఎ) **ఆలోచించి కర్మలు చేయటం**– ఈ సంస్కరణలో మొదటిమెట్టు ఆలోచించకుండా, అప్పటికప్పుడు ఏది తోస్తే అది మాట్లాడేయటం, తగ్గించుకోవాలి అంటుంది. ఆవేశంగా, అనాలోచితంగా మాట్లాడకూడదు. ఇటువంటి ఆవేశపూరిత, అసంకల్పిత చర్యలు జంతువులకు చెందుతాయి, మనుష్యులకు కాదు. కుక్కలు అరవాలనిపిస్తే పక్కన ఏమవుతుందో ఆలోచించకుండా అరుస్తాయి. గాడిదలకు తన్నాలనిపిస్తే ఎవరినైనాసరే తన్నుతాయి. అది వాటి లక్షణం. కాని మనిషిగా మనం ఇటువంటి అసంకల్పిత చర్యలను తగ్గించుకుని, వాటి స్థానంలో ప్రయత్నపూర్వకంగా ఆలోచించి పనులు చెయ్యటం నేర్చుకోవాలి. ఆలోచించి పనులు చెయ్యాలంటే, మాటలు కూడా ఆలోచించి మాట్లాడాలి అని అర్థం. ఎందుకంటే మాటలు వాచికకర్మలోకి వస్తాయి.

అంటే మనం శారీరకంగా ఏపని చేసినా, వాక్కుపరంగా ఏం మాట్లాడినా అవి ప్రయత్నపూర్వకంగా ఆలోచించాక, అదికూడా ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో అవన్నీ ఆలోచించాక అప్పుడు ముందడుగు వెయ్యాలి. ఏయే అంశాలు ఆలోచించాలి? గతంలో జరిగిన అనుభవాలను గుర్తు తెచ్చుకోవాలి. ఎందుకంటే మన ప్రస్తుతచర్యలు గత అనుభవాలమీద ఆధారపడివుంటాయి; ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి; భవిష్యత్తులో జరగబోయే

పరిణామాలను దృష్టిలో పెట్టుకోవాలి; అది కూడా వెంటనే కలిగే పరిణామాలు, సుదీర్ఘకాలపు పరిణామాలు ఆలోచించాలి; వ్యక్తిగా మన పరిస్థితులు ఆలోచించాలి; మన జీవితంలో ముడివడివున్న మన కుటుంబసభ్యులను, మన ఇరుగుపొరుగును, మన సమాజాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

వీటన్నిటినీ క్రోడీకరిస్తే మన గురించి, మన కుటుంబం గురించి, మన సమాజం గురించి, భూతభవిష్యత్ వర్తమాన కాలాల అనుభవాల గురించి ఆలోచించి ఏదైనా పనిచెయ్యాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆచితూచి అడుగువెయ్యాలి. ఇన్ని అంశాలను ఆలోచించాలంటే, ఎన్నడూ వెంటనే అనాలోచితంగా స్పందించలేరు. ఎందుకంటే ఇన్ని అంశాల గురించి ఆలోచించాలంటే, చాలా సమయం పడుతుంది. ఒక్కోసారి అసలు మాట్లాడలేరు కూడా. అందువల్ల ఆచితూచి అడుగు వెయ్యాలంటే, ప్రారంభంలో చాలా ఎక్కువ సమయం తీసుకుంటుంది. అయినా సరే వెంటనే స్పందించకూడదు అంటారు.

ఎన్నడూ వెంటనే, ఆలోచించకుండా, ఏమీ చెయ్యకూడదు. అది మన గొప్ప శత్రువు. మొదట్లో ఆలోచించేసరికి పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. అయినాసరే దాన్ని బాగా సాధన చేస్తే, ఎంత చిన్న విషయంలోనైనా సరే, తర్వాత త్వరగా నిర్ణయించగలుగుతాము. అలా సాధన చేయగా చేయగా బుద్ధి చాలా పదునుగా అవుతుంది. ఒక్క నిముషంలో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినాకూడా, ఇందాక చెప్పిన అన్ని విషయాలను క్షణాలమీద బేరీజు వేసేస్తుంది. అంటే భూతభవిష్యత్ వర్తమానకాలాలను, మన గురించి, కుటుంబం గురించి, సమాజం గురించి అన్నీ ఆలోచిస్తుంది. కంప్యూటర్‌కన్నా వేగంగా చేస్తుంది. కాని దానికి అఖండమైన సాధన కావాలి.

సంగీతసాధన విషయం తీసుకుంటే ఈ విషయం బాగా అర్థమవుతుంది. ఒక రాగం నేర్చుకోవాలంటే, వెంటనే హఠాత్తుగా దాన్ని నేర్చుకోలేము. ముందు సప్తస్వరాలను – సరిగమపదని(స)లను నేర్పిస్తారు. దాని తర్వాత ఆరోహణం–సరిగమపదనిస; అవరోహణం–సనిదపమగరిస నేర్పిస్తారు. తర్వాత నెమ్మదిగా మన స్థాయిని పెంచుకుంటూ వస్తారు. జంటస్వరాలను, వర్ణాలను, గీతాలను అలా ఒక్కొక్కటిగా నేర్పించుకుంటూ వస్తారు. తర్వాత శిష్టస్వరాలు అంటే గురువులు రచించిన స్వరాలను నేర్పిస్తారు; దాని తర్వాత కల్పనాస్వరాలను నేర్పిస్తారు. అవి గురువులు పాడుతుండగా వింటే చాలా వేగంగా పాడతాము.

అంత వేగంగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా పాడినా కూడా ఒక్క స్వరం కూడా తప్పుపోదు; రాగం తప్పదు; అపశృతి పలకదు. ఎందుకు? కేవలం తీవ్రమైన సాధనవల్ల. అదే విధంగా మన మనస్సుకు అనేక అంశాల గురించి ఆలోచించేలా శిక్షణ ఇస్తే అదికూడా రానురాను ఇంత వేగంగా బేరీజు వేయగలదు. అంటే నిర్ణయం తీసుకుని చెయ్యాల్సిన పనులకు ఒక్క నిముషమే ఉన్నాకూడా ఆ నిముషంలోనే బాగా నిర్ణయం తీసుకునే సమర్థత వస్తుంది. ఆ చేసే పనులు కూడా ఆలోచించి, ప్రయత్నపూర్వకంగా చేసే పనులు అవుతాయి. అందువల్ల కర్త స్థాయిలో సంస్కారం అంటే అనాలోచిత చర్యలను, ఆచితూచి చేసే చర్యలుగా మలుచుకోగలగటం.

బి) **సాత్త్వికకర్మలు చేయటం** – తెలివితక్కువ, అనాలోచిత కర్మల బదులు తెలివైన, సాత్త్వికకర్మలు చెయ్యాలి. ఏవి తెలివైన కర్మలు, ఏవి తెలివితక్కువ కర్మలు? ఏ కర్మలైతే ఎక్కువమందికి లాభదాయకంగా ఉంటాయో ఆ కర్మలు తెలివైన కర్మలు. తెలివితక్కువ కర్మలు అంటే చాలా తక్కువమందికి ఉపయోగపడే కర్మలు. అన్నింటికన్నా

తెలివితక్కువ కర్మ ఒక్కరే లాభం పొందే కర్మ. ఎవరా ఒక్కరు? ప్రత్యేకించి చెప్పేదేముంది? అటువంటి కర్మ ఎవరు చేస్తున్నారో అతను మాత్రమే లాభం పొందుతాడు; కనీసం అతని కుటుంబసభ్యులను కూడా పట్టించుకోడు.

ఇంతకన్నా దారుణమైన పరిస్థితి ఏమిటంటే, తక్కిన మనుష్యులు ఇతని కర్మలవల్ల లాభం పొందకపోగా, తీవ్రంగా నష్టపోతారు కూడా. అందువల్ల తెలివైన కర్మలు ఏమిటంటే, తక్కినవారు బాధపడకుండా, ఎక్కువమంది లాభం పొందేలా చేసే కర్మ. అటువంటి కర్మను సాత్త్వికకర్మ అంటారు. అందువల్ల సాత్త్వికకర్మ పెంచుకుంటూ వస్తే, అది సంస్కృతకర్మ అవుతుంది.

ఆ విధంగా కర్తగా సంస్కారం చూపాలంటే, అనాలోచిత కర్మలను ఆలోచించి చేసే కర్మలుగా మార్చాలి. రాజసిక, తామసిక కర్మలను సాత్త్వికకర్మలుగా మార్చాలి.

3. **భోక్త దృష్టి** – భోక్త అంటే కేవలం భోజనం చెయ్యటం మాత్రమే కాదు, భోక్త అంటే కర్మఫలాలను అనుభవించటం. సముద్రంలో ఎలాగైతే నిరంతరం అలలు తీరాన్ని తాకుతుంటాయో, అలా అనుభవాలనే అలలు మనం పొద్దున్న లేచినప్పటినుంచి రాత్రి పడుకునేదాకా మనను తాకుతూనే ఉంటాయి. ఆ అనుభవాలను భరించటాన్ని భోక్త అంటారు. భోక్తగా మనను మనం సంస్కరించుకోవటం ఎలా?

ఎ) **తెలివి చూపటం**– భోక్తగా అంటే కర్మఫలాలను అనుభవించే భోక్తగా, మనకు ఎటువంటి ఫలాలు వస్తాయో మనకు చెప్పిరావు. ఒకవేళ రాబోయే ఫలాలు మనకు తెలిసినా కూడా, వాటిని మనం అదుపులో పెట్టలేము. అంటే మన అధీనంలో లేవు రాబోయే ఫలాలు. భోక్తగా మన అదుపులో లేని అనుభవాలను పొందాలని గ్రహించటమే తెలివైనపని. వయస్సు పెరగకుండా ఆపటం మనచేతిలో లేదు; మన పిల్లలు రేపెలా మారతారో మనం చెప్పలేము. మనం భవిష్యత్తు రావటానికి బాటవేయగలమే కాని, భవిష్యత్తును అదుపులో పెట్టలేము. ఈ విషయం చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనం నిర్ణయం తీసుకోలేని పరిస్థితులను ఎదుర్కోకతప్పదు. ఈ ఎరుక మొదటి అడుగు అవ్వాలి.

ఓ అర్జునా, నీ చేతిలో లేని పరిస్థితులను ఎదుర్కోక తప్పదు, వాటిని నువ్వేమీ చెయ్యలేవు అని చెప్పేశాడు కృష్ణపరమాత్మ. అందువల్ల భోక్తగా మనం చూపించాల్సిన మొదటి సంస్కారం – కర్మఫలాలు నా చేతిలో లేవు.

బి) **మనస్సును దృఢపరచుకోవటం** – పరిస్థితులు మన చేతిలో లేనప్పుడు మన చేతిలో ఒకటే ఉంది. ఏమిటది? మన చేతిలో పరిస్థితులు లేవని తెలుసుకుని, మనస్సును దృఢపరుచుకోవటం. అప్పుడు ఎటువంటి పరిస్థితి ఎదురైనా అసలు బాధపడకుండానో, కనీసం ఎక్కువ బాధపడకుండానో తప్పించుకోవచ్చు. హోరున వాన కురుస్తుంటే, మనం అంత వానలోనూ బయటకు వెళ్ళాల్సివస్తే, వానను ఆపలేము కాని ఆ బాధను తగ్గించుకోగలము. ఎలా? రెయిన్‌కోటు వేసుకునో, గొడుగు పట్టుకునో వెళ్ళవచ్చు. మనస్సును దృఢపరచుకోవటం అంటే అదీ.

రాబోయే అనుభవాలు మన చేతిలో లేనప్పుడు మనస్సును దిటవు పరుచుకుంటే, జీవితంలో బాధపడకుండా, కృంగి కృశించి పోకుండా, ఇంకా మాట్లాడితే ఆత్మహత్య జోలికి పోకుండా నిలదొక్కుకోవచ్చు. కొంతమంది అనుకోని ఫలం ఏది వచ్చినా వారు కృంగిపోతారు, లేదా భగవంతుణ్ణో, సమాజాన్నో, కుటుంబసభ్యులనో నిందిస్తారు.

గుండె దిటవు చేసుకోవాలి, బాగానే ఉందికాని, దాన్ని గట్టిపరచుకోవటమెలా? మూడు పద్ధతుల్లో చెయ్యవచ్చు. ఒకటి మనకు మనం సూచనలను ఇచ్చుకోవటం. నేను ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకోగలను; నాకా ధైర్యం ఉందని పదేపదే మనస్సుకు చెప్పుకోవటం. రెండవ పద్ధతి భగవంతునిమీద భారం వెయ్యటం. అంటే ఆయనమీద నమ్మకం పెట్టుకోవటం. అప్పుడు తోటిమనుష్యులు నాకు తోడువచ్చినా, రాకపోయినా నాకు ఫర్వాలేదు. ఎంత ఘోరమైన దుఃఖాన్నైనా నేను భరించగలను. మూడవమార్గం ఆత్మజ్ఞానం పొందటం. ఆత్మజ్ఞానం పొందితే నేను కర్తనూ కాను, భోక్తనూ కాను అని తెలుసుకుంటాము. అది పూర్తిగా భోక్తగా మనకు బలాన్ని ఇస్తుంది.

సి) **ప్రజ్ఞ పెంచుకోవటం**– భోక్తగా ప్రజ్ఞను చూపించాలి. ప్రజ్ఞ చూపించటమంటే ఏమిటి? భోక్తగా కొన్ని బాధాకరమైన అనుభవాలను ఎదుర్కోకతప్పదు. అవి ఎంత వద్దనుకున్నా, మనమీద కొంత ప్రభావం కలిగించక తప్పదు. అది బాధ అవచ్చు, కోపం అవచ్చు, నిరాశ అవచ్చు, చిరాకు అవచ్చు. ఈ కోపమో, బాధో, చిరాకో కర్తమీద పడుతుంది. అంటే భోక్తగా మనం అనుభవించినది, కర్తగా మన కర్తవ్యంమీద దాని ప్రభావం చూపిస్తుంది.

ఉదాహరణకు ఒక విద్యార్థి ఇవాళ పరీక్ష రాయాలి. అంటే కర్తగా పరీక్ష రాయాలి. దానికి నిన్నటిదాకా బాగా చదివాడు. ఏ ప్రశ్న వచ్చినా రాయగల ధీమా ఏర్పడింది. కాని ఇవాళ పొద్దున్న ఇంట్లో ఏదో అనుకోని గొడవ అయ్యింది. అదంతా అతను విన్నాడు. భోక్తగా అతని మనస్సు కలత చెందింది. అప్పుడేమవుతుంది? భోక్తగా అతనికి అయిన అనుభవం, కర్తగా అతని కర్తవ్యంమీద దెబ్బతీస్తుంది. అతను పరీక్ష బాగా రాయలేకపోతాడు.

ఇలాంటి పరిస్థితిలోనే అతను తన ప్రజ్ఞను చూపాలి. తనలోని కర్తనూ, భోక్తనూ విడదీసి చూడాలి. భోక్తకు ఏమయినా కూడా, అది భోక్తకు సంబంధించినది; నేను ఇప్పుడు కర్తను అనుకోవాలి. అలా అనుకోకపోతే భోక్తకు అయిన బాధాకర అనుభవం కర్తను ప్రభావితం చేస్తుంది. అప్పుడు కర్త తన పని సవ్యంగా చెయ్యలేడు. అప్పుడది ఒక విషవలయంగా మారుతుంది. భోక్త ప్రభావం కర్తమీద పడుతుంది. కర్త తన పనిని సవ్యంగా చెయ్యలేడు; కర్త తన పనిని సవ్యంగా చెయ్యలేకపోయేసరికి, భోక్తగా మళ్ళీ మంచి ఫలం రాదు; మళ్ళీ మంచి ఫలం రాకపోతే మళ్ళీ దాని ప్రభావం కర్తమీద పడుతుంది; అతను మళ్ళీ కర్తగా సరిగ్గా చెయ్యలేడు. అలా భోక్తా–కర్తా–భోక్తా–కర్తా విషవలయంలో పడిపోతాడు. ప్రజ్ఞాశాలియైన భోక్త దాని ప్రభావం కర్తమీద పడకుండా జాగ్రత్త పడతాడు.

డి) **పాఠం నేర్చుకోవటం**– భోక్త ఏదైనా మనమంచికే అనుకోగలిగిన భోక్త అయితే, ప్రతి ఒక్క అనుభవంనుంచీ ఒక పాఠం నేర్చుకుంటాడు. నిజానికి భగవంతుడు నాకు ఈ అనుభవాలు కలుగజేస్తున్నది నేను పాఠం నేర్చుకోవటానికే అని అర్థం చేసుకుంటాడు. మంచి అనుభవాలు పాఠం నేర్పిస్తాయి; చెడు అనుభవాలు కూడా

పాఠం నేర్పిస్తాయి; నిజానికి చెడు అనుభవాలే ఇంకా ఎక్కువ పాఠాలు నేర్పిస్తాయి. ప్రతి ఒక్కచేదు అనుభవం వెనకా, ఒక గొప్ప పాఠం దాగివుంటుంది. భోక్త దాన్ని అందుకోగలిగితే, అతను నేర్చుకుని పైకి ఎదగగలడు. నిజానికి సాధనచతుష్టయ సంపత్తిని జీవితంలో ఎదురుదెబ్బలు తగిలితేనే పొందగలరు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్** – ముండకం

ఆ విధంగా అర్థం చేసుకునే నేర్పు ఉన్న భోక్త ప్రతి ఒక్క బాధాకరమైన అనుభవాన్ని కూడా తన జీవితానికొక పాఠంగా మలుచుకుంటాడు. జీవితమే పెద్ద పాఠశాల; అందులో కలిగే అనుభవాలు బెత్తంతో కొట్టే మాస్టారు అనుకుంటాడు. ఇలా అర్థం చేసుకునే నేర్పు లేకపోతే, ఒక పెద్ద నసమనిషిగా మారతాడు. ప్రపంచాన్ని, మనుష్యులను, భగవంతుణ్ణి తిడుతూ ఉంటాడు. లేదా ప్రతిదానికీ సణుగుతూ ఉంటాడు. 'నాకే ఎందుకు ఈ కష్టాలు?' అని వాపోతాడు. తనలో తను వాపోవటమేకాకుండా, ప్రపంచం అంతటికీ ఉదారంగా తన కష్టాలను పంచుతాడు. మనిషి ఉదారంగా చెయ్యగలిగిన దానం తన బాధలను, కష్టాలను, బెంగలను ఇతరులకు పంచటం. ఈ మనస్తత్వం ఉంటే వాటినుంచి నేర్చుకునే ఆస్కారం ఉండదు. అందువల్ల పాఠం నేర్చుకునే మనస్తత్వం ఉండాలి.

4. **ముముక్షుదృష్టి** – ముముక్షువుగా ఎలా సంస్కరించుకోవాలి? ఆధ్యాత్మ సాధకునికి మూడు అంశాలమీద శ్రద్ధ, భక్తి, అనుబంధం ఉండాలి. అవి భగవంతుడు, గురువు, శాస్త్రము.

ఎ) **భగవంతునిమీద భక్తి పెంచుకోవటం** – ప్రతి ఆధ్యాత్మిక సాధకునికీ భగవంతునిమీద భక్తిశ్రద్ధలు ఉండాలి. ఈశ్వరకృప లేనిదే ఆధ్యాత్మిక సాధన కుదరదు. ఆ విషయం స్వయంగా కృష్ణపరమాత్మే 18వ అధ్యాయంలో చెబుతాడు.

**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి ।**
**అథ చేత్ త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి ॥** – 18.58

అర్జునా, నా కృపాకటాక్షాలు ఉంటే నీ ఆధ్యాత్మిక జీవనం చాలా సునాయాసంగా సాగుతుంది. అందువల్ల భగవంతునిమీద శ్రద్ధ పెట్టుకో.

నిజానికి భగవంతుడంటే ఎవరని ఎవరన్నా ప్రశ్నిస్తే, మనం వారికి సరిగ్గా జవాబు చెప్పలేకపోయినా, లేదా నిజానికి మనకే భగవంతుడంటే ఎవరో స్పష్టమైన అవగాహన లేకపోయినా, ఏదో ఒక విధమైన భక్తి ఏర్పరచుకోవటం మంచిది.

ఒక గొప్ప సిద్ధాంతి అన్నాడు, 'ఒకవేళ భగవంతుడు లేకపోయినా కూడా, భగవంతునిమీద భక్తిని ఏర్పరచుకుంటే అది జీవితానికి ఎంతో మేలు చేస్తుంది.' ఆ విధంగా భక్తి చాలా మంచిది; భగవంతుడు ఉన్నా లేకపోయినా. భగవంతుడు లేడని మనమనటం లేదు కాని భగవంతుడు లేడనుకున్నవారు కూడా భగవంతునిమీద భక్తిని

పెంచుకుంటే అది వారికే ఎంతో మంచిది. వారి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం మెరుగుపడతాయి; బుద్ధి కూడా పదునుగా, సూక్ష్మంగా అవుతుంది. భక్తి, అనుబంధం రెండూ ఉండాలి.

భక్తి ఉండగానే సరిపోదు; రోజులో కొంతభాగం ప్రత్యేకించి భగవంతునికి కేటాయించాలి. అది పూజ అవచ్చు, సహస్రనామం చదవటం అవచ్చు, జపం చేయటం అవచ్చు – ఏదైనా కానీ కొంత సమయం పూర్తిగా దైవచింతనలో గడపాలి. కొంతమంది నేను కారులో వెళుతూనో, రైలుప్రయాణం చేస్తూనో, నడుస్తూనో పూజ చేస్తాను అంటారు. అవన్నీ బోనస్ పూజలు. కాని ప్రత్యేకించి భగవంతునికోసమే రోజులో అధమపక్షం 10–15 నిముషాలు కేటాయించాలి. వేరే ఏపనీ చెయ్యకూడదు అప్పుడు. తర్వాత ఇంక మీ ఇష్టం. నడుస్తూనో, బస్సులో వెళుతూనో, వేరే పనులు చేస్తూనో, ఆఖరికి పడుకునో ఎప్పుడైనా, ఎక్కడైనా దైవాన్ని తలుచుకోండి, అది మంచిదే. కాని భగవంతునికి మాత్రం పూర్తిగా కొంత సమయాన్ని కేటాయించండి. నిజానికి మీ ఇంటికి మీ స్నేహితుడు వస్తే, ఇల్లు తుడుచుకుంటూనో, వేరేపని చేస్తూనో అతనితో మాట్లాడతారా? పనులన్నీ పక్కన పెట్టివచ్చి, అతని పక్కన కూర్చుని అతనితో మనస్సు విప్పి మాట్లాడతారు. అదే సూత్రం భగవంతునికి కూడా వర్తిస్తుంది. ఇంకా మాట్లాడితే ముఖ్యంగా భగవంతునికి వర్తిస్తుంది. పనులన్నీ మానుకుని, శ్రద్ధగా కాసేపు భగవంతుని ముందు కూర్చుని, మనస్ఫూర్తిగా మీరు చేసే ప్రార్థన చెయ్యండి. ప్రార్థన అంటే భగవంతునితో ఒక విధంగా అనుబంధం పెంచుకోవటం. అటువంటి అనుబంధం పెంచుకుంటే భగవంతుని కృప మీమీద అపారంగా కురుస్తుంది.

బి) **గురువుమీద భక్తి పెంచుకోవటం** – గురువుమీద శ్రద్ధ, గురువుతో అనుబంధం ఉండాలి. గురువు నాకు మంచే చేస్తాడు అనుకోవాలి. గురువుతో అనుబంధం పెంచుకోవాలంటే గురువు చెప్పేది శ్రద్ధగా, నమ్మకం పెట్టుకుని వినాలి. గురువు పక్కన ఖాళీగా కూర్చోవటం కాదు. అలా చెయ్యటం అసమంజసం; ఇబ్బందికరం కూడా. సత్సంగం లేదా గురుసంగం అంటే గురువునుంచి విద్య నేర్చుకోవటం. **గురు ఉపదేశ శ్రవణం.** గురువు చేసే ఉపదేశాన్ని శ్రద్ధగా నాకు మంచి కలుగుతుందనే నమ్మకంతో శ్రవణం చెయ్యటం.

సి) **శాస్త్రంమీద భక్తి పెంచుకోవటం** – శాస్త్రంమీద శ్రద్ధ, శాస్త్రంతో అనుబంధం ఉండాలి. ఒకవేళ శాస్త్రం మిమ్మల్ని తప్పుదారి పట్టిస్తున్నట్టు అనిపించినా, అది సత్యం కాదు. శాస్త్రం ఎప్పుడూ తప్పుదారి పట్టించదు; మీరే దాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు అని అర్థం చేసుకోవాలి. శాస్త్రంతో అనుబంధం పెంచుకోవాలి అంటే ఏం చెయ్యాలి? ప్రతిరోజూ శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి. గీతాబోధకు వారానికి ఒకసారి వెళుతుంటే, ఆ ఒక్కరోజే గీతను ముట్టుకుంటాను అంటే కుదరదు.

నిజానికి శాస్త్రంతో ప్రతిరోజూ అనుబంధం పెంచుకుంటే అది ఇంకా మంచిది. ఎందుకంటే, గురువు ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉండకపోవచ్చు; కాని శాస్త్రం మీ చేతిలోనే ఉంటుంది. పైపెచ్చు శాస్త్రం భగవంతుడు మీకు ఇచ్చిన మార్గదర్శి కాబట్టి **శాస్త్రాన్ని అనుసరించాలి**. అందువల్ల మీరు విన్న బోధలో, మీరు రాసుకున్న నోట్సును మళ్ళీ చూసుకుంటే మీకు అది మననంగానో, నిదిధ్యాసనంగానో పనికివస్తుంది.

ఈ నాలుగు అంశాలనూ మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము. మనం సంస్కారం చూపాల్సిన అంశాలు –

1. **మనుష్యదృష్టి** – శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, బుద్ధిపరంగా ఆరోగ్యం పెంచుకోవటం, ఆర్జవం చూపటం.
2. **కర్తదృష్టి** – ఆలోచించి కర్మలు చేయటం, సాత్త్విక కర్మలు చేయటం.
3. **భోక్తదృష్టి** – తెలివి చూపటం; మనస్సును దృఢపరచుకోవటం, ప్రజ్ఞ పెంచుకోవటం, పాఠం నేర్చుకోవటం.
4. **ముముక్షుదృష్టి** – భగవంతునిమీద, గురువుమీద, శాస్త్రంమీద భక్తి, అనుబంధం పెంచుకోవటం.

ఇది ఈ అధ్యాయంయొక్క సారాంశం. పదహారవ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి –

**1. దైవీసంపత్తి – శ్లోకాలు: 1–3**
**2. ఆసురీసంపత్తి – శ్లోకాలు: 4–21**
**3. శాస్త్రంయొక్క ప్రాముఖ్యత – శ్లోకాలు: 22–24**

**1. సంక్షిప్త దైవీసంపత్తి – శ్లోకాలు: 1–3**

కృష్ణపరమాత్మ ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడే దైవీగుణాలను (26 గుణాలు) పేర్కొన్నాడు. అందులో కొన్ని అహింస, సత్యం, అక్రోధం, త్యాగం, క్షమ, శౌచమ్. ఈ గుణాలు మనిషి సంస్కరించబడటానికి తోడ్పడతాయి. దీన్నే మనం ఇంతకుముందు నాలుగు కోణాల్లో చూశాము. అవి మనుష్యదృష్టి, కర్తదృష్టి, భోక్తదృష్టి, ముముక్షుదృష్టి. ఆ విధంగా దైవీసంపత్తి సంస్కారం పెంపొందించుకోవటానికి తోడ్పడుతుంది. దైవీసంపత్తి 26 అంశాలు.

| | | |
|---|---|---|
| 1. అభయమ్ | 10. అహింసా | 19. హ్రీః |
| 2. సత్త్వసంశుద్ధిః | 11. సత్యమ్ | 20. అచాపలమ్ |
| 3. జ్ఞానయోగవ్యవస్థితిః | 12. అక్రోధః | 21. తేజః |
| 4. దానమ్ | 13. త్యాగః | 22. క్షమా |
| 5. దమః | 14. శాంతిః | 23. ధృతిః |
| 6. యజ్ఞః | 15. అపైశునమ్ | 24. శౌచమ్ |
| 7. స్వాధ్యాయః | 16. దయా భూతేషు | 25. అద్రోహః |
| 8. తపః | 17. అలోలుప్త్వమ్ | 26. నాతిమానితా |
| 9. ఆర్జవమ్ | 18. మార్దవమ్ | |

**2. సంక్షిప్త ఆసురీసంపత్తి – శ్లోకాలు: 4–21**

కృష్ణపరమాత్మ ఆధ్యాత్మిక సాధనకు అడ్డుపడే లేదా అది సాగకుండా అడ్డుపడే గుణాలను ఆసురీసంపత్తిగా వర్ణించాడు. ఇవి ఉంటే సంస్కారం పెంపొందించుకోలేదు సరికదా, ఇంకా కిందికి పడిపోతాడు ఆధ్యాత్మికంగా.

| | |
|---|---|
| 1. దంభః | 4. పారుష్యమ్ |
| 2. క్రోధః | 5. అభిమానః |
| 3. దర్పః | 6. అజ్ఞానమ్ |

**3. శాస్త్రంయొక్క ప్రాముఖ్యత – శ్లోకాలు: 22–24**

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ శాస్త్రంయొక్క ప్రాముఖ్యత గురించి వివరించాడు. పూర్వకాలంలో వైదిక సాంప్రదాయంలో శాస్త్ర అధ్యయనానికి చాలా ప్రాముఖ్యతను ఇచ్చేవారు. పూర్వం బ్రహ్మచారులు గురుకులంలో ఉండి, విద్యను నేర్చుకునేవారు. అప్పుడు వారు తప్పనిసరిగా శాస్త్ర అధ్యయనం చేసేవారు. ఆ రోజుల్లో బ్రాహ్మణులు, పురోహితులే కాదు, అందరూ శాస్త్రాన్ని అధ్యయనం చేసేవారు.

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యమితి సత్యవచారాథీతరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధ్యాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః। తద్ధి తపస్తద్ధి తపః॥** – తైత్తిరీయం

ఆధ్యాత్మిక సాధన అంటే క్రమపద్ధతిలో శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటం. కాని ఇప్పుడు గురుకుల వ్యవస్థ పోయింది. ఆధునిక విద్యావిధానంలో శాస్త్ర అధ్యయనానికి చోటులేకుండా పోయింది. పైగా మనుష్యుల్లో కూడా శాస్త్రం గురించిన అపోహలు ఉన్నాయి. దాని ప్రాముఖ్యత, దాని ఆవశ్యకత తెలియక ఏదో బుద్ధికి పదును పెట్టేది మాత్రమే అనుకుంటున్నారు. అందువల్ల అటువంటివారికి కృష్ణపరమాత్మ గట్టి హెచ్చరికే చేస్తున్నాడు.

**తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే** – 16.24

శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే, కాకపోతే గురువుద్వారా అధ్యయనం చేస్తే, దానికి ఈశ్వరకృప కూడా తోడవుతుంది. అప్పుడు ఆధ్యాత్మిక సాధనలో విజయం పొంది, మోక్షం పొందుతావు.

**తతో యాతి పరాం గతిమ్** – 16.22

ఆ విధంగా ఆఖరి మూడు శ్లోకాల్లో శాస్త్రంయొక్క ప్రాముఖ్యతను వివరించాడు.

కాని ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ చర్చించిన ముఖ్యాంశం దైవీసంపత్తి, ఆసురీసంపత్తి కాబట్టి ఈ అధ్యాయానికి **దైవాసురసంపద్విభాగయోగము** అని పేరు వచ్చింది.